thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 325 కరీంనగర్ శనివారం, 31 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఎస్ఐఆర్ సంస్కరణ కాదు, బలవంతపు అణచివేత

న్యూఢిల్లీ: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తీవ్రమైన పని ఒత్తిళ్ల కారణంగా పలువురు బూత్ లెవెల్ ఆఫీసర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఉదంతాలపై ఘాటుగా స్పందించారు. ఎస్ఐఆర్‌ను బలవంతపు అణిచివేతగా అభివర్ణించారు. ఈ ప్రక్రియ దేశ ప్రజలను వేధించేందుకు చేపట్టిన 'ఉద్దేశపూర్వక కుట్ర' అని ఆరోపించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఈమేరకు ఆయన ఒక ట్వీట్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ దేశంలో అలజడి రేపిందని, ప్రజాస్వామ్యానికి తిలోదకాలు వదిలి అధికారంలో ఉన్నవారికి కొమ్ము కాసేందుకు ఉద్దేశించిన ప్రక్రియ అని రాహుల్ పేర్కొన్నారు.

నిజమైన ఓటర్లను తప్పించడం ద్వారా ఎలక్టోరల్ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా తారుమారు చేయడం, ఓట్ల చోరీని అప్రతిహతంగా కొనసాగించం ఎస్ఐఆర్ లక్ష్యమని ఆరోపించారు. 'ఎస్ఐఆర్ పేరుతో పౌరులను వేధించేందుకు ఉద్దేశపూర్వకంగా కుట్ర జరిగింది. విపరీతమైన ఒత్తిడి బీఎల్ఓల మృతికి కారణమవుతోంది' అని తప్పుపట్టారు.




# నిర్మలమ్మ 'పొద్దు'పై మధ్యతరగతి ఆశలు!

## సొంతింటి కల కంటున్న వారికి బడ్జెట్‌లో గుడ్‌న్యూస్?

## ఆ పరిమితిని పెంచే అవకాశం!

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న పార్లమెంటులో నూతన బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్ కోసం యావత్ దేశం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ముఖ్యంగా బడ్జెట్ దేశంలోని గృహనిర్మాణ రంగం సహా అనేక రంగాలలో గణనీయమైన మార్పులను తీసుకువచ్చే అవకాశం ఉంది. ఇల్లు కొనాలని కలలు కంటున్న లక్షలాది మందికి ఈ బడ్జెట్ భారీ రిలీఫ్ ఇస్తుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఆర్థిక వృద్ధిని పెంచడంతో పాటు, ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్ గృహనిర్మాణ రంగంపై కూడా దృష్టి పెడుతుంది. ముఖ్యంగా సరసమైన గృహాల నిర్వచనంలో పెద్ద మార్పు చేసే అవకాశం ఉంది. ఇది మెట్రోపాలిటన్ ప్రాంతాలలో ఇల్లు కొనడాన్ని సులభతరం చేస్తుంది. రియల్ ఎస్టేట్ రంగం, గృహ కొనుగోలుదారులు చాలా కాలంగా సరసమైన గృహాల ధర పరిమితిని పెంచాలని డిమాండ్ చేస్తున్నారు, ప్రభుత్వం బడ్జెట్ ద్వారా దీనిని పరిష్కరించవచ్చు. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. మన దేశంలో రూ.45 లక్షల వరకు ధర ఉన్న ఇళ్ళు, ఫ్లాట్లు సరసమైన గృహాల కేటగిరిలో ఉన్నాయి. ఈ వర్గం కింద, మెట్రో నగరాల్లో గరిష్టంగా 60 చదరపు మీటర్లు, మెట్రోయేతర నగరాల్లో 90 చదరపు మీటర్ల వరకు నిబంధన ఉంది.

భూమి, నిర్మాణ సామగ్రి, శ్రమ ధరలో గణనీయమైన పెరుగుదల కారణంగా ఈ పరిమితి ఇటీవలి కాలంలో అసాధ్యంగా మారింది. రియల్ ఎస్టేట్ పరిశ్రమ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రభుత్వం 2017లో రూ.45 లక్షల పరిమితిని నిర్ణయించినప్పుడు మార్కెట్ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ప్రస్తుత దృష్టాంతంలో ప్రధాన నగరాల్లో రూ.70 లక్షల కంటే తక్కువ ధరకు రెండు బెడ్‌రూమ్‌ల ఫ్లాట్‌ను కనుగొనడం కూడా సవాలుగా ఉంది. ఈ సమస్య కారణంగా మొదటిసారి ఇల్లు కొనుగోలు చేసేవారు సరసమైన గృహాల వర్గం నుండి మినహాయించబడ్డారు. పన్ను మినహాయింపులు, సబ్సిడీల నుండి ప్రయోజనం పొందలేకపోతున్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో డెవలపర్లు, కొనుగోలుదారులు సరసమైన గృహాల గరిష్ట ధర పరిమితిని రూ.70-90 లక్షలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ మార్పు అమలులోకి వచ్చిన తర్వాత, ఇది మధ్యతరగతికి గణనీయమైన ఉపశమనం కలిగించడమే కాకుండా గృహనిర్మాణ రంగానికి కూడా ఊతం ఇస్తుంది.

# ప్రపంచ దేశాలతో తెలంగాణ రాష్ట్రం పోటీ పడాలి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

షాద్ నగర్: ప్రపంచ దేశాలతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో పోటీ పడే విధంగా ఎదగాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రంగారెడ్డి జిల్లా మొగలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150 సంవత్సరాల ఉత్సవాలకు శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సర్వతో ముఖంగా ఎదగాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధి పై ప్రత్యేక దృష్టిని పెట్టిందని తెలిపారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో అత్యాధునిక సౌకర్యాలతో రూ. 22 వేల 500 కోట్ల రూపాయలతో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్కొక్క పాఠశాలను 25 ఎకరాల ప్రాంగణంలో రూ.200 కోట్ల రూపాయలతో అత్యాధునిక సౌకర్యాలతో రూపకల్పన చేసి నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి పరిశ్రమల యజమాన్యాలకు అవసరమైన విధంగా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నామని, దేవుడు సహకరిస్తే ఆర్థిక పరిస్థితి బాగుపడితే ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారాన్ని అందిస్తామని అన్నారు. ఇప్పటికే కొన్ని పాఠశాలలో పైలెట్ ప్రాజెక్టుగా మొదలుపెట్టామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 40% డైట్ చార్జీలను, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచామని తెలిపారు. ప్రతి నియోజకవర్గం,జిల్లా కేంద్రాలలో అత్యాధునిక వసతులతో వైద్యశాలలను ఏర్పాటు చేస్తున్నామని, విద్య, వైద్యం ప్రజలకు అందుబాటులో ఉంటే రాష్ట్రం అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న మహిళలందరినీ మహాలక్ష్మి లుగా గౌరవించుకోవాలని అర్హులైన ప్రతి మహిళకు నాణ్యమైన ఇందిరమ్మ చీరలను అందించామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న మహిళా గ్రూపులకు రూ. 27 వేలకోట్ల వడ్డీలేని రుణాలను పంపిణీ చేశామని ఇది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ నిబద్ధత అని బట్టి విక్రమార్క అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ తో సాగు, తాగు నీళ్లు అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, క్యాబినెట్ మంత్రులు దృఢమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మొగలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150 సంవత్సరాల వార్షికోత్సవ ప్రారంభోత్సవంలో గత సంవత్సరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని పాఠశాల అభివృద్ధి కోసం కేటాయించిన రూ. 10 కోట్ల తో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అలాగే పాఠశాలలో హైదరాబాద్ స్టేట్ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు పేర బూర్గుల మెమోరియల్ ఏర్పాటు చేయాలని కోరారు. బూర్గుల తీసుకువచ్చిన చట్టాలను ఇక్కడ ప్రదర్శన చేస్తే నేటి సమాజానికి తెలియజేసిన వారమవుతామని అన్నారు. అలాగే పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలను పంపిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి తో మాట్లాడి నిధులను మంజూరి చేయిస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. అంతకుముందు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రధాన మంత్రులు జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ తీసుకువచ్చిన పంచవర్ష ప్రణాళికలతో నేడు దేశం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు. చరిత్ర ఎప్పుడు ప్రస్తుతానికి కులమానమని, భవిష్యత్తుకు



మార్గదర్శకమని మొగిలిగిద్ద పాఠశాల 150వ వార్షికోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. విద్యతోనే వ్యక్తికి, కుటుంబానికి సమాజంలో పేరు వస్తుందని, నేడు తల్లిదండ్రులు తమ పిల్లలకు స్థిర చరాస్తుల కంటే విద్యను అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. అనంతరం షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ హైదరాబాద్ స్టేట్ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి, ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ సత్యనారాయణ రెడ్డి వంటి ఇద్దరు మహామహులు విద్యను అభ్యసించిన గొప్ప పాఠశాల మొగిలిగిద్ద పాఠశాలని అన్నారు. ఇలాంటి చారిత్రాత్మక పాఠశాలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మొగుడికిద్ద గ్రామాన్ని దత్తత తీసుకొని దరిద్రం పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం పాఠశాల సందర్శనకు వస్తే కనీసం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవసరమైన మౌలిక వసతులు సైతం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి పాఠశాలలో మౌలిక వసతులను కల్పించడం జరిగిందని అన్నారు. పాఠశాల 150వ వార్షికోత్సవాలలో పాల్గొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాఠశాల నూతన భవన నిర్మాణం కోసం, గ్రామంలో రహదారుల అభివృద్ధి కోసం భారీగా నిధులను మంజూరు చేశారని వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మొగిలిగిద్ద గ్రామ సర్పంచ్ ఎశమోని కృష్ణయ్య, పాఠశాల పూర్వ విద్యార్థి ఉస్మానియా, సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్, పౌర హక్కుల సంఘం నాయకుడు హరగోపాల్, విద్యాశాఖ జైన్ డైరెక్టర్ సోమిరెడ్డి, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఈవో సుశింద్రరావు, షాద్ నగర్ ఆర్డీవో సరిత, ఫరుఖ్ నగర్ తహసిల్దార్ నాగయ్య, ఎంఈఓ మనోహర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బండారి సంతోషి,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్ రెడ్డి, గ్రామస్తులు, మహిళా సంఘాలు, పూర్వ విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న ప్రముఖులు

మేడారం : మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో పలు ప్రముఖులు పాల్గొని శుక్రవారం అమ్మవారి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ కుటుంబ సమేతంగా అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సైతం అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

ఎంపీ బలరాం నాయక్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యులు గణేష్, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ మేడారం జాతరను సందర్శించి అమ్మవారు దర్శనం చేసుకున్నారు.పొలిటికల్ ఎకనామిక్ అడ్వైజర్ నళిని రఘురాం, రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా అమ్మ వార్లకు మొక్కులు చెల్లించారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గ్యారత్ వెన్ వుమెన్ అమ్మవారి దర్శనం చేసుకున్నారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ కు గద్దల వద్ద జరిగిన నూతన కట్టడాలు అభివృద్ధి గురించి అందులోని విశేషాలు గురించి మంత్రి సీతక్క వివరించారు.






# పైసలుంటేనే పోటీ చేయండి...

## ఆశావహులకు స్పష్టం చేస్తున్న ప్రధాన పార్టీలు

హైదరాబాద్ : పోటీ తీవ్రతతో పెరగనున్న ఖర్చులుచైర్మన్ పదవులు ఇస్తామంటే కొంత ఖర్చు పెట్టుకుంటామంటున్న లీడర్లుమహబూబ్‌నగర్, వెలుగు: మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా పోటీ చేయాలనుకుంటున్న వారిని ఖర్చుల భయం వెంటాడుతోంది. ఒక్కో పార్టీ నుంచి ప్రతి డివిజన్, వార్డులో పో టీకి నలుగురైదుగురు సిద్ధంగా ఉన్నా..

గతంలో కంటే ఈసారి ఎక్కువ ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ తరుణంలో పార్టీలు సై తం ఎన్నికల్లో పోటీ చేసే వారికి ఎలాంటి ఫండ్ పార్టీ పరంగా రాదని సంకేతాలు ఇస్తున్నారు. ఎవరి ఖర్చు వారే పెట్టుకోవాలని ఇటీవల రహస్య సమావేశాల్లో స్పష్టం చేశారు. ఖర్చు పెట్టుకునే శక్తి ఉంటేనే బరిలోకి దిగాలని సూచిస్తున్నారు.

**గతంలో కంటే పెరగనున్న ఖర్చు..** గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో క్యాండిడేట్లకు ఖర్చులు తడిసి మోపెడు కానున్నాయనే చర్చ జరుగుతోంది. పార్టీల మధ్య పోటీ ఎక్కువగా ఉండడంతో.. క్యాండిడేట్లు పోటాపోటీగా ఖర్చు చేయాల్సి వస్తుందని భావిస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో 12 నుంచి 15 వార్డుల వరకు ఉండగా.. ఒక్కో వార్డులో 1,400 నుంచి 1,800 మంది ఓటర్లు ఉన్నారు. ఈ వార్డుల్లో పోటీ చేయాలనుకునే క్యాండిడేట్ కు కనీసం రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని అంటున్నారు. పాత మున్సిపాలిటీల్లో 20 నుంచి 45 వార్డుల వరకు ఉండగా.. ఈ వార్డుల్లో 1,500 నుంచి 2,500 మంది ఓటర్లు ఉన్నారు. ఈ మున్సిపాలిటీల్లో ఒక్కో వార్డుకు రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు ఖర్చు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. కార్పొరేటర్‌గా పోటీ చేయాలనుకునే వారు లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుందని అంటున్నారు.

ఒక్కో డివిజన్‌లో 2,500 నుంచి 3 వేల మంది ఓటర్లకు పైగా ఉండడంతో రూ.40 లక్షలకు పైగా ఖర్చుల భారం పడే అవకాశం కనిపిస్తోంది. దీంతో పార్టీలు కూడా క్యాండిడేట్లకు ఎన్నికల ఫండ్? ఇవ్వడానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

**చైర్మన్ పీఠం ఆఫర్ ఇస్తే!...** పార్టీల నుంచి ఫండ్ రాదని తెలిసి పోటీ చేయాలనుకుంటున్న వారు డైలమాలో పడ్డారు. అయితే కొందరు లీడర్లు మాత్రం తమకు చైర్మన్ పీఠం ఇస్తామని హామీ ఇస్తే పార్టీ నుంచి పోటీ చేసే క్యాండిడేట్ల కోసం ఖర్చు పెట్టుకొని వారిని గెలిపించుకుంటామని ఆయా పార్టీల జిల్లాల బాస్‌ల ముందు చెబుతున్నట్లు తెలిసింది. కొద్ది రోజుల కింద నారాయణపేట జిల్లాలోని ఓ మున్సిపల్ పీఠాన్ని ఆశిస్తున్న ఒక లీడర్‌ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లను గెలిపించుకునేందుకు రూ.కోటికి పైగా ఇచ్చేందుకు సిద్ధమని చెప్పినట్లు సమాచారం.

అలాగే మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓ మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్న లీడర్ ఒక్కో కౌన్సిలర్ క్యాండిడేట్ కు ఎన్నికల ఖర్చు కోసం రూ.5 లక్షల చొప్పున ఇస్తానని ప్రకటించినట్లు తెలిసింది.

**పార్టీని నమ్ముకున్న వారి పరిస్థితేంటి?...** ప్రధాన పార్టీల నుంచి ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న సీనియర్ లీడర్లు అసంతృప్తితో ఉన్నారు. ఏండ్లుగా పార్టీ కోసం పని చేసిన తమను కాదని, వేరే పార్టీ నుంచి పార్టీలో చేరిన వారికి, గతంలో ఓ పార్టీలో కౌన్సిలర్లుగా పని చేసిన వారికి బీ ఫారాలు ఇచ్చే ప్రయత్నాలు జరుగుతుండడంతో నిరాశ చెందుతున్నారు. ఎన్నికల ఖర్చులు భరించలేరని చెప్పి టికెట్ నిరాకరిస్తుండడంతో ఆవేదన చెందుతున్నారు. వీరికి ఓటు బ్యాంక్, ఆయా సామాజిక వర్గాల నుంచి సపోర్ట్? ఉన్నా.. పోటీకి అవకాశం ఇవ్వకపోవడంతో ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారు.




మేడారం మహాజాతర మూడో రోజు కొనసాగుతోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో మేడారం జనసంద్రంగా మారింది. దీంతో అక్కడి రహదారులన్నీ రద్దీగా మారాయి. జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు గద్దెల వద్ద అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు.




క్యూబా లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ దేశానికి చమురు విక్రయించే ఏ దేశంపైనైనా టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులపై ఆయన సంతకం కూడా చేశారు. క్యూబా విషయంలో జాతీయ అత్యవసర పరిస్థితి కింద ట్రంప్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ దేశ ప్రభుత్వం అమెరికా జాతీయ భద్రతకు, విదేశాంగ విధానానికి తీవ్రమైన ముప్పుగా మారిందని పేర్కొన్నారు.

ఈ తాజా ఉత్తర్వులు శుక్రవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానున్నాయి. ట్రంప్ తాజా చర్య మెక్సికో (వీవఞఅఎశీ)పై ఒత్తిడి పెంచనుంది. క్యూబా ప్రభుత్వం నుంచి దూరం కావాలని దానిపై ట్రంప్ ఒత్తిడి చేస్తున్నారు. ఇటీవల మెక్సికో దేశాధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ మాట్లాడుతూ.. క్యూబాకు చమురు రవాణాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, అమెరికా ఒత్తిడి కారణంగా ఈ నిర్ణయం తీసుకోలేదని ఆమె స్పష్టం చేశారు.

**కెనడా విమానాలపై 50శాతం టారిఫ్‌లు..!..** అమెరికా– కెనడాల మధ్య సంబంధాలు మరింత దెబ్బతిన్నాయి. కెనడాపై ట్రంప్ మరోసారి టారిఫ్‌ల బెదిరింపులకు పాల్పడ్డారు. అమెరికాలోకి దిగుమతయ్యే కనడాకు చెందిన విమానాలపై 50శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. జార్జియా కేంద్రంగా పనిచేస్తున్న అమెరికాకు చెందిన గల్ఫ్‌స్ట్రీమ్ ఏరోస్పేస్ జెట్‌లకు సర్టిఫై చేసేందుకు కెనడా నిరాకరించిందని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.

దీన్ని వెంటనే సరిదిద్దుకోకపోతే.. టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. వీటిపై కెనడా ఇంకా స్పందించలేదు. కాగా.. ఇటీవల చైనాతో ట్రేడ్ డీల్‌పై ముందుకెళ్తే ఆ దేశ దిగుమతులపై 100 శాతం సుంకాలు విధిస్తానని ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మరోసారి హెచ్చరికలు చేయడం గమనార్హం.




## హార్వర్డ్ యూనివర్సిటీలో లీడర్‌షిప్ కోర్సు పూర్తి చేసిన సీఎం రేవంత్

హార్వర్డ్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలోని 'కెనెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్'లో లీడర్‌షిప్ కోర్సు పూర్తి చేశారు. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నుంచి సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ నెల 25 నుంచి 30 వరకు 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' పేరిట నిర్వహించిన తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈ విషయాన్ని సీఎం ఎక్స్‌లో పంచుకున్నారు. 20 దేశాల నుంచి వచ్చిన 60 మంది విద్యార్థులతో కలిసి తరగతులకు హాజరైనట్లు.. టీచర్స్, తోటి విద్యార్థుల నుంచి ఎంతో నేర్చుకున్నట్లు తెలిపారు.




హైదరాబాద్: భారత వాయుసేనకు చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం ఆధ్వర్యంలో బేగంపేట విమానాశ్రయంలో వింగ్స్ ఇండియా–2026 విమానయాన ప్రదర్శన మూడోరోజు కొనసాగుతోంది. ఆకాశంలో విహరిస్తూ భారీ శబ్దం, పొగతో విమానాలతో చేసే విన్యాసాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనను తిలకించేందుకు సందర్శకులు భారీగా తరలివచ్చారు.

## పథకం ప్రకారమే నల్లమలసాగర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారు: హరీశ్‌రావు




హైదరాబాద్: పథకం ప్రకారమే పోలవరం–నల్లమలసాగర్‌కు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. సుప్రీంకోర్టులో ఈ ప్రభుత్వం చెల్లని పిటిషన్ వేసి రిట్‌ను ఉపసంహరించుకున్నారని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియా సమావేశంలో మాట్లాడారు. "ప్రస్తుతం దిల్లీలో జరుగుతున్నది పేరుకే జలవివాదాల కమిటీ సమావేశం. పోలవరం–నల్లమలసాగర్‌కు పరిష్కారం కోసమే ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. 200 టీఎంసీల గోదావరి జలాలను ఏపీకి తరలించుకుపోయే కుట్ర జరుగుతోంది. నేను ప్రశ్నించిన తర్వాత వ్యతిరేకిస్తున్నట్లు కేంద్రానికి లేఖ రాశారు. రెండు కండీషన్లు పెట్టి దిల్లీలో సమావేశానికి వెళ్లారు. ఏపీ ప్రభుత్వం నల్లమలసాగర్‌కు డీపీఆర్ ఆపాలని, ఈ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి ఇవ్వొద్దని రెండు షరతులు విధించారు. వీటికి కేంద్రం ఎలాంటి హామీ ఇవ్వకుండానే సమావేశానికి ఎందుకు వెళ్లారు? నల్లమలసాగర్‌కు అంగీకరించి తెలంగాణకు మరణశాసనం రాయాలని అనుకుంటున్నారా? ఈ సమావేశానికి కూడా ఆదిత్యనాథ్‌దాసునే పంపించారు. ఆయన గతంలో ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా కేంద్రానికి లేఖలు రాశారు. మన ప్రాజెక్టులకు అడ్డుపడిన వ్యక్తి ఇవాళ ఈ రాష్ట్రం తరఫున వాదనలకు వెళ్లారు. కేసీఆర్ ప్రభుత్వం గోదావరిపై 7 ప్రాజెక్టులకు డీపీఆర్‌లను పంపించింది. బీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం. అవసరమైతే కేసీఆర్ నాయకత్వంలో మరో పోరాటానికి మేం సిద్ధంగా ఉన్నాం. చంద్రబాబు ఒత్తిడితో దిల్లీలో జరుగుతున్న సమావేశాన్ని రాష్ట్రం బహిష్కరించాలి. కాదని పాల్గొంటే మరో పోరాటానికి సిద్ధం కావాలి. తెలంగాణ నీళ్లు ఏపీకి ధారాదత్తం చేస్తుంటే చూస్తూ ఊరుకోం"అని హరీశ్‌రావు అన్నారు.




హైదరాబాద్/అహ్మదాబాద్, జనవరి 30: అహ్మదాబాద్ పోలీసులు చైల్డ్ ట్రాఫికింగ్ రాకెట్‌ను ఛేదించారు. అహ్మదాబాద్ నుంచి హైదరాబాద్‌కు అప్పుడే పుట్టిన శిశువును తరలిస్తుండగా ట్రాఫికింగ్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం.. ఈ శిశు ట్రాఫికింగ్‌లో హైదరాబాద్‌కు చెందిన రోషన్ అగర్వాల్ అనే ఏజెంట్ కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది.

ఈ ముఠా అహ్మదాబాద్‌లోని ఒక ఆస్పత్రి నుంచి నవజాత శిశువును రూ.3.60 లక్షలకు కొనుగోలు చేసి, హైదరాబాద్‌లోని కొందరికి అమ్మాలని ప్లాన్ చేసినట్లు సమాచారం. అయితే అహ్మదాబాద్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఓ కారులో నవజాత శిశువును గుర్తించారు. శిశువుకు సంబంధించి కారులోని వారిని ప్రశ్నించగా.. వారు సరైన సమాధానం చెప్పలేకపోయారు.

దీంతో అనుమానించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా గుట్టు బట్టబయలైంది. ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన ఏజెంట్ రోషన్ అగర్వాల్, మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు అహ్మదాబాద్ పోలీసులు. ప్రస్తుతం చిన్నారి పోలీసుల సంరక్షణలో ఉన్నట్లు తెలుస్తోంది. శిశువు తల్లిదండ్రులను గుర్తించి వారికి అప్పగించేందుకు పోలీసులు ప్రయత్నాలు చేపట్టారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు..




కరీంనగర్, జనవరి 30: కరీంనగర్ నగర పోలీస్ కమిషనర్‌ని మతం పేరుతో దూషించిన వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. 126 (2), 132, 196, 299 బిఎన్ఎస్ సెక్షన్‌లతోపాటు మరికొన్ని సెక్షన్ల కింద ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

**అసలేం జరిగిందంటే..?...** కరీంనగర్ జిల్లా వీణవంకలో స్థానికంగా సమ్మక్క జాతర వేడుకగా సాగుతోంది. ఈ జాతరకు గురువారం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కుటుంబసమేతంగా భారీ కాన్వాయ్‌తో బయలుదేరారు. దాంతో ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. జాతర నిర్వహణపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో పరిమిత వాహనాలనే అనుమతి ఇస్తామని ఎమ్మెల్యేకు పోలీసులు సూచించారు. దాంతో పోలీసులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కారులో నుంచి దిగి.. తన కుటుంబసభ్యులతో కలిసి జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. తమను అడ్డుకోవద్దని పోలీసులను హెచ్చరించారు. ఆ క్రమంలో పోలీస్ కమిషనర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమని.. తనను అడ్డుకుంటే సంగతి చెబుతానంటూ బెదిరింపులకు దిగారు కౌశిక్ రెడ్డి. దీంతో పోలీసులు, కౌశిక్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం నాలుగు వాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వడంతో.. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి వీణవంకకు వెళ్లారు. వీణవంక జాతరలో దళిత మహిళా సర్పంచ్ చేత కొబ్బరికాయ కొట్టించాలంటూ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పట్టుబట్టారు. దీంతో అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి పోలీసులు సూచించారు. పోలీసుల సూచనను ఆయన బేఖాతరు చేశారు. దాంతో ఎమ్మెల్యేను అక్కడి నుంచి పోలీసులు బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. మరోవైపు వీణవంకలో సమ్మక్క జాతర ట్రస్టీ ఉదయానందరెడ్డి వర్గానికి, కౌశిక్ రెడ్డి వర్గానికి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ జాతరకు కౌశిక్ రెడ్డి వస్తే.. ఘర్షణ జరిగే ఆస్కారం ఉందని పోలీసులు భావించారని సమాచారం.

## మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు ముగిసిన గడువు




హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసింది. చివరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. ఇవాళ సాయంత్రం 5 గంటలకు నామినేషన్ గడువు మగియగా.. అప్పటి వరకు క్యూలైన్‌లో ఉన్న వారిని నామినేషన్ వేసేందుకు అనుమతిస్తున్నారు. శనివారం అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఉపసంహరణకు ఫిబ్రవరి 3 వరకు గడువు ఉంది. రాష్ట్రంలో మొత్తం 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 11న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు. మున్సిపల్ ఎన్నికల ఫిర్యాదులకు ఎస్ఈసీ టీఈ పోల్ మొబైల్ యాప్ ఏర్పాటు చేసింది. tsec.gov.in ద్వారా కూడా ఫిర్యాదులకు అవకాశం కల్పించినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.




వరంగల్: ఇద్దరు యువకులు వేధించడం, అవమానించడం తట్టుకోలేక ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సీత్యతండాకు చెందిన అనిత.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. అనితను తొర్రూరు మండలానికి చెందిన దూరపు బంధువు రాజేందర్ పెళ్లి చేసుకుంటానని నాలుగేళ్లుగా చెబుతూ వస్తున్నాడు. ఇటీవల అనిత డ్యూటీలో ఉండగా వీడియో కాల్ చేయమని చెప్పడం, ఎవరితోనో మాట్లాడుతున్నావంటూ రాజేందర్ ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. అతని వేధింపులు తట్టుకోలేక అనిత తన తల్లిదండ్రులతో చెప్పి బాధపడింది. రాజేందర్ పద్ధతి నచ్చక, తమ కూతురుని అతడికి ఇచ్చి పెళ్లి చేయడం కుదరదని తేల్చి చెప్పారు. అయినా అనితను పెళ్లి చేసుకుంటానంటూ బతిమలాడుతూనే ఉన్నాడు. మరోవైపు అనిత తన క్లాస్‌మేట్ అయిన జబ్బార్ లాల్‌ని ప్రేమించడం మొదలుపెట్టింది. ఇద్దరూ పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుందామని భావించారు. ఇటీవల జబ్బార్ కూడా మోసగాడని తేలింది. పెళ్లి చేసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని పదేపదే వేధించడం మొదలు పెట్టాడు. జబ్బార్ వేధింపులు తట్టుకోలేక మనస్తాపానికి గురైన అనిత ఈ నెల 27న రాజేందర్ కు ఫోన్ చేసి 'నువ్వు, జబ్బార్ నా జీవితంతో ఆడుకున్నారు, నన్ను వేధించారు, అవమానించారు, మీ వల్లనే నేను ఆత్మహత్య చేసుకుంటున్నా' అంటూ బాధపడింది. అనితకు ధైర్యం చెప్పాల్సిన రాజేందర్ నిర్లక్ష్యంగా 'చావు.. నీ ఇష్టం' అంటూ ఫోన్ కట్ చేశాడు. దాంతో అనిత తీవ్ర మనస్తాపానికి గురై గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ అనిత కన్నుమూసింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రాజేందర్, జబ్బార్ లపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# పట్టణ గెలుపే రేపటి రాజకీయ దిశా నిర్దేశం : తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యం

## కాంగ్రెస్‌కు పరీక్ష! బీఆర్ఎస్‌కు పునరుజ్జీవనం తెలంగాణ మున్సిపల్ ఎన్నికల విశ్లేషణ




తెలంగాణలో ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల నేపథ్యం రాష్ట్ర రాజకీయాలను మరో కీలక మలుపు వద్ద నిలబెడుతోంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలుగా భావించే మున్సిపల్ ఎన్నికలు ఈసారి అధికార కాంగ్రెస్ పార్టీకి, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు, అలాగే బీజేపీకి రాజకీయంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మార్పు అనంతరం తొలిసారిగా పట్టణ స్థాయిలో ప్రజాభిప్రాయాన్ని కొలిచే అవకాశం రావడంతో ఈ ఎన్నికలు కేవలం మున్సిపాలిటీ పాలనకే పరిమితం కాకుండా, రాష్ట్ర స్థాయి రాజకీయ బలాబలాలను నిర్ణయించే పరీక్షగా మారాయి. అందువల్లే తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు ఇప్పుడు 'మినీ అసెంబ్లీ ఎన్నికలు'గా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. తెలంగాణలో మున్సిపల్ పాలనకు ప్రత్యేక చరిత్ర ఉంది. 2014లో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పట్టణీకరణ వేగంగా పెరిగింది. హైదరాబాద్‌తో పాటు వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, రామగుండం వంటి పట్టణ కేంద్రాలు ఆర్థికంగా, జనాభా పరంగా విస్తరించాయి. 2011 జనగణన ప్రకారం తెలంగాణలో పట్టణ జనాభా సుమారు 38 శాతంగా ఉండగా, తాజా అంచనాల ప్రకారం ఇది 42 శాతానికి చేరువవుతోంది. అంటే రాష్ట్ర రాజకీయాల్లో పట్టణ ఓటర్ల పాత్ర రోజు రోజుకీ పెరుగుతోంది. ఈ పట్టణ ఓటర్లే మున్సిపల్ ఎన్నికల ద్వారా తమ అసంతృప్తి లేదా మద్దతును నేరుగా వ్యక్తం చేసే స్థితిలో ఉన్నారు. గత దశాబ్దంలో తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికలను పరిశీలిస్తే, అవి రాష్ట్ర రాజకీయాలకు సూచికలుగా ఎలా మారాయో స్పష్టంగా తెలుస్తుంది. 2019--20లో అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ (అప్పట్లో టీఆర్ఎస్) మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. 141 మున్సిపాలిటీల్లో 88కి పైగా చోట్ల బీఆర్ఎస్ ఆధిపత్యం కొనసాగింది. ఆ ఫలితాలు తరువాత జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ రాజకీయ వేడిని పెంచాయి. జీహెచ్ఎంసీ ఎన్నికలు బీజేపీ ఎదుగుదలకు వేదికగా మారగా, బీఆర్ఎస్ తన పట్టును నిలుపుకుంది. ఈ పరిణామాలన్నీ మున్సిపల్ ఎన్నికలు రాష్ట్ర రాజకీయ దిశను ఎలా ప్రభావితం చేస్తాయో అప్పుడే నిరూపించాయి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు ముగింపు పలకడం తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పు. ఈ నేపథ్యంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తొలి పెద్ద పట్టణ పరీక్షగా మారుతున్నాయి. అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత ప్రజల ముందుకు వెళ్లే ఈ ఎన్నికల్లో ప్రభుత్వ పనితీరు, ఇచ్చిన హామీల అమలు, పాలన శైలి నేరుగా ప్రజా తీర్పుకు లోనవుతుంది. అందుకే కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. కాంగ్రెస్ పార్టీ దృష్టిలో మున్సిపల్ ఎన్నికలు రెండు విధాలుగా కీలకం. ఒకవైపు అసెంబ్లీ ఎన్నికల్లో పొందిన ప్రజాభిమానాన్ని పట్టణ స్థాయిలోనూ నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది. మరోవైపు బీఆర్ఎస్ హయాంలో బలంగా ఉన్న పట్టణ స్థానిక సంస్థలపై తన పట్టు సాధించాల్సిన రాజకీయ అవసరం ఉంది. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 142 మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో అధిక భాగం ఇప్పటికీ బీఆర్ఎస్ ప్రభావంలోనే ఉన్నాయనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారంలో తన సామర్థ్యాన్ని చూపించాల్సి ఉంటుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు పట్టణ ప్రజల్లో ఎంత మేరకు విశ్వాసం పొందాయన్నది కూడా ఈ ఎన్నికల్లో తేలనుంది. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా వంటి పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ ప్రభావం చూపినప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం, జీవన వ్యయం, ఇంధన ధరలు, అద్దె భారం వంటి సమస్యలు ప్రధానంగా ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో ఈ అంశాలపై ప్రజల స్పందన కాంగ్రెస్‌కు కీలకంగా మారనుంది. ఇక ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు ఈ మున్సిపల్ ఎన్నికలు రాజకీయ పునరుజ్జీవనానికి అవకాశంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ ఎదుర్కొంటున్న అంతర్గత అసంతృప్తులు, నాయకుల వలసలు, కార్యకర్తల్లో నైరాశ్యం వంటి పరిస్థితుల్లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు బీఆర్ఎస్‌కు పరీక్షగా నిలుస్తున్నాయి. గతంలో పట్టణ ప్రాంతాల్లో బలమైన పట్టు ఉన్న పార్టీగా పేరున్న బీఆర్ఎస్, ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తే తన రాజకీయ స్థితిని తిరిగి బలపరుచుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలు, ఉత్తర తెలంగాణ పట్టణాల్లో బీఆర్ఎస్‌కు ఇప్పటికీ గణనీయమైన ఓటు బ్యాంకు ఉందన్న అంచనాలు ఉన్నాయి. బీఆర్ఎస్ వ్యూహం ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల చుట్టూ తిరగనుంది. అధికారంలోకి వచ్చి తక్కువ కాలంలోనే ఇచ్చిన హామీలు అమలు కాలేదని, అభివృద్ధి పనులు నిలిచి పోయాయని, ఆర్థిక పరిస్థితి దెబ్బతిందని ఆరోపణలు చేస్తూ పట్టణ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. మున్సిపాలిటీలకు నిధుల కొరత, పారిశుద్ధ్య సమస్యలు, తాగునీటి ఇబ్బందులు వంటి అంశాలను ప్రధానంగా ప్రచారంలోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికలు తన రాజకీయ ప్రాధాన్యత ఇంకా తగ్గలేదని నిరూపించుకునే వేదికగా మారాయి. మూడవ ప్రధాన పార్టీగా బీజేపీ కూడా తెలంగాణ మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గణనీయమైన విజయాలు సాధించిన బీజేపీ, పట్టణ ఓటర్లలో తన పట్టు పెంచుకోవాలనే లక్ష్యంతో ఉంది. ముఖ్యంగా మధ్యతరగతి, యువత, వ్యాపార వర్గాల్లో తన ప్రభావాన్ని విస్తరించేందుకు మున్సిపల్ ఎన్నికలను ఉపయోగించుకోవాలని భావిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటీని ఆసరాగా చేసుకుని కొన్ని పట్టణాల్లో కీలక పాత్ర పోషించాలన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ప్రధానంగా చర్చకు వచ్చే అంశాలు పట్టణ జీవనానికి నేరుగా సంబంధించినవే. తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, చెత్త నిర్వహణ, రహదారుల పరిస్థితి, ట్రాఫిక్ సమస్యలు, అక్రమ నిర్మాణాలు, పట్టణ ప్రణాళిక లోపాలు వంటి సమస్యలు ఓటర్లను ప్రభావితం చేస్తాయి. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొన్ని పట్టణాల్లో మౌలిక వసతులు మెరుగు పడ్డాయన్న అభిప్రాయం ఉన్నప్పటికీ, అనేక చోట్ల అసమాన అభివృద్ధి జరిగిందన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యలను ఎంత వేగంగా పరిష్కరిస్తుందన్నది ప్రజల తీర్పులో కీలకంగా మారనుంది. గణాంకాల పరంగా చూస్తే తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రాధాన్యత మరింత స్పష్టమవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కలిపి సుమారు 3,500కు పైగా వార్డులు ఉన్నాయి. ఒక్కో వార్డులో సగటున 3,000 నుంచి 5,000 వరకు ఓటర్లు ఉంటారు. అంటే దాదాపు కోటి మంది పట్టణ ఓటర్లు నేరుగా ఈ ఎన్నికల్లో పాల్గొంటారు. ఈ స్థాయి ఓటర్ల అభిప్రాయం రాష్ట్ర రాజకీయాలకు స్పష్టమైన సంకేతాన్ని ఇస్తుంది. అంతేకాదు, ఈ ఎన్నికల ద్వారా వేలాది మంది ప్రజాప్రతినిధులు ఎంపిక అవుతారు. వీరిలో భవిష్యత్తులో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా ఎదిగే నాయకులు ఉండే అవకాశం ఉంది. అందువల్ల అన్ని పార్టీలు ఈ ఎన్నికలను నాయకత్వ తయారీ వేదికగా కూడా చూస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక పార్టీలకు పెద్ద సవాల్‌గా మారింది. తెలంగాణలో పట్టణ రాజకీయాల్లో వ్యక్తిగత పరిచయాలు, సామాజిక సమీకరణాలు, స్థానిక సమస్యలపై అవగాహన కీలకంగా ఉంటాయి. పార్టీ ఇమేజ్ ఎంత బలంగా ఉన్నా, స్థానిక అభ్యర్థిపై అసంతృప్తి ఉంటే ఫలితాలు ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో అనేక చోట్ల పార్టీ కంటే అభ్యర్థి వ్యక్తిగత ప్రభావమే గెలుపును నిర్ణయించిన సందర్భాలు ఉన్నాయి. అందువల్ల ఈసారి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం కూడా కీలక సూచికగా మారనుంది. సాధారణంగా తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం 55 నుంచి 60 శాతం మధ్యే ఉంటుంది. అయితే ఇటీవల పట్టణ ప్రజల్లో రాజకీయ చైతన్యం పెరగడం, సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ కావడంతో ఓటింగ్ శాతం పెరిగే అవకాశాలు ఉన్నాయి. అధిక ఓటింగ్ ప్రభుత్వంపై అసంతృప్తిని సూచిస్తుందా లేక ప్రజల చైతన్యాన్ని ప్రతిబింబిస్తుందా అన్నది ఫలితాల అనంతరం విశ్లేషణకు అంశంగా మారనుంది. మీడియా, సోషల్ మీడియా కూడా ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఒక మున్సిపాలిటీలో జరిగిన చిన్న సంఘటన కూడా రాష్ట్రవ్యాప్తంగా చర్చకు రావడం, పార్టీల మధ్య ఆరోపణలు--ప్రత్యారోపణలు పెరగడం రాజకీయ వేడిని పెంచుతోంది. పట్టణ ఓటర్లు వార్తలు, విశ్లేషణలను తక్షణమే అందుకుంటూ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్థితిలో ఉన్నారు. ఇది మున్సిపల్ ఎన్నికలను మరింత సున్నితంగా, ప్రతిష్ఠాత్మకంగా మారుస్తోంది. మొత్తంగా తెలంగాణలో ప్రస్తుత మున్సిపల్ ఎన్నికలు కేవలం స్థానిక సంస్థల పాలనకే పరిమితం కావడం లేదు. ఇవి కాంగ్రెస్ ప్రభుత్వానికి తొలి పెద్ద పట్టణ పరీక్షగా, బీఆర్ఎస్‌కు రాజకీయ పునరుజ్జీవన అవకాశంగా, బీజేపీకి విస్తరణ వేదికగా మారాయి. అభివృద్ధి, సంక్షేమం, పాలన సామర్థ్యం, ప్రజల విశ్వాసం అన్నీ ఈ ఎన్నికల్లో పరీక్షకు నిలుస్తున్నాయి. అందువల్ల తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో తాత్కాలిక ప్రభావంతోనే కాకుండా, భవిష్యత్ రాజకీయ దిశను నిర్ణయించే కీలక ఘట్టాలుగా నిలవనున్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# యూజీసీపై సుప్రీంకోర్టు ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు.. చదవాలి అందరూ!




ప్రస్తుతం దేశ వ్యాప్తంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)పై తీవ్ర చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా దర్నాలు, ర్యాలీలూ, తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ ఈ విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదని అంటున్నారు. ఈ సమయంలో.. ఈ నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిల్ పై సర్వోన్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో సుప్రీం ధర్మాసనం పలు సంచలన వ్యాఖ్యలు చేస్తూ.. కీలక నిర్ణయం తీసుకుంది. అవును... ఉన్నత విద్యా సంస్థలలో సమానత్వాన్ని ప్రోత్సహించడానికి ఉద్దేశించిన యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ కొత్త నిబంధనలపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఇదే సమయంలో ఈ మేరకు తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై గురువారం స్టే విధించింది. ఈ సందర్భంగా.. చట్టంలోని వివక్షతకు సంబంధించిన వివాదాస్పద నిర్వచనంపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ నిబంధనను సుప్రీంకోర్టు నిలిపివేసింది. తదుపరి నోటీసులు ఇచ్చేంతవరకు నిబంధనలపై స్టే అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. తాజా నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తి జోయ్ మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా అటు కేంద్రానికి, ఇటు యూజీసీకి నోటీసులు జారీ చేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇందులో భాగంగా... స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని దశాబ్దాల తర్వాత.. కులవివక్ష లేని సమాజం కోసం మనం ఏం సాధించాం అని ప్రశ్నిస్తూ.. ఈ విషయంలో మనం మళ్లీ సమాజాన్ని వెనక్కి తీసుకెళ్తున్నామా అనే భావన కలుగుతోందని సుప్రీం అభిప్రాయపడింది! ఈ సందర్భంగా... దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలు ఇలా దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తమ సంప్రదాయాలకు అనుగుణంగానే వ్యవహరిస్తారని.. అలాంటివారిని ర్యాగింగ్ పేరుతో కొందరు అవహేళన చేస్తుండటం అత్యంత బాధాకరమని.. వాటిని అరికట్టేందుకు ప్రత్యేక హాస్టళ్లు ఉండాలని మాట్లాడుతున్నారని చెప్పిన ధర్మాసనం... మరోవైపు ప్రస్తుతం సమాజంలో కులాంతర వివాహాలే జరుగుతున్నాయని.. హాస్టళ్లలోనూ అందరూ కలిసే ఉంటున్నారని తెలిపింది. కాగా... రోహిత్ వేముల కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు యూజీసీ నిబంధనలు-2012 స్థానంలో కొత్త నిబంధనలను ఈనెల 13 నుంచి అమలులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. అయితే, కొత్త నిబంధనలలోని కులవివక్ష నిర్వచనాన్ని ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బందికే పరిమితం చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే... కొత్త నిబంధనలలోని కులవివక్ష నిర్వచనాన్ని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బందికే పరిమితం చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇదే క్రమంలో... కులం ఆధారంగా జనరల్ లేదా నాన్ రిజర్వుడు కేటగిరీ విద్యార్థులు కూడా వివక్షను ఎదుర్కొనే అవకాశం ఉందని.. కులానికి తావివ్వనిరీతిలో వివక్ష అనే పదాన్ని నిర్వచించేలా యూజీసీకి ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ పిల్ లో కోరారు. ఈ నేపథ్యంలోనే... విద్యా సంస్థలలో స్వేచ్ఛాయుతమైన, సమానమైన, సమ్మిళిత వాతావరణాన్ని తాము కోరుకుంటున్నామని చెబుతూ.. సుప్రీంకోర్టు స్టే విధించింది.

**ఢిల్లీ యూనివర్సిటీలో నిరసనలు!:** మరోవైపు... ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని నార్త్ క్యాంపస్ లో.. కొత్తగా నోటిఫై చేయబడిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జనరల్ కేటగిరీకి చెందిన విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్పందించిన విద్యార్థులు.. క్యాంపస్ లలో నిబంధనలు సమానత్వానికి బదులుగా వివక్షను ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు. జనరల్ కేటగిరీ విద్యార్థుల ప్రాతినిధ్యానికి కట్టుబడి ఉండే ఎటువంటి నిబంధన లేదని వారు ఎత్తి చూపారు.

**బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాజీనామా!:** ఇదే సమయంలో... కొత్త యూజీసీ విధానాలపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ రాయ్ బరేలిలోని సలోన్ నియోజకవర్గం నుండి బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు శ్యామ్ సుందర్ త్రిపాఠి తన పదవికి రాజీనామా చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి రాసిన లేఖలో త్రిపాఠి తన రాజీనామాను వెల్లడించారు. అగ్రవర్ణ పిల్లలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన రిజర్వేషన్ బిల్లు లాంటి నల్ల చట్టం కారణంగా, తాను పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఈ చట్టం సమాజానికి అత్యంత ప్రమాదకరమైనదని అభిప్రాయపడ్డారు.

# 12 బంతుల్లో హాఫ్‌సెంచరీ.. యూవీ రికార్డు ఎప్పటికీ భద్రమేనా?

చూస్తూచూస్తూనే టి20 అంతర్జాతీయ మ్యాచ్ లు ప్రారంభమై 20 ఏళ్లు గడిచిపోయాయి. తొమ్మిది ప్రపంచ కప్ లు జరిగాయి. మరికొద్ది రోజుల్లో పదో టి20 ప్రపంచ కప్ భారత్-శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో మొదలుకానుంది. ఇంకా చెప్పాలంటే.. ఇప్పుడు టి20 ఫార్మాట్ దే అంతా హవా. ఒకప్పుడు వన్డేల జోరులో టెస్టు మ్యాచ్ ల మనుగడకు ముప్పు అని క్రికెట్ అభిమానులు భయపడ్డారు. కానీ, టెస్టులు అలాగే ఉండగా.. టి20లు వచ్చి వన్డేలను దెబ్బకొట్టాయి. ఒకప్పుడు ఏడాదికి భారత్ వంటి జట్లు 40పైగా వన్డేలు కూడా ఆడిన సందర్భాలున్నాయి. ఇప్పుడు అందులో పావు వంతు వన్డేలు కూడా జరగడం లేదు దీన్నిబట్టే టి20లు ఎంతగా కమ్మేశాయో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలోనే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సహా అనేక అంతర్జాతీయ లీగ్ లు పుట్టుకొచ్చాయి. ఐపీఎల్ ఒక్కదాని విలువే రూ.లక్ష కోట్లకు పైమాటే. ఇక పొట్టి ఫార్మాట్ అంటేనే ధనాధన్ కాబట్టి.. టి20ల్లో రికార్డుల గురించి చెప్పాల్సిన పనిలేదు. ఒక రికార్డు మాత్రం భారతీయుడి పేరుమీదనే ఉంది. టి20ల్లో దుమ్మురేపుతున్న భారతీయ కుర్రాళ్లు కూడా దీనిని బ్రేక్ చేయలేకపోతున్నారు.

**6 సిక్సులు అజరామరం...** పైన చెప్పుకొన్న ఆ చెక్కుచెదరని రికార్డు టీమ్ఇండియా మాజీ డాషింగ్ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ ఖాతాలోది. కేవలం 12 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేశాడు యువీ. ఇది జరిగింది 2007 టి20 ప్రపంచ కప్ లో. ఇంగ్లండ్ పేస్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ ను ఉతికి ఆరేస్తూ యువీ కేవలం 12 బంతుల్లోనే హాఫ్



సెంచరీ చేసేశాడు. ఇప్పటికి 18 ఏళ్లు దాటినా ఈ రికార్డును భారతీయులే అందుకోలేకపోతున్నారు.

**అభిషేక్ లు, హార్దిక్ లు, దూబెలు వచ్చినా..** ఎంతమంది అభిషేక్ లు, హార్దిక్ లు, దూబెలు వచ్చినా యువీ రికార్డు అలానే ఉంటోంది. తాజాగా న్యూజిలాండ్ తో జరుగుతున్న టి20 సిరీస్ లో యువ ఓపెనర్ అభిషేక్ శర్మ కేవలం 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేశాడు. ఇది భారత్ తరఫున రెండో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ. ఇక బుధవారం విశాఖపట్నంలో జరిగిన నాలుగో టి20లో ఆల్ రౌండర్ శివమ్ దూబె 15 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. ఇటీవలి దక్షిణాఫ్రికా సిరీస్ లో ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా 16 బాల్స్ లోనే ఈ మార్క్ ను అందుకున్నాడు. 2021లో బ్యాట్స్ మన్ కేఎల్ రాహుల్ 18 బంతుల్లో హాఫ్ సెంచరీ బాదాడు. కానీ, వీరెవరూ యువీ రికార్డును బీట్ చేయలేకపోతున్నారు.

**నేపాల్ ఐరీ కొట్టినా..** నేపాల్ కు చెందిన దీపేంద్ర సింగ్ ఐరీ 2023 ఆసియా క్రీడల్లో మంగోలియాపై 9 బంతుల్లోనే 50 పరుగులు చేశాడు. కానీ, నేపాల్.. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) పూర్తిస్థాయి సభ్యత్వ దేశం కాదు. అసోసియేట్ సభ్య దేశం. అందుకనే దీపేంద్ర రికార్డును పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేం. అఫ్ఘాన్ కు చెందిన హజ్రతుల్లా జజాయ్ 2018లో ఐర్లాండ్ పై 13 బంతుల్లో హాఫ్ సెంచరీ చేయడం యువీ తర్వాత రెండో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ.

**అందుకోవడం అసాధ్యమా?...** యువీ రికార్డును అందుకోవడం అతడి శిష్యుడు అభిషేక్ సహా ఎవరికైనా సాధ్యమా? అంటే ఎందుకు కాదు? అనే సమాధానం వస్తుంది. యువీ వరుసగా ఆరు సిక్సులు కొట్టడంతో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ నమోదైంది. ఇదే ఫీట్ ను సాధిస్తే 11 బంతుల్లో అయినా హాఫ్ సెంచరీ చేయొచ్చు. దీపేంద్ర 9 బంతుల్లో సాధించగగా లేనిది అభిషేక్ 10 బంతుల్లో చేయలేడా...? అది కూడా వచ్చే టి20 ప్రపంచ కప్ లోనే కావొచ్చు కదా?

# పవర్ ఫుల్ డిప్యూటీ సీఎంలు.. వారి సెక్యూరిటీ పటిష్ఠంగా ఉందా?

రాజకీయ సమీకరణాల నేపథ్యంలో దేశంలో ప్రస్తుతం చాలా రాష్ట్రాల ప్రభుత్వాల్లో ఉప ముఖ్యమంత్రి పదవి తప్పనిసరి అయింది. మరీ ముఖ్యంగా దక్షిణాదిలో డిప్యూటీ సీఎంలు కేరళ తప్ప ప్రతి రాష్ట్రంలోనూ ఉన్నారు. తమిళనాడులో సీఎం స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్, ఏపీలో సినిమా హీరోగా సుప్రసిద్ధుడైన, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, తెలంగాణలో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కుటుంబానికి చెందిన మల్లు భట్టి విక్రమార్క, కర్ణాటకలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బలమైన వర్గానికి చెందిన డీకే శివకుమార్ లు డిప్యూటీ సీఎంలుగా ఉన్నారు. మహారాష్ట్ర, యూపీ, రాజస్థాన్ వంటి పెద్ద రాష్ట్రాలతో పాటు ఛత్తీస్ గఢ్ వంటి చోట్ల కీలకమైన నేతలను డిప్యూటీ సీఎంలుగా చేసింది బీజేపీ. దీన్నిబట్టే ఈ పదవి ప్రస్తుతం ఎంతగా ముఖ్యమైనదో తెలుస్తోంది. తాజాగా విమాన ప్రమాదంలో దుర్మరణం పాలైన అజిత్ పవార్ మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా ఏకంగా ఆరుసార్లు పనిచేసిన నాయకుడు కావడం గమనార్హం. స్థానిక ఎన్నికలకు వెళ్తూ ఆయన ఈ విధంగా ప్రాణాలు కోల్పోవడం



యావత్ దేశాన్ని కలచివేసింది. ఈ నేపథ్యంలో.. పవర్ ఫుల్ డిప్యూటీ సీఎంలకు అదే విధమైన భద్రత ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**సీఎం స్థాయిలో..?** చీఫ్ మినిస్టర్ అంటే రాష్ట్రానికి సర్వాధికారి. వివిధ కారణాలతో వారికి ఉన్న ముప్పును బట్టి సెక్యూరిటీ కూడా అంతే స్థాయిలో ఉంటుంది. యూపీ సీఎం యోగి, ఏపీ సీఎం చంద్రబాబు తదితరులు హై సెక్యూరిటీ కేటగిరీలో ఉన్నారు. ఇక సహజంగా సీఎం స్థాయి నాయకులకు భద్రతా పరంగా అనేక అంచెలు ఉంటాయి. అదే.. డిప్యూటీ సీఎంలకు మాత్రం వర్తించదు. రాజ్యాంగంలో డిప్యూటీ సీఎం అనే పదమే లేదు. కేవలం సీఎం, మంత్రివర్గం ప్రస్తావనే ఉంది. డిప్యూటీ సీఎం అనేది హోదా మాత్రమే. ఈ పదవిలోని వారు మిగతా మంత్రులలాగే సమానం. కాకపోతే వారి స్థాయికి ఇచ్చిన గౌరవం.

**అంతా హెలికాప్టర్ ప్రయాణాలే..** ఈ రోజుల్లో ప్రజలకు చెప్పిన సమయానికి చేరేందుకు రాజకీయ నేతలు పెద్ద ఎత్తున విమాన, హెలికాప్టర్ సర్వీస్ లను వినియోగిస్తున్నారు. తద్వారా మారుమూల ప్రాంతాలకూ సులువుగా చేరగలిగి.. ప్రజల్లో పేరు తెచ్చుకుంటున్నారు. అయితే, ఈ క్రమంలోనే ప్రయాణ భద్రత అనే అంశం ప్రధానంగా చర్చకు వస్తోంది. ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన కీలక నేతలు వినియోగించే హెలికాప్టర్ లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో వారు ప్రయాణ విధానాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే ప్రయాణానికి ముందే అన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చురకలు

## సంపాదకీయం

# డియర్ కామ్రేడ్ అంటున్న వైసీపీ

వైసీపీ ఏపీలో సింగిల్ గానే ఉంది. పార్టీ పెట్టి దాదాపుగా పదిహేనేళ్ళు కావస్తోంది. ప్రతీ ఎన్నికలోనూ వైసీపీ ఒంటరిగానే పోటీ చేసింది. రిజల్ట్ ఎలా ఉన్నా తీసుకుంది. అలాగే ముందుకు సాగింది. కానీ 2024 ఎన్నికలు వైసీపీకి బ్యాడ్ ఎక్స్ పీరియెన్స్ ని మిగిల్చాయి. అయితే టీడీపీ కూటమి విడిపోతుందని ఎవరికి వారే అవుతారని వేసుకున్న అంచనాలు అయితే ఇపుడు తప్పుతున్నాయి. ఏకంగా మరో పదిహేనేళ్ల పాటు కూటమి కలసి ఉంటుందని పెద్దలు అంతా ఒకే మాటగా చెబుతున్నారు.

**అందరిదీ ఆదే మాట :** నిన్నటికి నిన్న టీడీపీ పార్లమెంటరీ కమిటీ ప్రతినిధుల వర్క్ షాప్ లో మంత్రి నారా లోకేష్ ఇదే మాట చెప్పారు. విడాకులు అన్న ప్రసక్తి లేదని అంతా కలసి ముందుకు సాగుతామని, ఏవైనా ఇబ్బందులు ఉంటే స్థానికంగా సర్దుబాటు చేసుకుని ఒకే బాటగా ఒకే త్రాటి మీద అంతా కలసి నడవాలని ఆయన పిలుపు ఇచ్చారు. ఇక జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా ఇదే మాట చెబుతూ వస్తున్నారు. ఏపీలో పదిహేనేళ్ళ కూటమి పాలన సాగాలని బలంగా కోరుకుంటున్నామని చెప్పారు. చంద్రబాబు కూడా చెబుతోంది ఇదే. రాష్ట్రం బాగు పడాలీ అంటే కూటమికే అధికారం కొనసాగించాలని తాము అంతా కలసి కట్టుగా ఉన్నామని అంటున్నారు.

**వైసీపీలో కొత్త ఆలోచనలు :** ఈ నేపథ్యంలో నుంచి చూసినపుడు వైసీపీకి 2014 నుంచి 2019 మధ్యలో జరిగిన రాజకీయం అయితే జరుగుతుందని నమ్మకం సడలుతోంది. కూటమిలో నాడు ఒక్కో పార్టీ బయటకు వచ్చి విడిగా చివరికి పోటీ చేశాయి. దాంతో వైసీపీకి బంపర్ విక్టరీ దక్కింది. 2029 లో అయితే అలాంటి పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. పైగా కూటమి బలంగా ఉంటే వైసీపీకి అధికారం దక్కడం కష్టమని కూడా మాజీ వైసీపీ నేత విజయసాయిరెడ్డి వంటి వారు చెబుతూ వస్తున్నారు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటూ వైసీపీ గతానికి భిన్నంగా ఆలోచన చేస్తోంది అని అంటున్నారు.

**వామపక్షాలతో కలిసి :** వైసీపీ ఇక మీదట వామపక్షాలతో కలసి అడుగులు వేస్తుందా అన్న చర్చ కూడా మొదలవుతోంది. వామపక్షాలు క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యల మీద గట్టిగా పనిచేస్తూ ఉంటాయి. వాటికి కార్మిక సంఘాలు కూడా ఉన్నాయి. ప్రజలలో ఏ అంశం అయినా బలంగా చొచ్చుకుని పోవడానికి వామపక్షాల పోరాటాల తీరే కారణం అని చెబుతా రు. ఈ క్రమంలో వైసీపీ వామపక్షాలతో కలసి కూటమి ప్రభుత్వం మీద ప్రజా వ్యతిరేక నిర్ణయాల మీద పోరాటాలు చేస్తే మరింతగా అవి జనంలోకి వెళ్ళి వైసీపీకి పొలిటికల్ గా మైలేజ్ దక్కుతుందని భావిస్తున్నారు.

**విశాఖ నుంచే శ్రీకారం :** విశాఖలో తమ వారికి అస్మదీయులకు ప్రభుత్వ భూములను అప్పనంగా కట్టబెడుతున్నారంటూ వైసీపీ కూటమి ప్రభుత్వం మీద తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తోంది. ఈ నేపథ్యంలో విశాఖలో భూ దందా అంటూ త్వరలో భారీ ఉద్యమానికి శ్రీకారం చుడుతోంది. ఈ పోరాటంలో వామపక్షాలను కూడా కలుపుకుని పోవాలని చూస్తోంది. ఇదే విషయాన్ని వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ చెప్పారు విశాఖలో ప్రభుత్వ భూములను ఒక ప్రైవేట్ సంస్థకు దారాదత్తం చేసేందుకు కూటమి సర్కార్ చూస్తోందని దానిని తాము ప్రతిఘటించి తీరుతామని ఆయన అన్నారు. ఈ విషయంలో వామపక్షాలను కూడా కలుపుకుని పోతామని చెప్పారు. ఈ విషయం మీద వామ పక్ష నాయకులతో కలసి పోరాడుతామని బొత్స చెప్పారు.

**వారితో మాట్లాడుతున్నాం :** వామపక్షాలతో కలసి విశాఖలో భూ దందాల మీద పోరాటానికి మాట్లాడుతున్నామని బొత్స తెలియచేయడం విశేషం. ఈ విషయం మీద నా నాయకుడు మాట్లాడుతున్నారని బొత్స చెప్పారు. వామపక్షాలతో కలిసి పనిచేయడానికి తమకు ఎలాంటి భేషజాలు లేవని కూడా స్పష్టం చేశారు. అలాగే మేధావులు విద్యావంతులు ఇతర ప్రజా సంఘాలతో కలసి పనిచేస్తామని చెప్పారు. మరి కామ్రేడ్స్ తో విశాఖలో మొదలవుతున్న ఈ బంధం రాష్ట్ర స్థాయిలో కూడా కొనసాగుతుందని అంటున్నారు. అంటే 2029 ఎన్నికల కంటే ముందే ఏపీలో టీడీపీ కూటమికి యాంటీగా వైసీపీ కూటమి కూడా రావచ్చు అన్న మాట అయితే వినిపిస్తోంది.

# తెలుగు వారికి హస్త భూషణం శంకర నారాయణ నిఘంటువు - శంకర నారాయణ నిఘంటువు ప్రచురణ పూర్వాపరాలు - జనవరి 31.. సమగ్ర నిఘంటువు ప్రచురణ




రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య సాధనే ఏకైక లక్ష్యంగా, అఖండ భారతావనిలో అడుగిడిన శ్వేత జాతీయులు, మొదటగా ప్రారంభించింది వ్యాపారమే. అయితే ముందు వ్యాపారం చేయడానికి, అనంతరం అధికారం చెలాయించడానికి. ఇక్కడి భాషలు రావు. స్థానికలకు భాష వారికి అర్ధమయ్యేది కాదు, అలాగే వారి భాష ఈ దేశస్తులకు బోధపడేది కాదు. వ్యాపారం, పరిపాలన అవసరాల దృష్ట్యా, ఆంగ్ల అధికారులు మెలమెల్లగా స్థానికుల భాషల పదాలను తమ భాషలోని తర్జుమా చేసుకోవడం ప్రారంభించారు. ఈ క్రమం లోనే తెలుగు పదాలను అర్థం చేసుకుంటూ, తర్జుమా చేసుకున్నారు. తద్వారా నిఘంటువులు తయారు చేశారు. అలా1818లో విలియం బ్రౌన్ తొలి తెలుగు – ఇంగ్లీషు నిఘంటువు తయారు చేశాడు. జాన్ కార్నిక్ మారిస్ అనే వ్యక్తి ఇంగ్లీషు తెలుగు నిఘంటువు తయారు చేశాడు. 1821లో క్యాంప్ బెల్ ఇలాంటిదే ఇంకో నిఘంటువు తయారు చేశాడు. తరువాత సీ.పీ. బ్రౌన్ దొర ఇంకో నిఘంటువు 1852 లో (ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి సరిగ్గా అయిదేళ్ల ముందు) తయారు చేశాడు. చాలా మంది తెల్ల అధికారులు ద్విభాషలను తెలిసిన వారినే పెట్టుకున్నారు. అయితే అందరికీ రెండు భాషల్లో అంత ప్రావీణ్యం ఉండక పోవడం సహజమే. వారి అనువాదం అంత కచ్చితంగా ఉండేది కాదు. ఈ సమస్యను సాధ్యమైన రీతిలో అధిగమించడానికి ఆచార్య పాలూరి శంకరనారాయణ విశేష కృషి చేశారు. తొలి ఇంగ్లీష్, తెలుగు నిఘంటువును రూపొందించాడు. ఆచార్య పాలూరి శంకరనారాయణ భాషావేత్త, నైఘంటికుడు, సంస్కృతాంధ్ర పండితుడు, రాయల్ ఏషియాటిక్ సొసైటీ సభ్యుడు. శ్రీకాకుళంలో జన్మించి, మున్సిపల్ హైస్కూల్ లో చదివి, అక్కడే కొంతకాలం ఉపాధ్యాయునిగా పని చేశారు. తర్వాత మద్రాసులో ప్రెసిడెన్సీ కళాశాలలో గణిత శాస్త్ర ఆచార్యుని గా, మద్రాసు విశ్వవిద్యాలయంలో ప్రధాన పరీక్షల అధికారిగా కూడా పని చేశాడు. కొచ్చిన్ యువ రాజులు, యుక్తవయసులో ఉన్న పిఠాపురం రాజా వంటి వారికి విద్యాబోధన చేశాడు. శంకర నారాయణ రచించిన తెలుగు – ఇంగ్లీషు, తమిళం– ఇంగ్లీషు నిఘంటువు చాలా ప్రసిద్ధి చెందినది. శంకర నారాయణగా పేరొందిన ఆయన పూర్తిపేరు పాలూరి శంకరనారాయణ శ్రేష్ఠి. ఆయన తయారు చేసిన తొలి ఇంగ్లీషు తెలుగు నిఘంటువు పేరే శంకర నారాయణ నిఘంటువు. తన జీవిత కాలంలో ఆయన తమిళనాడు రాజధాని మద్రాసు, ఒరిస్సాలోని గంజాం, జయపురం, మన రాష్ట్రంలోని విజయనగరం, పిఠాపురం, నూజివీడు, నెల్లూరు, కేరళలోని కొచ్చి లను సందర్శించాడు. రాచబిడ్డలకు చదువులు చెబుతున్నప్పుడే ఆయన వారి సౌలభ్యం కోసం ఇంగ్లీషు పదాలు, వాటి తెలుగు అర్థాల జాబితాను తయారు చేశాడు. తరువాత దాన్నే వ్యవస్థీకరించి, ఇంగ్లీషు తెలుగు నిఘంటువుని తయారు చేశాడు. అంతే కాదు, ఆయన తమిళ – ఇంగ్లీషు, ఇంగ్లీషు – తమిళ నిఘంటువులను కూడా తయారు చేశాడు. 1900 ప్రాంతంలో తెలుగు – ఇంగ్లీషు నిఘంటువు కూడా తయారు చేశాడు. ఆయన తయారుచేసిన తెలుగు నిఘంటువు 1897లో ప్రచురితమైంది. ఆయన బతికుండగానే అయిదు ముద్రణలకు నోచుకుంది. ప్రతి ముద్రణకీ కొత్త పదాలను కలిపారు. ఆయన 1924–25 ప్రాంతంలో చని పోయాడు. ఆ తరువాత 1927 లో గిడుగు సీతాపతి, 1951 లో చిలుకూరి నారాయణ రావు, తరువాత వేదం లక్ష్మీనారాయణ కొత్తకొత్త పదాలను జోడించారు. 1953 లో నారాయణ అయ్యర్ దీనిని పరిష్కరించారు. ఇలా 1897 నుంచి 1953 వరకూ పదకొండు సార్లు పునర్ముద్రణ పొందింది ఈ నిఘంటువు. ఇప్పటికీ ఈ నిఘంటువుయే చాలా చోట్ల ప్రామాణికం. తరతరాల విద్యార్థులకు ఇది హస్త భూషణంగా నిలిచింది. 2004 అక్టోబరులో విజయవాడకు చెందిన విక్టరీ పబ్లిషర్స్ దీన్ని మళ్లీ ముద్రించారు. ఆగస్టు 2005 నాటికి మలి ముద్రణ అవసరమైంది. మళ్లీ 2006, 2007లలో పునర్ముద్రించాల్సి వచ్చింది. కోస్తా, తమిళనాడుల్లో ఆంగ్ల భాష నేర్చు కోవడంలో ఆయన పాత్ర అనన్య సామాన్యం. ఆయన పేరుతోనే ఆయన వ్రాసిన నిఘంటువు పేరొందింది. ఇప్పటికీ శంకరనారాయణ నిఘంటువు అంటే ప్రామాణికమే. ఎస్.రామానుజం చెట్టియార్ ప్రోత్సాహంతో రూపొందిన ఈ తెలుగు – ఇంగ్లీషు నిఘంటువు మొదటి సారిగా 1900 సంవత్సరంలో మద్రాసు నుండి ప్రచురించ బడింది. తరువాతి కాలంలో అంటే 1927 వరకు చివరి సారిగా ముద్రించారు. దీనిని వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రులు 1953లో తిరిగి ముద్రించ తల పెట్టగా, ఎస్.నారాయణ అయ్యం గార్, వేదం లక్ష్మీ నారాయణ శాస్త్రి అశేష కృషి చేశారు. అలా సదరు సమగ్ర ప్రచురణ 31 జనవరి, 1953లో ప్రచురించ బడింది. ఇది "ఆసియన్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్" వారు 2003 సంవత్సరంలో మద్రాసు, న్యూఢిల్లీ నుండి ప్రచురించ బడింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# భగ్న ప్రేమికురాలు సురయ్యా - జనవరి 31... సురయ్యా వర్ధంతి



ఆమె అందంలో అప్సరస. ఆమెది గంధర్వ గానం. ఒకనాడు హిందీ సినీ చిత్ర సీమను మకుటం లేని మహా రాణిగా ఏలింది. నిర్మాతలకు కల్పవృక్షమైంది. నాటి యువకుల హృదయ సామ్రాజ్ఞిగా నిలిచింది. అత్యంత పారితోషికం తీసుకునే కథానాయకురాలిగా ఉంటూ, ఒక హీరో ప్రేమను చూరగొని, ప్రేమకు మతాలు అడ్డు గోడలైన కారణంగా సినీ జీవితాన్ని వదులు కోవడం కాకుండా, జీవితాంతం అవివాహిత గా ఉండి పోయింది భగ్న ప్రేమికురాలు. ఆమెనే అలనాటి అందాల తార, గాయని సురయ్యా. తెరమీద అభినయించే నటీనటులకు గాయనీ గాయకులు నేపథ్యగానాన్ని అందించే ప్రక్రియ ఇంకా ఆరంభంకాని దశలో అందం, అభినయం, సుమధుర గాత్రంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన ఏకైక విదూషీమణి సురయ్యా. నాలుగో దశకంలో బాలీవుడ్‌ను సురయ్యా, నూర్జహాన్‌లనే ఇద్దరూ నట గాయనీ మణులు ఏలేవారు. అప్పటికీ నూర్జహాన్ అనే వర్సటైల్ సింగర్ కమ్ యాక్టరెస్ ఉన్నా అందంలో మాత్రం సురయ్యాదే పైచేయి. దేశ విభజన తర్వాత నూర్జహాన్ పాకిస్తాన్‌కు వెళ్లిపోగా, సురయ్యాకు తిరుగు లేకుండా పోయింది. 1946 నుంచి 1950 వరకు సురయ్యా మకుటంలేని మహారాణిలా బాలీవుడ్‌లో చెలామణి అయింది. 1940 వ దశకంలో ఆమె హిందీ తెరపై ఒక సూపర్ స్టార్ అనిపించు కోవడమే కాకుండా నాటి యువకులకు ఓ ఆరాధ్య దేవత. రేడియో కార్యక్రమంలో పాడుతుంటే, ఆమె గురించి తెలుసుకుని నాటి ప్రఖ్యాత సంగీత దర్శకుడు నౌషాద్ ఆమెను హిందీ వెండి తెరకు పరిచయం చేశాడట. మీర్జా గాలిబ్' లో ఆమె చౌద్విన్ పాత్ర పోషించడమే కాకుండా ఆమె పాడిన గాలిబ్ గజళ్ళు విని, చిత్రానికి చూసి నాటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఆమెను "నీవు గాలిబ్ ను పునరుజ్జీవింప చేశావు" అని ప్రశంసించారట. జూన్ 25, 1929లో లాహోర్ నగరంలో జన్మించిన సురయ్యా జమాల్ షేక్ చిన్నప్పుడే ముంబాయిలో ఉంటూ కర్దార్ ఫిలిం కంపెనీలో పని చేస్తున్న తన మేనమామ దగ్గరకు వచ్చిన సందర్భంలో, ఆమె సినిమాల్లోకి రావడం యాదృచ్ఛికంగానే జరిగింది. ఓసారి తన అంకుల్‌తో కలిసి తాజ్‌మహల్ సినిమా షూటింగ్‌కు వచ్చిన సురయ్యాకు అనుకోకుండానే అందులో ముంతాజ్ మహల్ పాత్ర దొరికింది. పసితనపు ఛాయలు వీడని ఆమెతో శారద సినిమాలో ఓ పాట పాడించి పెద్ద సాహసమే చేశాడు ప్రఖ్యాత సంగీత దర్శకుడు నౌషాద్. ఆ పాట భారతదేశ మంతటా మారుమోగింది. దాంతో సురయ్యా ఓవర్ నైట్ లో స్టార్ అయింది. మధురాతి మధురంగా గానం...అద్భుతమైన నటన..పాలరాతి శిల్పం లాంటి అందమైన సురయ్యా, క్రమేణ నిర్మాతల పాలిటి కల్పవృక్షమయ్యిందంటే అతిశయోక్తి కాదు. 1945 నుండి 1961 దాకా అత్యధిక పారితోషికం తీసుకున్న నటి సురయ్యా. తర్వాత సురయ్యా వరుసగా సినిమాలలో నటించింది. ఫూల్, విద్య, జీత్, దాస్తాన్, సనమ్, అఫ్సర్ వంటి సినిమాలు సురయ్యాకు పేరును, నిర్మాతలకు డబ్బును తెచ్చిపెట్టాయి. నటుడు దేవానంద్ ను సిఫార్సు చేసి, ప్రోత్సాహాన్ని అందించింది. అయన సరసన చాలా చిత్రాలలో నటించి, ఉత్తమ జంటగా గుర్తింపు పొందింది. 1948లో వచ్చిన ప్యార్ కీ జీత్, 1949లో వచ్చిన బడీ బెహన్, దిల్లగీలు బాక్సాఫీసును బద్దలు కొట్టాయి. సొహ్రాబ్ మోదీ దర్శకత్వంలో వచ్చిన మీర్జా గాలిబ్ సినిమా సూపర్ హిటయ్యింది. ఆ సినిమా రెండు జాతీయ అవార్డులను కూడా గెల్చుకుంది. సినిమా చూసిన నాటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సురయ్యాను ఎంతగానో అభినందించారు. అలా తిరుగులేని నటిగా, గాయనిగా పేరు ప్రఖ్యాతులు గడించిన సురయ్యా 34 ఏళ్ల వయసుకే ప్రేమ వైఫల్యం కారణంగా అర్ధాంతరంగా సినిమాల్లోంచి తప్పుకుంది. 1946 లో అన్ మోల్ షడీ చిత్రానికి అవార్డు పాటు 1954– మీర్జా గాలిబ్" ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్, 1996– స్క్రీన్ లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డ్, 1998– ప్రధాని వాజ్ పేయ్ చేతుల ద్వారా సన్మానం, సాహిత్య అకాడమీ అవార్డ్ ఫార్ హర్ పార్టిసిపేషన్ ఇన్ మీర్జ గాలిబ్ బిమల్ రాయ్ మెమోరియల్ అవార్డ్– 1999, దాదాసాహెబ్ ఫాల్కే అకాడెమీ అవార్డ్– 2003, బెస్ట్ ఆన్ స్క్రీన్ బ్యూటీ ఇన్ 100 ఇయర్స్ ఆఫ్ ఫిల్మ్ ఇండస్ట్రీ విత్ ఎత్నిక్ లుక్ అవార్డ్ – 2013 (మరణానంతరం) సొంతం చేసుకుంది. 2013 మేలో కేంద్ర ప్రభుత్వం ఆమె పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. నాలుగు పదుల వయస్సు దాటిన తరువాత దేవానంద్ కు నాటి ప్రముఖ గాయని, నటి సురయాతో కలసి నటించే అవకాశం వచ్చింది. అప్పట్లో దేవానంద్ కంటే కూడా సురయ్యాకే స్టార్ డమ్ ఎక్కువగా ఉండేది. నిర్మాతలు, దర్శకులు కూడా అలాగే భావించేవారు. కథల్లో కూడా ఆమె పాత్రలకే ప్రాధాన్యం ఉండేది. వారిద్దరూ కలసి పలు చిత్రాల్లో నటించారు. దేవానంద్, సురయ్యా 1948 నుంచి 1951 మధ్య ఆరు చిత్రాలలో కలిసి నటించారు. విద్య (1948), జీత్ (1949), షాయిర్ (1949), అఫ్సర్ (1950), నిలి (1950), దో సితారే (1951), సనమ్ (1951) లాంటివి బాక్సాఫీస్ హిట్ అయ్యాయి. విద్య (1948) చిత్రం లోని కినారె కినారె చలె జాయెంగె పాట చిత్రీకరణ సమయంలో పడవ మునిగినప్పుడు, నీటిలో పడి మునిగి పోతున్న సురయ్యాను దేవానంద్ రక్షించి ఆమెను ప్రేమించాడు. జీత్ చిత్రం చిత్రీకరణ సమయంలో దేవ్ ఆనంద్ తన ప్రేమ వ్యక్త పరిచాడు. కొన్నాళ్ళ పాటు వారి ప్రేమ వ్యవహారం రహస్యంగానే ఉండింది. అయితే వీరి ప్రేమకు సురయ్యా తల్లి సానుకూలమయినా, హిందువయిన దేవానంద్ తో పెళ్లేమిటని సురయ్యా అమ్మమ్మ తీవ్రంగా నిరసించింది. దేవ్ ఫోన్ చేస్తే పరుషంగా మాట్లాడి, దేవ్ మనసును గాయ పరిచింది. అయినా దేవ్, దివేచా అనే సినీఛాయా చిత్రకారుడి ద్వారా సురయ్యాకు 3000 రూ.లు ఖరీదు చేసే వజ్రపుటుంగరాన్ని పంపితే సురయ్యా మహదానంగా స్వీకరిస్తే, తన కథ సుఖాంతమని భావించాడు దేవ్. చనిపోతామని బెదిరించి, సురయ్యా ప్రేమకు ఆమె బంధుగణం అడ్డు వచ్చింది. భగ్న హృదయురాలైన సురయ్యా, దేవ్ పంపిన ఉంగరాన్ని సముద్రంలో విసిరేసింది. అలా తన ప్రేమను చంపుకుంది. దో సితారె (1951) వీరిరువురూ కలిసి నటించిన చివరి చిత్రం. దో సితారే సినిమా తరువాత ఎన్నడూ వారిద్దరూ కలసి నటించలేదు. సురయ్యా జీవితాంతం అవివాహిత గానే మిగిలి పోయింది. తనను ప్రేమించిన దేవానంద్ ను వలచిన ఆమె మరొకరితో జీవితాన్ని పంచుకోలేక పోయింది. వివాహం చేసుకోకుండా జీవితాంతం ఒంటరిగానే గడిపి, సురయ్యా తన 75వ సంవత్సరంలో (2004) ముంబాయిలో కన్ను మూసింది. సురయ్యా జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం ఓ తపాలా బిళ్ళని విడుదల చేసింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ఒక్క క్షణం తప్పిదం... జీవితాంతం శోకం

రోడ్డు ప్రమాదాలు నేటి భారత సమాజంలో అత్యంత తీవ్రమైన ప్రజా సమస్యగా మారాయి. ఇవి కేవలం ఒక్క వ్యక్తి లేదా ఒక కుటుంబానికి మాత్రమే సంబంధించిన విషాదాలు కావు; సమాజం మొత్తాన్ని ఆర్థికంగా, మానసికంగా, సామాజికంగా దెబ్బతీసే విపత్తులు. అభివృద్ధి, సాంకేతిక పురోగతి, వాహనాల సంఖ్య పెరుగుదల ఒకవైపు జరుగుతుండగా, భద్రతా సంస్కృతి మాత్రం అదే స్థాయిలో పెరగక పోవడమే రోడ్డు ప్రమాదాల తీవ్రతకు మూల కారణంగా మారింది. ప్రతి రోజు జరిగే ప్రమాదాలు మనకు అలవాటుగా మారిపోవడం ఈ సమస్య ఎంత లోతుగా వేళ్లూనుకు పోయిందో సూచిస్తోంది.గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది సుమారు ఐదు లక్షలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారిక నివేదికలు చెబుతున్నాయి. వీటిలో దాదాపు ఒకటిన్నర లక్షల మంది ప్రాణాలు కోల్పోతుండగా, లక్షల మందికి పైగా గాయాలపాలవుతున్నారు. అంటే సగటున ప్రతి గంటకు దాదాపు 17 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారన్న మాట. ప్రపంచంలో రోడ్డు ప్రమాద మరణాల్లో భారత్ ముందున్న దేశాల్లో ఒకటిగా ఉండటం అత్యంత ఆందోళనకరం. మరణించిన వారిలో సుమారు 60 శాతం మంది 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు గలవారే కావడం వల్ల, కుటుంబాలకు ఆధారమైన యువతే ఎక్కువగా బలవుతుండటం దేశానికి తీరని నష్టంగా మారుతోంది. ఈ ప్రమాదాలకు ప్రధాన కారణంగా మానవ తప్పిదమే అత్యధిక శాతంలో ఉంది. గణాంకాల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 75 నుంచి 80 శాతం వరకు మానవ నిర్లక్ష్యం, నియమాల ఉల్లంఘనే కారణం. అతివేగం ఒక్కటే సుమారు 40 శాతం ప్రమాదాలకు కారణమవుతోంది. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు సుమారు 8 నుంచి 10 శాతం వరకు ఉంటున్నాయి. మొబైల్ ఫోన్ మాట్లాడుతూ లేదా మెసేజ్‌లు చూస్తూ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలు ప్రతి ఏడాది పెరుగుతున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం విషయంలో కూడా నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో మరణించిన వారిలో సగానికి పైగా హెల్మెట్ ధరించక పోవడం వల్ల తల గాయాలతోనే ప్రాణాలు కోల్పోతున్నారు. నాలుగు చక్రాల వాహనాల్లో సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్ల తీవ్ర గాయాలపాలయ్యే వారి సంఖ్య కూడా అధికంగానే ఉంది. చిన్నపిల్లలను సురక్షితంగా కూర్చోబెట్టే చైల్డ్ సేఫ్టీ సీట్లు వినియోగించక పోవడం వల్ల పిల్లల మరణాలు, గాయాలు పెరుగు తున్నాయి. మానవ తప్పిదంతో పాటు రోడ్డు మౌలిక సదుపాయాల లోపాలు కూడా ప్రమాదాలకు దోహద పడుతున్నాయి. దేశవ్యాప్తంగా జరిగే ప్రమాదాల్లో సుమారు 25 శాతం వరకు రోడ్డు డిజైన్ లోపాలు, గోతులు, తగిన సంకేతాల లేమి, సరైన లైటింగ్ లేకపోవడం వంటి అంశాలు కారణమవుతున్నాయి. హైవేలు, జాతీయ రహదారులపై గుర్తించిన "బ్లాక్ స్పాట్లు" వేల సంఖ్యలో ఉన్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ బ్లాక్ స్పాట్ల వద్దే ప్రతి ఏడాది వేలాది ప్రమాదాలు, వందలాది మరణాలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సరైన రోడ్డు భద్రతా చర్యలు లేకపోవడం వల్ల అక్కడ ప్రమాదాల తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుంది. వాహనాల సాంకేతిక స్థితి కూడా ఒక ప్రధాన అంశం. సరైన నిర్వహణ లేకపోవడం వల్ల బ్రేక్ ఫెయిల్యూర్, టైరు పేలడం, లైట్లు పనిచేయక పోవడం వంటి కారణాలతో జరిగే ప్రమాదాలు గణనీయంగా ఉన్నాయి. వాణిజ్య వాహనాల్లో ఓవర్ లోడింగ్ వల్ల జరిగే ప్రమాదాలు సుమారు 10 శాతం వరకు ఉంటున్నట్లు అంచనాలు చెబుతున్నాయి. డ్రైవర్లకు సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల నిద్రలేమి, అలసట కారణంగా జరిగే ప్రమాదాలు ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎక్కువగా నమోద వుతున్నాయి. రోడ్డు ప్రమాదాల పూర్వాపరాలను పరిశీలిస్తే, వాహనాల సంఖ్య వేగంగా పెరుగుతుండటం ఒక కీలక అంశం. గత రెండు దశాబ్దాల్లో దేశంలో నమోదైన వాహనాల సంఖ్య మూడు నుంచి నాలుగు రెట్లు పెరిగింది. అయితే అదే స్థాయిలో రహదారుల విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థలు, డ్రైవర్ శిక్షణ మెరుగు పడలేదు. పట్టణాల్లో ట్రాఫిక్ ఒత్తిడి పెరిగి పోగా, గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నాణ్యత సమస్యగా మారింది. ఈ అసమతుల్యతే ప్రమాదాల పెరుగుదలకు దారితీస్తోంది. ప్రమాదాల తర్వాతి పరిస్థితులు మరింత బాధాకరంగా ఉంటాయి. గణాంకాల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారిలో సుమారు 30 శాతం మంది సరైన సమయంలో వైద్యం అందకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారు. "గోల్డెన్ అవర్"లో చికిత్స అందితే ప్రాణాలు దక్కే అవకాశమున్న అనేక కేసులు ఆలస్యాల వల్ల మృత్యువాత పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ట్రామా కేర్ కేంద్రాల కొరత, అంబులెన్స్ సేవల ఆలస్యం ఈ పరిస్థితిని మరింత తీవ్రం చేస్తున్నాయి. రోడ్డు ప్రమాదాల వల్ల దేశానికి జరిగే ఆర్థిక నష్టం కూడా అపారమే. నిపుణుల అంచనాల ప్రకారం రోడ్డు ప్రమాదాల వల్ల దేశ జిడిపిలో సుమారు 3 నుంచి 4 శాతం వరకు నష్టం జరుగుతోంది. ఇది లక్షల కోట్ల రూపాయల విలువైన నష్టం. వైద్య ఖర్చులు, పని దినాల నష్టం, కుటుంబాలపై పడే ఆర్థిక భారం, సామాజిక భద్రతా వ్యవస్థలపై ఒత్తిడి--- కలిపి దేశ అభివృద్ధిని వెనక్కి లాగుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చాలంటే ప్రభుత్వ, సామాజిక, వ్యక్తిగత స్థాయిల్లో సమగ్ర చర్యలు అవసరం. రహదారుల నిర్మాణంలో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం, బ్లాక్ స్పాట్లను శాస్త్రీయంగా సరిచేయడం, ట్రాఫిక్ నియమాల అమలును కఠినంగా చేయడం అత్యవసరం. డ్రైవింగ్ లైసెన్సుల జారీ ప్రక్రియను కఠినతరం చేసి నిజమైన శిక్షణ పొందిన వారికే అనుమతులు ఇవ్వాలి. సీసీటీవీ, ఆటోమేటెడ్ స్పీడ్ డిటెక్షన్ వంటి సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలి. సమాజ స్థాయిలో రోడ్డు భద్రత ఒక ఉద్యమంలా మారాలి. పాఠశాల స్థాయి నుంచే ట్రాఫిక్ అవగాహనను పాఠ్యాంశంగా చేర్చాలి. మీడియా నిరంతరం గణాంకాలు, నిజ సంఘటనల ద్వారా ప్రజల్లో బాధ్యతా భావాన్ని పెంచాలి. ప్రమాదాల సమయంలో సహాయం చేసే వారికి చట్టపరమైన రక్షణ కల్పించాలన్న అవగాహనను విస్తరించాలి. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ తమ పాత్రను గమనించాలి. వేగాన్ని నియంత్రించడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయక పోవడం, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించడం, అలసట ఉన్నప్పుడు వాహనం నడపక పోవడం వంటి జాగ్రత్తలు చిన్నవిగా కనిపించినా ప్రాణాలను కాపాడే పెద్ద నిర్ణయాలే. రోడ్డు మీద ఉన్న ప్రతి ఒక్కరి భద్రతకు మన ప్రవర్తనే కీలకం అన్న సత్యాన్ని అంగీకరించి నప్పుడే మార్పు సాధ్యమవుతుంది. రోడ్డు ప్రమాదాలు విధి లిఖితాలు కావు; అవి మన నిర్లక్ష్యానికి ఫలితాలు. కాబట్టి వాటిని తగ్గించడమూ మన చేతుల్లోనే ఉంది. భద్రతను అలవాటుగా మార్చుకున్న రోజే రోడ్లు ప్రాణాలు తీసే మార్గాల నుంచి ప్రగతికి దారులు అవుతాయి.



**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## తాగేది మంచి 'నీరేనా..?'

కామారెడ్డి : కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో మిషన్ భగీరథ అధికారులు స్టాల్ ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ నీటి నమూనాలను పరీక్షించి ఫలితాలను ప్రజలకు చూపారు. బోరు నీటిలో టీడీఎస్ 577 ఉన్నట్లు చూపగా.. ఆర్వో ప్లాంటు నీటిలో టీడీఎస్ 48గా తేలింది. మిషన్ భగీరథ నీటిని పరీక్షించగా 200 టీడీఎస్గా చూపింది. ప్రజలు మిషన్ నీటిని తాగడం ఉత్తమమని అధికారులు తెలిపారు. నీటి స్వచ్ఛత గురించి చాలా మందికి తెలియదు. ఆర్వో ప్లాంట్ల నీరే మంచిదనే నమ్మకంతో ఎక్కువ మంది ఆ నీటినే తాగుతున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీటిని తాగడానికి ప్రజలు ఆసక్తి చూపడం లేదు. వాస్తవానికి మిషన్ భగీరథ నీరే స్వచ్ఛమైనదని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో బోరు నీరు, ఆర్వో ప్లాంట్ల నీరు ప్రమాణాలకు తగినట్లుగా లేవని చెబుతున్నారు.

**నది నుంచి ఇంటికి..**

శ్రీరాంసాగర్, సింగూర్ గ్రిడ్ ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. మిషన్భగీరథ నీరు నదులకు అడ్డంగా నిర్మించిన ప్రాజెక్ట నుంచి గ్రిడ్ ద్వారా ఇంటికి సరఫరా చేస్తున్నారు. నదీజలాలకే క్లోరినేషన్తో, బ్లీచింగ్పౌడర్ కలిపి సరఫరా చేస్తున్నారు. ఎలాంటి రసాయనాలు కలపడం లేదు. నీటి నుంచి లవణాలను తొలగించడం




లేదు. భగీరథ అధికారులు నీటి నాణ్యతపై ప్రచారం చేసినా ప్రజల నుంచి స్పందన లేదు. నీటి నాణ్యతను ప్రజలు టీడీఎస్ పరికరంతో తెలుసుకోవచ్చు. ఇది రూ.300 ధరలోనే లభ్యమవుతుంది.

**సమస్యలు ఉత్పన్నమవుతాయి**

టీడీఎస్ చాలా తక్కువ లేదా ఎక్కువ పరిమాణంలో ఉన్న నీరు తాగడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతాయి. ముఖ్యంగా ఆర్వోవాటర్ తాగడం వల్ల ఎముకల్లో కాల్షియం తగ్గుతుంది. ఎముకలు బలహీనపడతాయి. చిన్న ప్రమాదం జరిగినా ఎముకలు విరిగే అవకాశం ఉంటుంది. ఈ నీటినే దీర్ఘకాలికంగా తాగితే కొందరిలో మూత్రపిండాల సమస్యలు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయి. టీడీఎస్ 150 కంటే ఎక్కువ, 500 కంటే తక్కువ పరిమాణం కలిగిన నీటిని తాగడం ఉత్తమం.డాక్టర్ రవీందర్, ఆర్ఎంఓ, బోధనసుపత్రి, కామారెడ్డి

## పురుగులు పట్టి.. ముక్కిపోయి!

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ పట్టణంలోని మండల స్థాయి నిల్వ (ఎంఎల్ఎస్) కేంద్రంలో దొడ్డు బియ్యం సంచులకు పురుగులు పట్టి చిరిగిపోతున్నాయి. సరిపడా స్థలం ఉండే చోటనే ఇలాంటి పరిస్థితి ఉండగా.. దొడ్డు, సన్నబియ్యం ఒకేచోట నిల్వ చేసే రేషన్ దుకాణాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. చౌక ధరల దుకాణాలు, గోదాముల్లో దాదాపు ఏడాదిగా దొడ్డు బియ్యం నిల్వలు ముక్కిపోతున్నాయి. మిగులు నిల్వలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో వాటికి పురుగులు పట్టి పనికి రాకుండాపోతున్నాయి. రాష్ట్రస్థాయిలో వేలం ప్రకటన వెలువడినా ఎవరూ ముందుకు రాకపోవడంతో దొడ్డు బియ్యం నిల్వలు డీలర్లను మరింత కలవరపెడుతున్నాయి. దొడ్డు, సన్నబియ్యం ఒకేచోట నిల్వ చేసేందుకు డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు.

కార్డుదారులకు గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేసేవారు.. గత మార్చి నుంచి సన్న బియ్యం ఇస్తున్న విషయం తెలిసిందే.. పోర్టబులిటీ



సౌకర్యంతో కార్డుదారు రాష్ట్రంలో బియ్యం ఏ దుకాణంలోనైనా తీసుకునే వెసులుబాటు ఉండటంతో.. డీలర్లు నిర్ణీత కోటాకు మించి తీసుకున్న దొడ్డు బియ్యం క్వింటాళ్ల చొప్పున మిగిలిపోయాయి. రేషన్ దుకాణాల్లో, ఎంఎల్ఎస్ కేంద్రాల్లో నెలలుగా నిల్వ ఉన్న బియ్యం ముక్కిపోయి పురుగులు పట్టి ఎలుకల పాలవుతున్నాయి.

దొడ్డు బియ్యాన్ని విక్రయిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఇప్పటికే ఆ బియ్యం బస్తాలకు పురుగులు పట్టి పనికి రాకుండాపోతున్నాయి.కార్డుదారులతో నిండలు వదుతూ పురుగులు, ఎలుకల సంచారంతో తరుగును ఎలా భర్తీ చేయాలో తెలియక డీలర్లు ఆందోళన చెందుతున్నారు.

## దుండగుల బీభత్సం

దోమకొండ : దోమకొండలోని పలుగడ్డ ప్రాంతంలో పట్టపగలే గంటల పాటు ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చొరబడి బీభత్సం సృష్టించారు. బీసు రుకుంబాయి-కిష్టయ్యల ఇంట్లోకి వెళ్లి దాడి చేశారు. ముగ్గురిలో ఒకరు బయటనే ఉండిపోగా మరో ఇద్దరు లోనికి ప్రవేశించారు. ఆ సమయంలో రుకుంబాయి ఇంట్లో ఉంది. ఆమె నోరు నొక్కి వెనుకనుంచి దాడి చేశారు. ఆమె అరుస్తుండగా భర్త కిష్టయ్య మంచంపై నుంచి రాగా.. మరొక దుండగుడు ఆయనను అడ్డుకొని దాడి చేశారు. రుకుంబాయి ఇంట్లో కిరాయి ఉన్న వెంకటమ్మ అరుపులు విని లోనికి ప్రవేశించడానికి ప్రయత్నించగా ఆమెపై సైతం దాడి చేశారు. వారి అరుపులకు భయపడి ఇంటి నుంచి ఇద్దరు దుండగులు బయటికి వచ్చారు. అప్పటికే బయట ఉన్న మరో దుండగుడితో కలిసి వెళ్లిపోయారు. దొంగలు తమను కొట్టిపోయారని కేకలు, అరుపులు వేస్తూ బాధితులు బయటకు రాగా.. స్థానిక యువకులు కొందరు దుండగులను వెంబడించారు. దుండగులకు ఓ పదు కత్తి చూపుతూ తన వైపు రావద్దని భయపెడుతూ పారిపోయి వినాయక వెంచర్ ప్రాంతంలో గుంతలో పడి దొరికిపోయాడు. ఆతడి వద్ద కత్తిని, డమ్మీ తుపాకీని స్థానికులు గుర్తించారు. అనంతరం ఆతడిని చితకబాది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల విచారణలో ఆ నిందితుడు తాను అన్నారం వాసి గొనె రజనీకాంత్నని పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా ఎస్సై ప్రభాకర్ జరిగిన సంఘటనపై విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

# లంకంత సేవ.. 'కొండయ్య' తోవ




మధిర : రెండున్నర దశాబ్దాలుగా అలుపెరగని ప్రచార పర్వం.. సమాజంలో వేళ్లూనుకుని పట్టిపీడిస్తున్న రుగ్మతలు, వ్యసనాలపై నిరంతర పోరు.. ఖాళీ సమయం దొరికితే చాలు ప్రజల కోసమే తన జీవితమన్నట్లు పరితపిస్తారు.. ఆయనే లంకా కొండయ్య. వైద్య ఆరోగ్యశాఖలో హెల్త్ సూపర్వైజర్గా పనిచేస్తున్న ఆయన ఉద్యోగ విధుల అనంతరం మిగతా సమయాన్ని సమాజ సేవకు వినియోగిస్తారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వేలాది అవగాహన ప్రదర్శనలతో ప్రజలను చైతన్యపరుస్తూ ముందుకు సాగుతున్నారు. తనలోని కళాకారుడి ద్వారా జానపద, సాంఘిక, పౌరాణిక వేషధారణలతో జన సమూహాల వద్ద సమాజ మార్పునకు ప్రదర్శనలు ఇస్తూ కృషి చేస్తున్నారు. ఇందుకు గుర్తింపుగా పలు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల నుంచి ఎన్నో ప్రశంసలు, పురస్కారాలు అందుకున్నారు. దెందుకూరు పీహెచ్సీలో తన ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూనే.. ఖాళీ సమయం దొరికితే చాలు తనలోని కళాకారుడు నిద్రలేస్తాడు. కోయదొర, హరిదాసు, గిరిజన సాంప్రదాయ వేషాలను ధరించి జనం మధ్యలోకి చేరతారు ఆయన. మూఢ నమ్మకాలు, వరకట్న నిషేధం, మద్యపానం, ధూమపానం, టీబీ, పోలియో, కుష్టు, మలేరియా, ఎయిడ్స్ వంటి మహమ్మారుల బారిన పడకుండా తన ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్య పరుస్తున్నారు.మధిరలోని అజాద్ రోడ్డులో తన ఇంట్లోనే ఏర్పాటు చేసిన లంకా ఫౌండేషన్ ద్వారా సాయంతో అభాగ్యులకు నిత్యావసరాలు అందిస్తున్నారు. మహాత్మాగాంధీ పాత దుస్తుల బ్యాంకును ఏర్పాటు చేసి తనకు తెలిసిన స్నేహితులు, బంధువుల నుంచి సేకరించిన వస్త్రాలను నిరుపేదలకు అందజేస్తున్నారు.

**పురస్కారాలెన్నో....**

లంకా కొండయ్యకు ఇప్పటి దాకా వేలాది కళాప్రదర్శనలు ఇచ్చారు. ఆయన కృషికి గుర్తింపుగా 2013లో హైదరాబాద్లో మదర్ థెరిసా సేవాసంస్థ నుంచి స్వర్ణ పతకం అందుకున్నారు. తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మాజీ కమిషనర్ డా.యోగితారాణా కొండయ్య అంకితభావాన్ని గుర్తించి గుజరాత్ రాష్ట్రంలో గాంధీ మందిర్లో జరిగిన నేషనల్ సమ్మిట్కు పంపి క్షయవాధిపై కళా ప్రదర్శనలు ఇప్పించారు. దీంతో తెలంగాణకు క్షయ అవేర్నెస్పై ఉత్తమ పురస్కారం దక్కింది. 2013లో మేన్ ఆఫ్ది ఛారిటీ అవార్డు ఆయన సాధించారు. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య నుంచి రవీంద్రభారతిలో ఉత్తమ సామాజిక సేవకుడి అవార్డు అందుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖలోనూ ఉత్తమ ఉద్యోగి పురస్కారాన్ని పొందారు.

**సేవలోనే ఎనలేని సంతృప్తి: లంకా కొండయ్య, మధిర**

రోగికార్చే కన్నీటి బొట్టు సప్త సముద్రాల నీటితో సమానమన్న స్వామి వివేకానంద మాటలు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. ప్రతి ఒక్కరి కళ్లలో సంతోషం చూడాలన్న లక్ష్యంతో దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా చైతన్య పరుస్తున్నాను. యువత వ్యసనాలకు బానిస కాకుండా అవగాహన కల్పించడం ఎంతో సంతృప్తి ఇస్తోంది. తుదిశ్వాస వరకు సమాజ చైతన్యమే లక్ష్యంగా ముందుకు సాగుతాను.

# బోధన ఆదర్శం.. ప్రవేశాలకు ఆహ్వానం




తల్లాడ : గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలు (మోడల్ స్కూల్స్) ఏర్పాటుచేసింది. వీటిలో ఆంగ్లమాధ్యమంలో ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్య అందుతోంది. రెగ్యులర్తో పాటు ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉండటంతో ఏటా ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు పోటీ పెరుగుతోంది. 2026-27 విద్యాసంవత్సరం ప్రవేశాలకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది.

**రెండే రెండు పాఠశాలలు..**

కారేపల్లి, పెనుబల్లి మండలం టేకులపల్లిలో ఆదర్శ పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఒక్కో పాఠశాలలో ఆరోతరగతిలో 100 సీట్లు ఉన్నాయి. 7 నుంచి 10 తరగతి వరకు ఆయా పాఠశాలల్లో ఏర్పడిన ఖాళీలను పరీక్ష ఆధారంగా భర్తీ చేస్తారు. పదోతరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా అక్కడే ఇంటర్మీడియట్ విద్యకు ప్రవేశాలతో పాటు, ఇంటర్ విద్యార్థినులకు వసతి కల్పిస్తున్నారు. ఆరోతరగతిలో చేరిన విద్యార్థులు తొమ్మిదోతరగతి నుంచి ఏదైనా ఒకేషనల్ కోర్సును అభ్యసించవచ్చు. బ్యూటీషియన్, ఐటీ, అగ్రికల్చర్, ఎలక్ట్రానిక్స్, టూరిజం, టైలరింగ్, హెల్త్ కేర్, డేటా ఎంట్రీ వంటి 26 రకాల ఒకేషనల్ కోర్సుల్లో ఎంపిక చేసుకున్న ఏవైనా రెండు కోర్సులు ప్రతి పాఠశాలలో అందుబాటులో ఉంటాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కొత్తగా స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందవచ్చు. యోగాతో పాటు బాలికల ఆత్మరక్షణకు కరాటే విద్య నేర్పిస్తున్నారు.

**దరఖాస్తు విధానం**

ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదోతరగతి చదువుతున్న విద్యార్థులు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 28 వరకు వెబ్సైట్ https://tgms.talangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఓసీలకు రూ. 200, బీసీ, ఎస్టీ, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్, పీహెచ్ విద్యార్థులు రూ.125 చొప్పున రుసుము చెల్లించాలి. తెలుగు, ఆంగ్లమాధ్యమాల్లో 100 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం, ఆంగ్లంలో ఒక్కో సబ్జెక్టుకు 25 ప్రశ్నలు అడుగుతారు. ఏడోతరగతి నుంచి పదోతరగతి విద్యార్థులకు గణితం, సామాన్య, సాంఘికశాస్త్రం, ఆంగ్లం నుంచి ప్రశ్నలుంటాయి. ఏప్రిల్ 9 నుంచి హాల్టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలి. 'టేకులపల్లి, కారేపల్లిలో ఏప్రిల్ 19న ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి' అని టేకులపల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రూపస్కు తెలిపారు.

# గుట్టకు పట్టాలు..!



దేవరకొండ : దేవరకొండ పురపాలిక, రెవెన్యూ డివిజన్ కేంద్రం కావడంతో పట్టణ పరిసర ప్రాంతాల్లోని భూముల ధరలకు రెక్కలొచ్చాయి. స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతుండటంతో పట్టణానికి సమీపంలో ఉన్న కాచారం గుట్టలపై అక్రమార్కుల కన్ను పడింది. గుట్టలే కదా పట్టించుకునే వారు ఉండరని తమ పలుకుబడిని ఉపయోగించి కొందరు పట్టాలు చేయించుకోవడంతో ప్రస్తుతం గుట్ట కబ్జా కోరల్లో చిక్కుకుంది.

**నిబంధనలకు విరుద్ధంగా..** ప్రభుత్వ నిబంధనలు, అసైన్మెంట్ కమిటీ ప్రకారం కుటుంబానికి ఐదెకరాల్లోపు భూమి ఉంటే వారికి భూ పంపిణీ చేయకూడదు. అయినా ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా కుటుంబంలో ఒకరికి గతంలోనే భూమి ఉండగా.. అసైన్మెంట్ కమిటీ పేరుతో మరో ఐదెకరాలు రికార్డులో నమోదు చేశారు.రెండెకరాల భూమి ఉన్న వారు పక్కనున్న మరో రెండు ఎకరాలను పట్టా చేయించుకున్నారు. తన రాజకీయ పలుకుబడితో గ్రామంలోని ఒక నాయకుడు గతంలో ఉన్న వీఆర్వో సహకారంతో రెండున్నర ఎకరాలు పట్టా చేయించుకున్నాడు. 40 ఎకరాలకు పైగా గుట్టకు పట్టాలు చేశారని ఇప్పటికే ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు వెళ్లాయి.

**అక్రమాలు ఇలా...**

కాచారం గుట్ట సర్వే నెం.13లో 173 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ భూమి ఉంది. ఎస్సీ, ఎస్టీలలో భూమిలేని నిరుపేదలకు అసైన్మెంట్ కమిటీలో 65 ఎకరాల దాకా పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. మిగతా భూమి స్వాహా అయినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన వీఆర్వో రాజకీయ పలుకుబడితో గుట్టలను తన అనుచరులకు పట్టాలు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త పాలకవర్గం అక్రమ పట్టాలపైన, భూ కబ్జాలపైన దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

**మా దృష్టికి రాలేదు: మధుసూదన్రెడ్డి, తహసీల్దార్, దేవరకొండ**

కాచారం గుట్ట వద్ద ప్రభుత్వ భూముల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని మా దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ చేపడుతాం.

## ఇలా వదిలేస్తే 'పుట్టవా.. కుట్టవా?'

హైదరాబాద్ : గుర్రపుడెక్క.. చెరువంతా ఆక్రమించి దోమలు పెరిగేందుకు కారణమవుతోంది. నీటి ప్రవాహాన్ని అడ్డుకు ంటోంది. జలచరాలు అంతరించిపోయి దోమలు గుడ్లు పెట్టేందుకు అనువైన వాతావరణం ఏర్పడుతోంది. ఫలితంగా దోమలు పెరిగి పరిసర ప్రాంతాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. కంటి మీద కునుకు ఉండట్లేదు. ఏడాదిగా తొలగించే పనులు బల్దియా చేపట్టకపోవడంతో తటాకాలన్నీ గుర్రపుడెక్కతో నిండిపోయాయి. రూ.100 కోట్లతో సుందరీకరించిన దుర్గంచెరువు కూడా గుర్రపుడెక్కతో నిండిపోయిందంటే నిర్వహణ ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఏమిటీ గుర్రపుడెక్క**

గుర్రపుడెక్క నీటిలో తేలియాడే తీగజాతి కలుపు మొక్క. మురుగునీటిలో వేగంగా పెరుగుతుంది. నీటిపై ఆకుపచ్చని తివాచీలా విస్తరిస్తుంది. దోమలు పెరుగుతాయి. ఇంతటి సమస్యాత్మకమైన ఈ కలుపు మొక్కను పలు సంస్థలు సంపదగా మార్చుతున్నాయి. తాళ్లు, బుట్టలు అల్లేందుకు, సేంద్రియ ఎరువు తయారీకి ఉపయోగిస్తుండగా బల్దియా కళ్లప్పగించి చూస్తోంది.



**మొక్కుబడిగా యంత్రాలు**

ఈ గుర్రపుడెక్కను తొలగించేందుకు జీహెచ్?ఎంసీ గతంలో 2 రకాల వ్యూహాలను అమలు చేసేది. 1-5 ఎకరాల్లోపు విస్తీర్ణం, తక్కువ లోతున్న చెరువుల్లో సిబ్బందితో ఆకును తొలగించేది. లోతైన చెరువుల్లో ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్లతో (ఎఫ్టీసీ) పనులు చేయించేది. ఏడాదిగా పనులు జరగడం లేదు. జోన్?కు 1 చొప్పున అద్దెకు తీసుకున్న 6 ఎఫ్?టీసీల్లో 3 మాత్రమే పనిచేస్తున్నాయి.

**90 శాతం చెరువుల్లో సమస్య**

హైటెక్సిటీలోని దుర్గం చెరువు, సికింద్రాబాద్ బోయినపల్లిలోని హస్మత్పేట లేక్, కూకట్పల్లిలోని ఐడీఎల్ చెరువు, మూసాపేటలోని మైసమ్మకుంట, కైత్లాపూర్లోని కాముని చెరువు, ప్రగతినగర్?లోని అంబీర్ చెరువు, కూకట్పల్లిలోని పరికి చెరువు, హైదర్?నగర్?లోని ఆలి తలాబ్ చెరువు.. ఇలా చెప్పుకొంటూపోతే 185 తటాకాల్లో 90 శాతం గుర్రపుడెక్కతో నిండి ఉన్నాయి.

గతేడాది నమోదైన డెంగీ కేసులు.. 1,977

దోమల నియంత్రణకు ఏటా బల్దియా ఖర్చు.. రూ.20 కోట్లు

ఎంటమాలజీ విభాగంలో అధికారులు, సిబ్బంది సంఖ్య.. 2,250

## చిన్న తప్పిదం.. భవిత అంధకారం!

తూప్రాన్ :తూప్రాన్కు చెందిన ఓ యువకుడు గంజాయి సేవించే స్నేహితులతో కలిశాడు. సరఫరా చేయడం మొదలు పెట్టాడు. లాభాలు రావడంతో ఇతర రాష్ట్రాల ముఠా సభ్యులతో చేతులు కలిపి క్రయవిక్రయాలు చేయడం ప్రారంభించాడు. నిఘా పెట్టిన పోలీసులు మూడు నెలల క్రితం పట్టుకొని ఆ కేసులో సంబంధం ఉన్న నలుగురు యువకులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ముగ్గురు ఉన్నత చదువులు చదివి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా చెడుదారిన వెళ్లి జైలు పాలయ్యారు.

తూప్రాన్తో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 8 మంది యువకులు ఓ హోటల్లో మద్యం తాగి యువకులతో గొడవపడ్డారు. తాగిన మైకంలో దాడి చేశారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. హోటల్ నిర్వాహకులు తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా 8 మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో ఇద్దరు ఇంజినీరింగ్, మరో ముగ్గురు డిగ్రీ చదివిన వారున్నారు. ఇద్దరు విదేశాలకు వెళ్లి చదవాలని భావించినా కేసులతో వారి కల నెరవేరలేదు.

ఇటీవల తూప్రాన్ ప్రాంతానికి చెందిన ఆరుగురు యువకులు ఆన్?లైన్? గేమ్?లతో పరిచయమై రెండు నెలల క్రితం హైదరాబాద్?కు ద్విచక్ర వాహనాలపై వెళ్లారు. వివిధ ప్రాంతాల్లో సాయంత్రం సమయంలో పుటుగా తాగారు. తిరిగి వస్తుండగా మేడ్చల్? శివారులో ముగ్గురు యువకులు డ్రెంకెన్? డ్రైవ్?లో పోలీసులకు పట్టుబడ్డారు. ఇందులో ఒక యువకుడు రెండోసారి పట్టుబడటం గమనార్హం.

తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం.. చిన్న తప్పిదాలతో యువకులు వారి బంగారు భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్నారు. ఉమ్మడి మెదక్? జిల్లాలోని ప్రధాన పట్టణాలు, గ్రామాల్లో యువకులు చెడు అలవాట్లకు దగ్గరై పోలీసు కేసుల్లో ఇరుక్కుంటున్నారు. కొందరు క్షణికావేశంలో, మరికొంత మంది మద్యం మత్తులో గొడవల్లో తలదూర్చి దాడులకు పాల్పడుతున్నట్లు పోలీసుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇంకా పలువురు యువకులు గంజాయి సేవించడం అలవాటుగా చేసుకొని వ్యాపారులుగా మారి కేసుల్లో ఇరుక్కొని కటకటాలపాలయ్యారు.

కేసులతో ఉద్యోగాలకు దూరమవుతున్న యువత నరేందర్గౌడ్, డీఎస్పీ, తూప్రాన్యువకులు చెడు అలవాట్లకు బానిసై క్షణికావేశంలో తప్పులు చేస్తున్నారు. గంజాయి తాగినా, విక్రయించినా శిక్షలు కఠినంగా ఉన్నాయి. చిన్నారుల పోర్న్? వీడియోలు చూసినా ప్రత్యేక నిఘా పెడుతున్నాం. కేసుల్లో దొరికితే జైలుకు పంపిస్తున్నాం. డ్రంకెన్ డ్రైవ్లో పట్టుబడిన వారి వివరాలను ఆన్లైన్లో వేలిముద్రలతో నమోదు చేస్తున్నాం. దేశంలో ఎక్కడ కేసుల్లో



ఇరుకున్నా ఈ వివరాలు బహిర్గతమవుతాయి. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేక ఈ పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్? ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన సమయంలో అభ్యర్థుల క్రిమినల్? వివరాలు ఆరా తీస్తున్నారు. ఆ సమయంలో ఉద్యోగాలకు దూరమయ్యే అవకాశం ఉంది.

పటిష్ఠ నిఘా..ఇటీవలి కాలంలో ఉన్నత చదువులు చదివిన యువకులు ఒక చోట చేరి చిన్నారుల పోర్న్? వీడియోలు చూసిన వారిని పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేసి రిమాండుకు పంపారు. మెదక్? జిల్లాలో ఆరు నెలల వ్యవధిలో 5 కేసుల్లో 12 మందికి పైగా యువకులను పోలీసులు రిమాండ్? చేశారు. ప్రధానంగా చదువుకునే యువకులు ఉద్యోగాలు లేక ఖాళీగా ఉంటున్న వారే ఇంట్లో నుంచి బయటకు వచ్చి ఇలాంటి తప్పులు చేస్తున్నట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. ఉమ్మడి జిల్లాలో అన్ని కేసుల్లో కలిపి యేటా సుమారు 500 మంది వరకు ఉంటారని అంచనా. తల్లిదండ్రులు, సంరక్షకులు తమ పిల్లలపై ఎప్పటికప్పుడు నిఘా పెడితేనే ప్రయోజకులుగా మారే అవకాశం ఉంది.

# పిక్క 'తింటున్నాయ్'

హైదరాబాద్: జన సమ్మర్ద ప్రాంతాల్లో శునకాలను తిరగనివ్వొద్దని సుప్రీంకోర్టు ఆదేశిస్తే జీహెచ్ఎంసీ అధికారులు నగరాన్ని శునకాల సంతానోత్పత్తి కేంద్రంగా మార్చారు. ఏటికేడు గ్రేటర్ వీధుల్లో పెరుగుతోన్న శునకాలే అందుకు నిదర్శనం. ఏ వీధిలో చూసినా స్వైర విహారం చేస్తున్నాయి. కనిపిస్తే పీక్కు తింటున్నాయ్. ఖైరతాబాద్లో చిన్నారి శార్వి (5) కుక్కకాటుకు గురైన శ్రీనివాసనగర్లోని పరిస్థితే అందుకు నిదర్శనం. పగలు, రాత్రనే తేడా లేకుండా పిచ్చెక్కినట్లుగా అరుస్తున్నాయని, ద్విచక్ర వాహనాలను వెంబడిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు.

**అవినీతిలో అధికారులు..:** ఏబీసీ ఆపరేషన్లు, రేబిస్ టీకాలకు బల్దియా ఏటా రూ.25 కోట్లు ఖర్చు చేస్తోంది. అందులో సగం పలువురు అవినీతి అధికారులు దారి మళ్లిస్తున్నారనే విమర్శలున్నాయి. కుక్కలను సంరక్షణ కేంద్రాలకు తరలించి ఆపరేషన్లు, టీకాలు వేస్తున్నామనే



పేరుతో ప్రజాధనాన్ని దోపిడీ చేస్తుండటంతో శునకాల సంఖ్య అంతకంతకు పెరుగుతోందనే ఆరోపణలొస్తున్నాయి.

**2,500 కుక్కలకే వసతి:** సుప్రీం ఆదేశాలు అమలు చేయాలంటే నగరం నలువైపులా కనీసం 50 వేల శునకాలకు ఆశ్రయం ఇవ్వగల సంరక్షణ కేంద్రాలు అవసరం. ప్రస్తుతం ఫతుల్లాగూడ, చుడీబజార్, పటేల్నగర్, కేపీహెచ్బీకాలనీ, మహదేవ్పూర్ కేంద్రాల్లో 2,500 కుక్కలకే వసతి సౌకర్యం ఉంది. రోజూ 150 సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకే వసతులున్నాయి.

కుక్కకాట్లు.. 2025లో.. 50 వేలు
2024లో.. 42 వేలు
బాధితుల్లో 30–60 శాతం (15 ఏళ్లలోపు చిన్నారులే.)

# 'పుర' పోరుకు తెరలేచె

కరీంనగర్ : పురపోరు సందడి మొదలైంది. బుధవారం నుంచి నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన సందడి కనిపించనుంది. షెడ్యూల్ వెలువడటంతో యంత్రాంగమం తా అప్రమత్తమైంది. నామపత్రాల స్వీకరణకు సంబంధించి కార్పొరేషన్లు, పురపాలికల్లో ఏర్పాట్లు చేశారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మాత్రమే దాఖలుకు అవకాశం ఉండటంతో పోటీ చేయాలనుకునే అభ్యర్థుల్లో అలజడి మొదలైంది. ఇంటి బకాయిలు చెల్లించడంతోపాటు కుల ధ్రువీకరణ పత్రాలను పొందేందుకుకు బల్దియాలకు పరుగులు తీస్తున్నారు. కరీంనగర్, రామగుండం కార్పొరేషన్లతోపాటు 13 పురపాలికల్లో మొత్తంగా 467 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 11న పోలింగ్ జరుగనుండగా ఓట్ల లెక్కింపును ఫిబ్రవరి 13వ తేదీన చేపట్టనున్నారు. కొత్త పాలక వర్గాలు అదే నెల 16వతేదీన కొలువుదీరనున్నాయి.



**అమలులో 'కోడ్'!**

షెడ్యూల్ వెలువడటంతో తక్షణమే ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఆయా వార్డుల్లో రాజకీయ పార్టీల నాయకులు కట్టిన ఫ్లెక్సీలను బల్దియా సిబ్బంది తొలగిస్తారు. దీంతోపాటు రాజకీయ నాయకుల విగ్రహాలు కనిపించకుండా ముసుగు వేస్తారు. ఎక్కడా కొత్తగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేపట్టకుండా పర్యవేక్షణను పెంచుతారు. నాలుగు జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన ప్రక్రియలో వేగాన్ని పెంచారు. బల్దియాకు ముగ్గురు చొప్పున 45 మంది వరకు నోడల్ అధికారులను నియమించారు. మరోవైపు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక పరిశీలన బృందాలను నియమించారు.

# 'అక్కపల్లి'కి మోక్షమెప్పుడో?

ధర్మపురి : ధర్మపురి పట్టణానికి తాగు, 10 పల్లెలకు సాగు నీటిని అందించే లక్ష్యంతో డిజైన్ చేసిన అక్కపల్లి ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదలైనా పనులు అర్ధంతరంగా నిలిచి పోయాయి. గత ప్రభుత్వంలో ప్రారంభించిన ఈ పనులు సాంకేతిక లోపాల కారణంగా నిలిచి పోయాయి. 5 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగతా పనులు పెండింగులో ఉండిపోయాయి. గోదావరి నుంచి కిలోమీటరు సమీపంలో నీటిని నిల్వ చేసే లక్ష్యంతో పెద్ద బావి తవ్వారు. ఈ పనులు వేగం పుంజుకుంటున్న తరుణంలో ఎన్నికలు వచ్చాయి. ఆ తర్వాత ఉన్నతాధికారులు డిజైనింగ్లో స్వల్ప మార్పులతో ప్రతిపాదించగా దీనికి మోక్షం కలగడం లేదు.

అక్కపల్లి చెరువులో ఎప్పుడూ 0.15 టీఎంసీల నీటిని నిల్వ ఉంచేలా ఎస్సారెస్పీ అధికారులు స్థిరీకరించారు. బావికి గోదావరి నుంచి అనుసంధానం చేయడం, ఆ తర్వాత పైపులైన్ ఏర్పాటు చేసి అక్కపల్లి చెరువులోకి ఒక సెకన్కు 50 క్యూసెక్కుల నీటిని పంపించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ పనులు పూర్తయితే ధర్మపురి, నర్సయ్యపల్లె, కోరండ్లపల్లె, కొత్తకోరండ్లపల్లె, బుద్దేశ్పల్లి, తుమ్మెనాల, నాగారం, కమలాపూర్ రైతులకు రెండు పంటలకు పూర్తి స్థాయిలో సాగు నీరందుతుంది.

త్వరలో సమీక్షిస్తాం..

అక్కపల్లి ఎత్తిపోతల పథకంతో అనేక ప్రయోజనాలున్నాయి. ఇది ప్రభుత్వం దృష్టిలో ఉంది. ఉన్నతాధికారులు దీని డిజైన్ మార్చాలని ప్రతిపాదించారు. దీంతో కొంత ఆలస్యం జరిగింది. త్వరలో దీనిపై సమీక్ష చేసి చర్యలు తీసుకుంటాం.
అడ్లూరి లక్ష్మణ్కుమార్, మంత్రి

# సీఎన్జీ.. సరిపడా లేదండి!



హైదరాబాద్: గ్రేటర్ పరిధిలో సీఎన్జీ వాహనాలకు ఇంధన కొరత తీవ్రంగా ఉంది. పెట్రోలు, డీజిల్ ధరలు రోజురోజుకు పెరుగుతుండటం, కాలుష్య నియంత్రణ తదితర కారణాలతో చాలా మంది సీఎన్జీ వాహనాలకు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా సీఎన్జీ ఆటోల వినియోగం చాలా పెరిగింది. సీఎన్జీ కొరత వల్ల బంకుల ముందు రోజూ రాత్రి వేళల్లో వాహనదారులు కి.మీ.ల మేర బారులు తీరుతున్నారు. తమవంతు వచ్చేసరికి ఇంధనం అయిపోయి ఉసూరుమంటూ ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. ఇంధనం దొరకని రోజు ఆటో నడవక ఆటోవాలాలకు పూట గడవటం లేదు. ఫిల్లింగ్ స్టేషన్లు సరిపోవడం లేదు.. 'నగరంలో సీఎన్జీ ఇంధనం కొరత ఉన్నది నిజమే. ఇటీవల పలువురు ఉద్యోగుల సమ్మె కారణంగా బంకులకు ఇంధన సరఫరా చేయలేకపోయాం. నగరంలో ఉన్న సీఎన్జీ వాహనాలకు 83 ఫిల్లింగ్ స్టేషన్లు సరిపోవడం లేదు. త్వరలోనే టెండర్లు పిలిచి మరిన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఆ ప్రక్రియ కొనసాగుతుంది. మరో రెండు నెలల్లో సీఎన్జీ కొరత సాధ్యమైనంత మేర తగ్గే అవకాశం ఉంద'ని గ్యాస్ సంస్థలు పేర్కొన్నాయి.

**అదనంగా వసూలు**

సీఎన్జీ కొరతతో చాలా బంకుల ముందు 'నోస్టాక్' బోర్డులు పెడుతున్నాయి. దీనికితోడు సీఎన్జీ బంకుల్లో నిర్దేశిత ధరకు అదనంగా రూ.10 వరకు వసూలు చేస్తున్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. కొరతను సాకుగా చూపి ఇలా ఇష్టారీతిన వసూలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇంధన కొరతతో ఇబ్బందులు పడుతున్న కార్మికులపై అదనంగా దోపిడీ చేస్తున్నారు.

**తక్షణ చర్యలు తీసుకోవాలి!**

ఆటోల్లో సీఎన్జీ ఇంధనంతో ఉన్నవే ఎక్కువగా ఉంటాయి. నగరంలో సీఎన్జీ కొరత తీవ్రంగా ఉంది. సరైన ప్రణాళిక లేకపోవడం, సరఫరా లోపం స్పష్టంగా కనిపిస్తుంది. సీఎన్జీ సరఫరా మెరుగుపరచాలి. అక్రమంగా వసూలు చేస్తున్న అదనపు ఛార్జీలను అడ్డుకోవాలి. ఈ పరిస్థితి వల్ల గిగ్, ప్లాట్ఫాం కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. పౌర సరఫరా, లీగల్ మెట్రాలజీ శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలి
షేక్ సలాహుద్దీన్, వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ గిగ్, ప్లాట్ఫాం వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూ)

నగరంలో సీఎన్జీ వాహనాలు: సుమారు 80వేలు (వాటిలో సుమారు 90శాతం ఆటోరిక్షాలు)
నగరంలో ఉన్న బంకులు : 83
రోజూవారీ డిమాండ్ : 3.2 లక్షల కిలోలు
అందుబాటులో ఉన్నది : 2.1 లక్షల కిలోలు
ఒక్కో వాహనానికి రోజూ ఎంత అవసరం: 4 కిలోలు
నగరంలో కేజీ సీఎన్జీ : రూ.96
కేజీ ఇచ్చే మైలేజీ : ఆటో – 30 కిలోమీటర్లు , కారు – 25 కిలోమీటర్లు

# కొంటె జేబు గుల్ల.. తింటే ఆరోగ్యం డొల్ల



కరీంనగర్ : ప్రజా రవాణా వ్యవస్థ ద్వారా నిత్యం లక్షలాది మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. కరీంనగర్ రీజియన్లో నిత్యం దాదాపు 4.40 లక్షల మందికికు పైగా ప్రయాణిస్తుంటారు. పండగలు, జాతరల సమయంలో వీరి సంఖ్య మరింత పెరుగుతుంది. వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్టేషన్లో దుకాణదారులు నాసిరకం వస్తువులు, తినుబండారాలు, నీళ్ల సీసాలను అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మేడారం జాతర నేపథ్యంలో చాలామంది రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో 'న్యూస్టుడే' పరిశీలనాత్మక కథనం.

**ఇలా జరుగుతుంది..**

బస్టాండ్లోని స్టాల్లో ఓ ప్రయాణికుడు బ్రాండెడ్ కంపెనీ నీళ్ల సీసా అడిగాడు. అది లేదని.. వేరే బ్రాండ్ని చూపించాడు. గత్యంతరం లేక కొన్నాడు. ధర కూడా లీటర్ సీసాకు రూ.30 తీసుకున్నాడు. బయట దుకాణాల్లో బ్రాండెడ్ లీటరు సీసా రూ.20కి మాత్రమే లభిస్తుంది. మరో ప్రయాణికుడు ఓ బ్రాండెడ్ బిస్కెట్ ప్యాకెట్ అడగ్గా అది దొరకలేదు. ఇతర బ్రాండ్లవి మాత్రమే ఉన్నాయి.

చిన్న సమోసాలు బయట రూ.20కి 4 ఇస్తుండగా, ఇక్కడ రూ.30 తీసుకుంటున్నారు.

**కొరవడిన అధికారుల పర్యవేక్షణ**

నీళ్ల సీసాలకు సంబంధించి ఎక్కడా లభించని కంపెనీలు ఇక్కడ ఉంటాయి. ఆర్వో ప్లాంట్ల నీటిని నింపి విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అవి ఎక్కడ తయారయ్యాయి. వాటిలో ఎలాంటి నీటిని నింపుతున్నారని అధికారులు చూడటంలేదు.

చక్రాలు, పాప్కార్న్, కొన్ని రకాల చిప్స్ లాంటి తినుబండారాల ప్యాకెట్లు విక్రయిస్తున్నారు. వాటిపై తయారీ తేదీ, గడువు, ఎమ్మార్పీ, కస్టమర్కేర్, ఇతర వివరాలు ఏవి లేవు. ఎంత అడిగితే అంతా ఇవ్వాల్సిందే.

సమోసాలు, మిర్చి, తదితర తినుబండారాలు నాసిరకంగా ఉంటున్నాయి. వీటిపై ఈగలు, దోమలు వాలకుండా, దుమ్ము పడకుండా మూతలు పెట్టడంలేదు. నాసిరకం వస్తువులకు అధిక ధరలు చెల్లించి.. ప్రయాణికులు జేబు గుల్లతోపాటు జబ్బులు కొని తెచ్చుకుంటున్నారు.

**అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు**

నీళ్ల సీసాలు, ఇతరత్రా వస్తువులు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించొద్దు. ఎవరైనా డబ్బులు అధికంగా తీసుకుంటే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. నాసిరకం వస్తువులు, తినుబండారాలు కూడా విక్రయించొద్దు. జాతర నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిరంతరం పర్యవేక్షిస్తుంటాం.

# మేడారానికి దారులివీ..

ములుగు : జనవరి 28 నుంచి ప్రారంభం కానున్న మేడారం మహా జాతరలో ట్రాఫిక్ నియంత్రణ అత్యంత కీలకం. పోలీసు ఉన్నతాధికారులు నెల రోజుల ముందు నుంచే అన్ని రూట్లలో పర్యటించి.. వాహనాల క్రమబద్ధీకరణ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. దీని కోసం ప్రత్యేకంగా రూట్ మ్యాప్ను సిద్ధం చేశారు. మేడారం మహా జాతరకు నాలుగు దారుల నుంచి వాహనాలు వస్తుంటాయి. ఏ దారి గుండా వచ్చే వాహనాలు జాతరకు ఎలా చేరుకోవాలి.. తిరిగి ఏమార్గంలో వెళ్లాలన్నదానిపై ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. వివిధ మార్గాల గుండా వచ్చే వాహనాలకు అనువుగా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. ఈ సారి జాతరకు సుమారు 5 లక్షల ప్రైవేటు వాహనాలు వస్తాయనేది అంచనా. వరంగల్ నుంచి వచ్చేవారు తిరుగు ప్రయాణంలో నార్లాపూర్, బయ్యక్కపేట, గొల్ల బుద్దారం, దూదేకులపల్లి, కమలాపూర్ క్రాస్, భూపాలపల్లి, గణపురం క్రాస్రోడ్డు, రేగొండ, పరకాల, అంబాల క్రాస్, కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల, వరంగల్ బైపాస్, కరుణాపురం, చిన్న పెండ్యాల మీదుగా వరంగల్ చేరుకుంటాయి.

**పార్కింగ్ ప్రదేశాలు** వెంగళాపూర్, నార్లాపూర్, చింతల్, కన్నెపల్లి, కొత్తూరు, యాసంగి తోగు, ముత్యాల గూడెం. మహారాష్ట్ర, రామగుండం, కరీంనగర్, కాళేశ్వరం నుంచి వచ్చే వాహనాలు కాటారం దగ్గర ఎడమ వైపు తిరిగి పెగడపల్లి, కాల్వపల్లి, ఊరట్టం పార్కింగ్ ప్రదేశాలకు చేరుకుంటాయి. అక్కడి నుంచి తిరుగు ప్రయాణం ఊరట్టం పార్కింగ్ ప్రదేశం నుంచి నార్లపూర్, బయ్యక్కపేట, కమలాపూర్ టీ జంక్షన్, కుడి వైపు తిరిగి కాటారం, కాళేశ్వరం, రామగుండం, మహారాష్ట్ర వెళ్లవచ్చు.

**గద్దెల నుంచి పార్కింగ్ ప్రదేశాల దూరం కి.మీ.**

ఆర్టీసీ బస్టాండు అర కిలోమీటరు. ఊరట్టం పార్కింగ్ ప్రదేశం 4.



కన్నెపల్లి 4. కొత్తూరు 4. చింతల్ 6. నార్లాపూర్ 6. వెంగళాపూర్ 8. జంపన్న వాగు పార్కింగ్ 2. చిలకల గుట్ట ఒక కిలోమీటరు. జంపన్న వాగు 3. కన్నెపల్లి 5. గంగారం మండల పూనుగుండ్లలోని పగిడిద్దరాజు గుడి నుంచి మేడారం గద్దెలకు 70 కిలోమీటర్లు.

ఏటూరునాగారం మండల కొండాయిలోని గోవిందరాజులు గుడి నుంచి 18 కి.మీటర్లు. వరంగల్ వైపు నుంచి వచ్చే ప్రైవేటు వాహనాలు ఆరెపల్లి, గుడెప్పాడ్, మల్లంపల్లి, ములుగు, జంగాలపల్లి, పస్రా, వెంగళాపూర్, నార్లాపూర్ దారిలో మేడారం చేరతాయి.

ఖమ్మం జిల్లా నుంచి వచ్చే వాహనాలు భద్రాచలం, మణుగూరు, బయ్యారం, మంగపేట, ఏటూరునాగారం, చిన్నబోయినపల్లి క్రాస్, కొండాయి మీదుగా ఊరట్టం పార్కింగ్ ప్రదేశానికి చేరుకుంటాయి. మేడారం జాతరకు రాష్ట్రంలోని వివిధ డిపోల నుంచి 4 వేల బస్సులు నడపడానికి ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. వరంగల్ నుంచి ఆరెపల్లి గుడెప్పాడు, మల్లంపల్లి, ములుగు, జంగాలపల్లి, పస్రా, తాడ్వాయి మీదుగా ఆర్టీసీ బస్సులు మేడారం చేరుకుంటాయి.

# మోగింది 'పుర' నగారా!

ఖమ్మం : పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. ఖమ్మం జిల్లాలోని ఐదు పురపాలికల్లోని 117 వార్డులు, భద్రాద్రి జిల్లా కొత్తగూడెం నగరపాలికలోని 60 డివిజన్లతో పాటు రెండు పురపాలికల్లోని 46 వార్డులకు ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. ఇందుకు కీలకమైన ఎన్నిక ప్రకటనను ఆయా పురపాలికల్లో రిటర్నింగ్ అధికారులు (ఈనెల 28) విడుదల చేస్తారు. వెంటనే వార్డుల వారీగా ఓటరు జాబితాలు ప్రదర్శిస్తారు. అదేరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నామపత్రాలు స్వీకరిస్తారు. ఈక్రతువు వరకు కొనసాగు తుంది. నామపత్రాలను పరిశీలించి చెల్లుబాటైన వాటిని ప్రకటిస్తారు. వీటిపై ఆదివారం (ఫిబ్రవరి 1) ఉదయం నుంచి సాయంత్రం వరకు అప్పీలు చేసుకోవచ్చు. దాఖలైన అప్పీళ్లను సోమవారం పరిష్కరిస్తారు. ఫిబ్రవరి 3న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు.



ఉభయ జిల్లాల్లో ఇప్పటికే నాలుగు పురపాలికల పాలకవర్గాలకు పదవీకాలం ముగియగా.. కల్లూరు, ఏదులాపురం, అశ్వారావుపేట పురపాలికలు కొత్తగా ఏర్పడ్డాయి. గడువు ముగిసినవి, కొత్తగా ఏర్పడిన వాటికి మాత్రమే ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఖమ్మం నగరపాలిక పాలకవర్గం గడువు మే 7 వరకు ఉంది. ఆ తరువాత ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్

మున్సిపల్ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని హైదరాబాద్ నుంచి వీసీని నిర్వహించారు. ఇక్కడి నుంచి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, డీఆర్ఓ పద్మశ్రీ, డీఆర్డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

# గల్లీల్లో.. మైకుల లొల్లి

సూర్యాపేట : చక్కెరమ్మా చక్కెర.. కొబ్బరి కుడుకలకు చక్కెర.. ముగ్గండోయ్ ముగ్గు.. పాలరాతి ముగ్గు.. గ్యాస్టవ్ రిపేర్.. పాత ఇనుప సామాన్లు కొంటాం.. అల్లమెల్లిగడ్డ.. నిత్యం మనచెవులకు వినపడే శబ్దాలివి. చాలామంది మైకుల హోరుతోనే నిద్ర లేస్తున్నారు. చిరాకు పడుతూనే తమ దినచర్యను ప్రారంభిస్తున్నారు. గతంలో వీధి వ్యాపారులు మైకులను వినియోగించకుండా తమ వ్యాపారాలు నిర్వహించారు. దీనివల్ల ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుతం మైకులు వాడని వీధి వ్యాపారులు లేరంటే అతిశయోక్తి కాదు.

ప్రజల ఇబ్బందులతో మాకేంటి పని.. వ్యాపారం జరిగిందా.. లేదా అన్నచందంగా ఉంది పలువురు వీధి వ్యాపారుల తీరు. నిబంధనలకు విరుద్ధంగా మైకులను వినియోగిస్తూ గల్లీల్లో హోరెత్తిస్తున్నారు. పట్టణప్రాంతాలు, అపార్టుమెంట్లు అధికంగా ఉన్నచోట వీరితో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పదుల సంఖ్యలో వీధి వ్యాపారులు వస్తున్నారని.. అధిక శబ్దం గల మైకులను వినియోగిస్తున్నారని చెబుతున్నారు.

**వృద్ధులకు ప్రశాంతత కరవు**

అసలే చలికాలం.. వృద్ధులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుంటారు. కాసింత ఎక్కువ సమయం నిద్రపోవాలని భావిస్తారు. ఈ మైకుల కారణంగా తమకు ప్రశాంతత లేకుండా పోతోందని.. ఉదయమే ఉలిక్కిపడి నిద్రలేవాల్సి వస్తోందని వాపోతున్నారు.

**విద్యార్థులకు తప్పని అవస్థలు..**

మరికొద్ది రోజుల్లో పదోతరగతి, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నా



యి. ఉదయం చదువుకుందామని పుస్తకాలు తీయగానే పలువురు వీధివ్యాపారులు వినియోగిస్తున్న మైకుల కారణంగా ఏకాగ్రత దెబ్బతింటోందని విద్యార్థులు చెబుతున్నారు. విద్యాలయాల చెంత కనీస నిబంధనలు అమలు కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనల అమలెక్కడ**

వీధి వ్యాపారులు తమ వాహనాలపై సౌండ్బాక్సులు, లేదా మైకులు పెట్టుకుని ప్రచారం చేయడం నిబంధనలకు విరుద్ధం. స్థానిక మున్సిపల్ నిబంధనల ప్రకారం. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు అసౌకర్యం కలిగించేలా శబ్దం చేయడం 'పబ్లిక్ న్యూసెన్స్' కిందకు వస్తుంది. బాధ్యులైన వారికి అధికారులు జరిమానా విధించవచ్చు. సాధారణంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండాలంటే 60 నుంచి 70 డెసిబుల్స్ శబ్దం సురక్షితం. 85 డెసిబుల్స్ దాడితే చెవుల్లోని సున్నితమైన కణాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. వీధివ్యాపారులు వినియోగించే మైకుల హోరు పరిమితికి మించి ఉంటోందని పలువురు వాపోతున్నారు.

**ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు**–హన్మంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేటవాహనాలకు మైకులు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్న వారితో మాట్లాడి అవగాహన కల్పిస్తాం. వార్డుల్లో మైకులను వినియోగిస్తూ ప్రజలను ఇబ్బందులను గురిచేయడం తగదు. మున్సిపల్ నిబంధనల ప్రకారం తప్పకుండా అనుమతి పొందాలి. లేనివారిపై కఠినంగా వ్యవహరిస్తాం.

# 'అంటు'కుంది.. ఉపాధి!

కూసుమంచి : కూసుమంచి మండలం లోక్యాతండాకు చెందిన పలువురు యువకులు గతంలో ఉపాధి కోసం వలస వెళ్లేవారు. రాజమహేంద్రవరం,కడియంలో మామిడి మొక్కలను అంటుకట్టే కూలీ పనులు చేసేవారు. స్వగ్రామంలో మామిడి అంటు మొక్కల నర్సరీలు ఏర్పాటుచేస్తే లాభసాటిగా ఉండటంతో పాటు వందలాది మందికి ఉపాధి కల్పించవచ్చునని భావించారు. సుమారు 15ఏళ్ల క్రితం పది మంది యువకులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో మొక్కల పెంపకాన్ని ప్రారంభించారు. వీరిని చూసి ఇంకొందరు ముందుకొచ్చారు. ఇప్పుడు లోక్యాతండాలో సుమారు 60 నర్సరీలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి నుంచి నాణ్యమైన అంటు మొక్కలు ఎగుమతి అవుతున్నాయి.

**ఏప్రిల్ నుంచి పనులు**

నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ తదితర జిల్లాల్లో మామిడి టెంకలను ఏప్రిల్‌లో సేకరిస్తారు. ఆయా జిల్లాల్లో ఆంచూర్ కోసం మామిడి వినియోగం ఎక్కువ. అందుకే అక్కడ టెంకలు విరివిగా లభిస్తాయి. లక్ష మొక్కలు పెంచాలనుకునే నర్సరీ నిర్వాహకులు రెండు లక్షల టెంకలు సేకరిస్తారు. నర్సరీలకు చేరిన నాణ్యమైన మట్టిని ప్లాస్టిక్ సంచుల్లో నింపుతారు. ప్రతి పాకెట్‌కు 70 పైసల చొప్పున కూలీలకు



చెల్లిస్తారు. లక్ష మొక్కల నర్సరీ ద్వారా కూలీలకు రూ.70వేలు సమకూరుతాయి. పాకెట్లు నింపుతున్న కూలీలకు ఎరువు కలిపిన మట్టిని చేరవేసేందుకు పురుషులను నియమిస్తారు. ఒక్కొక్కరికి రూ.800 చొప్పున రూ.20వేలు వెచ్చిస్తారు.

అంటుకట్టేందుకు (గ్రాఫ్టింగ్) నిపుణులకు ప్రతి మొక్కకు రూ.2 చొప్పున నిర్వాహకులు చెల్లిస్తారు. ఈరకంగా రూ.2లక్షలు ఖర్చవుతాయి. కలుపు తీసేందుకు పది మంది చొప్పున కనీసం పది రోజుల పాటు కూలీలు అవసరం. వీరికి రూ.50వేలు చెల్లిస్తారు.

టెంకల శుద్ధి, మట్టి నింపిన సంచుల్లో టెంకలు నాటేందుకు 50 పైసల చొప్పున ఖర్చవుతుంది. తద్వారా రూ.50వేలు కూలీలకు చేరుతాయి. నాణ్యమైన మొక్కలు ఎంపిక (గ్రేడింగ్) చేసి అంటుకడతారు. డిసెంబర్ చివరి నాటికి అంటు మొక్కలను లారీల్లో ఎగుమతి చేస్తారు. 60 పైసల చొప్పున లక్ష మొక్కల ఎగుమతికి రూ.60వేలు చెల్లిస్తారు. టెంకల సేకరణ నుంచి మొక్కల ఎగుమతి వరకు లక్ష మొక్కల నర్సరీకి సుమారు రూ.16–18లక్షలు పెట్టుబడి పెడతారు.

ఖర్చులు పోనూ తొమ్మిది నెలలకు సుమారు రూ.6లక్షలకు పైగా ఆదాయం సముపార్జిస్తారు. ఈసారి అధిక వర్షాలతో ఆదాయం రూ.5లక్షల వరకు పరిమితమవుతోందని సమాచారం. ప్రతి సీజన్‌లో సుమారు 2వేల మందికి లోక్యాతండాలో ఉపాధి లభిస్తుండటం గమనార్హం. సుమారు లక్ష మొక్కలు పెంచే నిర్వాహకులు రూ.5.50 లక్షల వరకు కూలీలకు చెల్లిస్తున్నారు. లోక్యాతండా, సమీప గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది కూలీలు వస్తుంటారు.
వడ్తియా ధర్మా, నర్సరీ నిర్వాహకుడు

# టెండర్లకు అనూహ్య స్పందన

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వ రంగసంస్థ ఖమ్మం విజయడెయిరీ నూతన దుకాణాల సముదాయానికి అనూహ్య స్పందన లభించింది. మొత్తం పది దుకాణాలకు సంబంధించి టెండరు ప్రక్రియ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో పూర్తి చేశారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు, టెండరు దరఖాస్తుదారులు పాల్గొన్నారు. మొత్తం పది దుకాణాలకు గానూ 39 దరఖాస్తులు విక్రయించగా.. 33 మంది పాల్గొన్నారు. ఆరుగురు పాల్గొనలేదు. గత అక్టోబరు 30న అధికారులు టెండరు ప్రకటన విడుదల చేశారు. టెండరు ఫారం ధర రూ.1,000గా నిర్ణయించారు. ఈనెల 25 టెండరు గడువు పూర్తి కాగా ఒక రోజు ముందు వరకు కేవలం 8 మంది దాఖలు చేయగా.. చివరి రోజు 25 మంది పాల్గొన్నారు.

**ఊహించని రీతిలో..**

ఒక్కో దుకాణానికి నెలకు రూ.15వేల అద్దెతో పాటు ఈఎండీ రూ.20వేలు, సెక్యూరిటీ డిపాజిట్లు రూ.2లక్షల చొప్పున నిర్ణయించారు. అధికారులే ఆశ్చర్యపోయే విధంగా ఊహించని రీతిలో ఒక్కో దుకాణానికి గరిష్ఠంగా రూ.29,100, కనిష్ఠంగా రూ.17,800 చొప్పున దరఖాస్తుదారులు కోట్ చేయటం విశేషం. ఒకటో నంబరు దుకాణానికి అత్యధిక అద్దె కోట్ చేశారు. ప్రధాన రోడ్డు పక్కనే ఉ



ండటంతో ఇక్కడ ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని టెండరుదారులు పోటీపడి మొత్తం పది దుకాణాలకు కూడా నిర్ణయించిన దానికంటే ఎక్కువ అద్దెను కోట్ చేశారు. ఈ లెక్కన ఏడాదికి దుకాణాల సముదాయం ద్వారా రూ.2లక్షల వరకు డెయిరీకి ఆదాయం సమకూరనుంది. సెక్యూరిటీ డిపాజిట్ రూ.20లక్షల వరకు సంస్థలో నిల్వ ఉంటోంది.

**మంత్రి తుమ్మల ఆదేశాలతో..**

వాస్తవానికి దుకాణాలు నిర్మించి మూడు సంవత్సరాలు గడిచింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఖాళీగా ఉంటున్నాయి. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డెయిరీని సందర్శించిన సమయంలో దుకాణాలు ప్రారంభించని విషయం ఆయన దృష్టికి వచ్చింది. వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించడంతో పూర్తి చేశారు.

టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాం. పది దుకాణాల ద్వారా ప్రతి నెలా డెయిరీకి ఆదాయం వస్తుంది. జిల్లాలో పాల సేకరణ, పాల అమ్మకాలను పెంచటంతో పాటు రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తాం.
కె.రవికుమార్, డెయిరీ ఉపసంచాలకుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా

# కొలువుల కల.. వీసాల వల!




హైదరాబాద్ : హిమాయత్‌నగర్‌లోని ఓ కన్సల్టెన్సీ నిర్వాహకులు.. వారంలోనే వీసాలు, పక్కా ప్లేస్‌మెంట్ ఇప్పిస్తామంటూ ఏజెంట్ల ద్వారా ప్రచారం చేయించారు. ఎటువంటి విద్యార్హతలు, అనుభవం లేకుండానే విదేశాల్లో కొలువులనగానే ఎంతోమంది పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నకిలీ వీసాలు అంటగట్టి 25 మంది నుంచి రూ.కోటి కాజేశారు. ..ఇలాంటి కేసుల్లో కొద్దిరోజులు కన్సల్టెన్సీల కార్యాలయాలు మూసివేస్తున్నారు. పేరు మార్చుకొని మరోచోట పాగా వేసి దోచుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆకట్టుకునే ప్రకటనలు.. ఖరీదైన ప్రాంతాల్లో కార్యాలయాలు.. తక్కువ సమయంలో విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటూ నకిలీ కన్సల్టెన్సీలు మోసాలకు పాల్పడుతున్నాయి. వీరి ద్వారా వర్క్‌పర్మిట్ వీసాపై విదేశాలకు వెళ్లిన కొందరు సైబర్, డ్రగ్స్ ముఠాల చేతుల్లో బానిసలుగా మారుతున్నారు. ఈ మోసాలపై కఠిన చర్యలకు పోలీసు యంత్రాంగం సిద్ధమైంది. విద్యాసంస్థలు, శిక్షణా కేంద్రాలున్న ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించనున్నారు.

**ఎలా మోసపోతున్నారంటే..**

అమీర్‌పేట్, మాదాపూర్, ఎస్సార్‌నగర్, అబిడ్స్, నారాయణగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో కార్యాలయాలు ప్రారంభిస్తారు. కమీషన్ ఇస్తామని ఏజెంట్లను ఏర్పాటు చేసుకుంటారు. టెలిగ్రామ్, స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల్లో విదేశాల్లో ఉద్యోగాల పేరిట ప్రకటనలిస్తారు. నిజమని భావించి వెళ్లిన అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తారు. రిజిస్ట్రేషన్ ఫీజులు వసూలుచేస్తారు. గల్ఫ్ దేశాలకు పంపే వారికి విజిటింగ్, టూరిస్ట్‌వీసాలు అంటగడతారు. అమెరికా, జర్మనీ, ఆస్ట్రేలియా, జపాన్ తదితర దేశాలకు వెళ్లాలనుకునే వారికి నకిలీ వర్క్‌పర్మిట్‌లు, జాబ్ ఆఫర్ లెటర్లు చేతికిస్తారు. గతేడాది నకిలీల బారిన పడిన 750 మంది బాధితులు సుమారు రూ.200 కోట్లు పోగొట్టుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**నిర్ధారించుకున్నాకే నిర్ణయం తీసుకోండి**

సామాజికమాధ్యమాలు, యూట్యూబ్‌ల్లో పోస్ట్ చేసే ప్రకటనలను ధ్రువీకరించుకోవాలి. ఆయా కన్సల్టెన్సీలపై ఏమైనా పోలీసు కేసులున్నాయనేది పరిశీలించాలి. ఇమ్మిగ్రేషన్ వెబ్‌సైట్ ద్వారా కన్సలెన్సీలు అందించిన జాబ్‌లెటర్, స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్లను ధ్రువీకరించుకోవాలి. గతంలో అక్కడ నుంచి ఉద్యోగం పొందిన వారికి ఫోన్ చేసి నిర్ధారించుకున్నాకే నిర్ణయం తీసుకోవాలి.
ఎం.శ్రీనివాసులు, అదనపు సీపీ, నగర సీసీఎస్

# దోపిడీ ఉచితం.. ఆదాయం అదనం



హైదరాబాద్: జీహెచ్ఎంసీ అధికారుల ఉదాసీనత కొన్ని వ్యాపార కేంద్రాలకు అదనపు ఆదాయ వనరుగా మారింది. పార్కింగ్ ఉచితమైనా..నగర ప్రజలను దోచేస్తున్నాయి. రూ.కోట్ల దందా జరుగుతున్నా ఆచూకీ తెలుసుకునే ప్రయత్నం కనిపించడం లేదు.

ఇవీ షరతులు: రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 1, 2018న నగరంలో ఉచిత పార్కింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీనికి కొన్ని షరతులూ ఉన్నాయి. షాపింగ్ మాల్, కమర్షియల్ కాంప్లెక్స్, మల్టీప్లెక్స్, ఇతర వ్యాపార కేంద్రాలకు వినియోగదారు వాహనంతో వెళ్లినప్పుడు.. తన వాహనాన్ని అరగంటపాటు ఉచితంగా పార్కింగ్ చేసుకోవచ్చు. ఏదేనీ వస్తువును కొనుగోలు చేస్తే గంట వరకు..

గంటకుపైగా వాహనాన్ని నిలిపితే మాత్రం.. కొనుగోలు చేసిన వస్తువు విలువ.. పార్కింగ్ సమయానికి విధించే రుసుముకన్నా అధికంగా ఉండాలి.

**ఫీజు కడితేనే లోపలికి..**

బేగంపేట్ మెట్రోస్టేషన్ వద్ద మైహోం టైకూన్, వైట్‌హౌజ్ అనే వాణిజ్య కేంద్రాలున్నాయి. వాటిలో పదుల కొద్దీ షాపింగ్ కేంద్రాలు ఉన్నాయి. కార్లు, ద్విచక్ర వాహనాలతో రోజూ వేయి మందికిపైగా సందర్శిస్తారు. లోపలికి ప్రవేశించగానే పార్కింగ్ తాత్కాలిక రసీదు చేతిలో పెట్టి, కారుకు రూ.50, ద్విచక్ర వాహనానికి రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు.

మైత్రివనం చౌరస్తాలోని ఆదిత్య ఎన్‌క్లేవ్, అబిడ్స్, కోఠి, పంజాగుట్ట, దిల్‌సుఖ్‌నగర్‌లోని వాణిజ్య కేంద్రాల్లోనూ ఈ దందా జరుగుతోంది.

**వీళ్లేం చేస్తున్నారో..:**

జీహెచ్ఎంసీలో గతంలో ఈవీడీఎం(ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్) విభాగం ఉండేది. దానిని హైడ్రాగా మార్చారు. ఆ బాధ్యతను నిర్వర్తించాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు..తమకు సంబంధమేలేనట్టు వ్యవహరిస్తున్నారు.

# జల వలయం.. నగరానికి అభయం



హైదరాబాద్: వేగంగా విస్తరిస్తున్న మహానగరంలో అన్ని ప్రాంతాలకు అంతరాయం లేని తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు జలమండలి భారీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలవనరులను అనుసంధానం చేస్తూ నగరం చుట్టూ 140 కిలోమీటర్ల పరిధిలో రేడియల్ రింగ్ మెయిన్‌ను ఏర్పాటు చేయనుంది. రింగ్ మెయిన్‌ను అనుసంధానం చేస్తూ మరో 96 కిలోమీటర్ల మేర పైపులైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. రూ.8 వేల కోట్ల వ్యయంతో ఈ భారీ ప్రాజెక్ట్ చేపడుతున్నట్లు జలమండలి ప్రకటించింది.

**రింగ్ మెయిన్ అంటే?**

నగరానికి అంతరాయం లేని నీటి సరఫరా కోసం ఏర్పాటు చేయనున్న ప్రధాన పైప్‌లైన్ నెట్‌వర్క్ రింగ్ మెయిన్. ప్రధానంగా ఓఆర్‌ఆర్ వెంబడి దీన్ని ఏర్పాటు చేయాలనేది ప్రతిపాదన. రింగ్ మెయిన్‌కు అనుసంధానంగా వివిధ ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేకంగా పైపులైన్లు ఏర్పాటు చేస్తారు. **ఎందుకోసం..?** రాజధానికి తొలుత జంట జలశయాల నుంచి తాగునీరు అందేది. తర్వాత సింగూరు, మంజీరా తోడయ్యాయి. తాగునీటి అవసరాలు పెరగడంతో కృష్ణా, గోదావరి నదుల నుంచి నీటిని తీసుకుని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. కొన్నేళ్లుగా మంజీరా పైపులైన్లు మరమ్మతులకు గురవుతున్నాయి. కృష్ణా, గోదావరి పైపులైన్లకు ఆటంకం ఏర్పడినా, ఇతర సమస్యలు ఎదురైనా సరఫరాకు అంతరాయం తప్పడం లేదు. నగరానికి నీటిని అందించేందుకు వనరులు ఉన్నా అనుసంధానం కాకపోవడంతో పలు ప్రాంతాలపై ప్రభావం పడుతోంది.ఏ ప్రాంతంలోనూ అంతరాయంలేని నీటి సరఫరాకు రింగ్ మెయిన్ ఉపకరిస్తుందని జలమండలి ఉన్నతాధికారులు వివరిస్తున్నారు. మరో రెండేళ్లలో గోదావరి 2, 3 దశలు అందుబాటులోకి వస్తుండటంతో అన్ని వనరులను రింగ్‌మెయిన్ ద్వారా అనుసంధానం చేస్తే నీటిని అందించేందుకు సానుకూలత ఏర్పడుతుందని అధికారులు పేర్కొంటు న్నారు. ప్రయోజనాలు ఒక ప్రాంతంలో మరమ్మతులు ఏర్పడినా.. ఇతర ప్రాంతాలపై ప్రభావం పడకుండా నీటిని అందించడం. 24 గంటల నీటి సరఫరా లక్ష్యంలో కీలకమైన వ్యవస్థ.అన్ని ప్రాంతాలకు సమాన ఒత్తిడితో నీరు అందించడం

# నైపుణ్య శిక్షణ.. ఉపాధికి నిచ్చెన..!

ఖమ్మం : ఏటీసీ(ఐటీఐ)లను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం వివిధ రకాల కోర్సులను ప్రవేశపెడుతోంది. పారిశ్రామిక అవసరాలు తీర్చటానికి మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉన్న కోర్సులను ఎంపిక చేసి నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఇలాంటి పలు రకాల కోర్సులకు అర్హుల నుంచి ఖమ్మం నగరం టేకులపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తద్వారా యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని సర్కారు భావిస్తోంది. కేవలం పదోతరగతి అర్హతపైనే ఈకోర్సులు చదువుకునే అవకాశముంది. ఎలాంటి వయోపరిమితి లేకపోవటం విశేషం. నైపుణ్య శిక్షణ ద్వారా సొంతంగా యూనిట్లు నెలకొల్పవచ్చు లేదా ప్రైవేటుగా ఉద్యోగాలు చేసుకోవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో టర్నర్, సోలార్ టెక్నీషియ



న్, డ్రోన్ ఆపరేటర్ లాంటి కోర్సులకు ఎక్కువ డిమాండ్ ఉంది.

**మొదలైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ..**

ప్రధానమంత్రి కౌశల్ పథకం ద్వారా ఖమ్మం ఏటీసీలో వివిధ రకాల స్వల్పకాలిక కోర్సులను ప్రవేశపెట్టారు. ఈ కోర్సులకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తారు. ట్రైనింగ్ పూర్తయినట్లు సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ కోర్సులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది.

**కులవృత్తుల వారికీ..**

పీఎం విశ్వకర్మ యోజన ద్వారా కులవృత్తుల వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇవి కేవలం 15 రోజుల కోర్సులు మాత్రమే. ప్రస్తుతం కార్పెంటర్(వడ్రంగి) పనిలో 20 మందికి శిక్షణ ఇచ్చేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. త్వరలోనే శిక్షణ మొదలుపెడతారు. 'విద్యార్థులు స్వల్పకాలిక కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లోని కులవృత్తులవారు తమ నైపుణ్యం పెంచుకునేందుకు ఇక్కడ శిక్షణ పొందవచ్చు. మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సులకు అనుగుణంగా తర్ఫీదు ఇస్తాం' అని ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావుకు తెలిపారు.

# నోరూరించే.. నాంచారి పచ్చళ్లు

ఇల్లెందు : మెప్మా రుణాలు మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయి. ఏదైనా వ్యాపారం చేసి ఆర్థికంగా ఎదగాలనే మహిళలకు మెప్మా అందిస్తున్న రుణాలు భరోసానిస్తున్నాయి. మెప్మా ద్వారా తీసుకున్న రుణంతో వ్యాపారం ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న పట్టణానికి చెందిన గిరిజన మహిళగొగ్గెల నాంచారిపై ప్రత్యేక కథనం.. ఇల్లెందు పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన నాంచారి 18 ఏళ్ల క్రితం మెప్మాలో చేరి మణికంత గ్రూపు ద్వారా రూ.50వేలు రుణం తీసుకుని అల్లికలు, మగ్గం పనులు చేసేవారు. ఆ పనిలో ఆశించిన అభివృద్ధి లేకపోవడంతో మరో వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. నాంచారి వంటలు ఎంతో రుచికరంగా ఉంటాయని పలువురు ప్రోత్సహించడంతో ఆమెకు పచ్చళ్లు తయారు చేయాలనే ఆలోచన వచ్చింది. 8 ఏళ్ల క్రితం పచ్చళ్లు తయారు చేయడం ప్రారంభించారు. మొదట్లో మామిడి, ఉసిరి, కాకర, టమాటా, పచ్చిమిర్చి, నిమ్మకాయ వంటి పచ్చళ్లు తయారు చేసి సింగరేణి కార్మిక కుటుంబాలకు విక్రయించేవారు. దశలవారీగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుని చికెన్, చేప, నాటు కోడి, ప్రాన్స్ తదితర పచ్చళ్లు తయారు చేసి విక్రయించడం ప్రారంభించారు. ప్రస్తుతం రూ.2 లక్షల రుణం తీసుకుని రుచికరమైన పచ్చళ్లు చేయడంతో ఆర్డర్లు పెరిగి కుమారుడు ప్రశాంత్, కోడలు భవానీ సైతం పచ్చళ్ల తయారీలో నిమగ్నమై చేతి నిండా సంపాదించుకుంటున్నారు.

ఆర్నెళ్లుగా విదేశాలకు కొరియర్ ద్వారా వివిధ రకాల పచ్చళ్లు ఎగుమతి చేస్తున్నారు. ఇల్లెందులోని తన కుమారుడి దుకాణంలోనూ విక్రయాలు చేస్తున్నారు. నెలకు రూ. 40 వేలకు పైగా సంపాదిస్తున్నానని నాంచారి అన్నారు. కిలో చికెన్ పచ్చడి రూ.1000, ఉసిరి కాయ పచ్చడి పావుకిలో రూ.150 చొప్పున అమ్ముతున్నానన్నారు.

విదేశాలకు ఎగుమతి..నాంచారి తయారు చేసే పచ్చళ్లు ఇంటి వద్ద అమ్మడంతోపాటు, ఇల్లెందు, చుట్టు పక్కన మండలాలు, ఖమ్మం, కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్‌లోని జంగారెడ్డిగూడెంనకు సరఫరా అవుతున్నాయి. సింగరేణి కార్మికుల కుటుంబాల్లోని పిల్లలు చాలా మంది అమెరికా, దుబాయ్ వెళ్లి స్థిరపడిన వారున్నారు. ఆమె పచ్చళ్లకు అలవాటు పడిన వారంతా ఆర్డర్లపై కుటుంబ సభ్యులతో తెప్పించుకుంటున్నారు. తేగాక సామాజిక మాధ్యమాలను ఆమె వినియోగించుకుంటూ పచ్చళ్ల వ్యాపారాన్ని పెంపొదించుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.

# అసంపూర్తి రోడ్డుతో అవస్థలు

ఖమ్మం : ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల అర్బన్ పార్కుకు వెళ్లే రోడ్డు అసంపూర్తిగా ఉంది. నిర్మాణ పనులు నిలిచిపోవటంతో రాకపోకలకు ఇబ్బందవుతోంది. నిత్యం వేల మంది ఈ రహదారిలోనే అటవీ పార్కును సందర్శించేందుకు వెళ్తుంటారు. రోడ్డు నిర్మాణం కోసం 2024, నవంబరు నెలలో నగరపాలక సంస్థ నిధులు రూ.2కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో వైరారోడ్డు నుంచి పార్కు వరకు సీసీ రోడ్డును, డివైడర్లను అభివృద్ధి చేయాల్సి ఉంది. ప్రధాన రోడ్డు నుంచి కొద్ది దూరం వరకు రోడ్డు పూర్తి కాలేదు. కంకరలేచి ఉంది. అదేవిధంగా మధ్యలో కొంతదూరం వరకు డివైడర్లను నిర్మించారు. వాటికి ఇరువైపులా ఉన్న రోడ్డును ఇంతవరకు పూర్తి చేయలేదు. స్థల వివాదం నేపథ్యంలోనే పనులకు బ్రేక్ పడిందని తెలుస్తోంది. ఇంకోపక్క కంకర లేచి ఉండటంతో సందర్శకులు నడవాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పార్కు నుంచి బయలుదేరి ప్రధాన రోడ్డు వరకు రావాలంటే తల ప్రాణం తోకకు వచ్చినట్టవుతోంది. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు సైతం వెళ్లేందుకు కూడా రోడ్డు అనుకూలంగా లేదు. శని, ఆదివారాల్లో పార్కుకు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ అధికారులను వివరణ కోరగా నిర్మాణ స్థలం తమదంటూ కొందరు ప్రతిఘటించటంతో పనులు నిలిచిపోయినట్టు తెలిపారు.

# మూత్రపిండం... రవాణా గండం!

కనిగిరి: డయాలసిస్ బాధితులకు గతంలో 108 ద్వారా ఉచిత రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేది. గత ఏడాది నవంబరు నుంచి ఈ సేవలు అందకపోవడంతో వారంతా వ్యయప్రయాసలకు గురవుతున్నారు. సమస్య తీవ్రంగా ఉన్న వారి పరిస్థితి మరీ దయనీయం. ప్రత్యేకంగా ఆటోల్లో వచ్చేందుకు రూ.వందల్లో చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి తమ ఇక్కట్లు తీర్చాలని వారు కోరుతున్నారు.

**పెరుగుతన్న తీవ్రత...**

ఉమ్మడి జిల్లాలో ఒంగోలు, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, వై.పాలెం, కందుకూరులో మొత్తం తొమ్మిది డయాలసిస్ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో రోజూ 724 మందికి పైగా కిడ్నీ బాధితులు సేవలు పొందుతున్నారు. నెల్లూరు, గుంటూరు, కర్నూలు, కడప జిల్లాల నుంచి సైతం మరో 300 మంది వరకు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. రెండేళ్ల వ్యవధిలో 224 మంది బాధితులు పెరిగారంటే సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరిలో ఎక్కువ మంది వారంలో రెండు నుంచి నాలుగు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సిన వారే ఉన్నారు. అశ్రద్ధ చేసినా ప్రాణాపాయం తప్పదు.

**అదనపు భారం...**

బాధితుల్లో ఎక్కువ మంది నిరుపేదలు, గ్రామీణ ప్రాంతాల వారే ఉన్నారు. ఆయా గ్రామాల నుంచి జిల్లా, డివిజన్ కేంద్రాల్లో ఉన్న డయాలసిస్ సెంటర్లకు వచ్చి వైద్యం చేయించుకోవాలి. గతంలో 108 వాహనాల్లో వీరిని తీసుకెళ్లేవారు. ప్రస్తుతం ఆ అవకాశం లేకపోవడంతో సొంత ఖర్చులతో వెళ్లాల్సి వస్తోంది. పీసీపల్లి మండలం అన్నపురెడ్డిపల్లికి



చెందిన చల్లా రమణమ్మ గత నాలుగేళ్లుగా కనిగిరి కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలోనే రావాల్సి వస్తోంది. తోడుగా మరొకరి సాయం అవసరం కావడంతో నెలకు రూ.మూడు వేలు ఛార్జీలకే అవతున్నాయని వాపోతున్నారు. కనిగిరి మండలం చిన ఇర్లపాడుకు చెందిన ముద్దా అబ్రహందీ ఇదే పరిస్థితి. నెలకు ఎనిమిది సార్లు డయాలసిస్ చేయించుకునేందుకు రానూపోనూ ఛార్జీలకే రూ.2 వేలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కనిగిరి డయాలసిస్ కేంద్రం మేనేజర్ను సంప్రదించగా... సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

# ట్రాఫిక్ 'ఉల్లంఘనులు!

ఒంగోలు : ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణల్లో జిల్లా ప్రత్యేక ఘనత సాధించింది. వాహన చోదకులు ఏటా రెట్టింపు ఉల్లంఘనలతో తమ రికార్డులను తామే బ్రేక్ చేసుకుంటూ దూసుకుపోతున్నారు. పోలీసు నివేదికలే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి.

**కనీస నిబంధనలూ పట్టవు...**

రోడ్డుపైకి వచ్చే ప్రతి వాహనదారుడు విధిగా డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్, ఫిట్నెస్ సర్టిఫికెట్, బీమా పత్రం కలిగి ఉండాలి. నిబంధనలకు అనుగుణంగా నంబరు ప్లేటు ఉండాలి. ద్విచక్ర వాహన చోదకుడైతే శిరస్త్రాణం, కార్లు వంటి వాహనాలైతే సీటుబెల్టు విధిగా ధరించాలి. ఇంతవరకు బాగానే ఉన్నా ఎక్కువమంది చోదకులు ఈ సాధారణ నిబంధనలను సైతం ఉల్లంఘిస్తున్నారు. వీటికితోడు ట్రిపుల్ రైడింగ్, సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతి వేగం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. మైనర్ల డ్రైవింగ్ సైతం సాధారణంగా మారింది. ఈ విషయమై ఏటా పెద్ద సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి.



**కట్టనంటే కుదరదు...**

ఈ-చలానే కదా, మీరు జరిమానా వెయ్యండి.. మా దగ్గర డబ్బులున్నప్పుడో, మాకు వీలైనప్పుడెప్పుడో కడతాం అంటే కుదరదు. ట్రాఫిక్ ఉల్లంఘనల విషయంలో గతంలో మాదిరిగా పోలీసులు వ్యవహరించడం లేదు. పెండింగ్ చలాన్ల విషయంలో కఠినంగానే ఉంటున్నారు. 2024లో 35.33 శాతం మేరకు వసూలు చేస్తే... 2025లో ఏకంగా 88.83 శాతం మేర కట్టించారు. దీన్నిబట్టి చలాన్ల విషయంలో ఎంత దూకుడుగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుంది. ఈ విషయంలో రాష్ట్ర హైకోర్టు సైతం జిల్లా పోలీసుల ప్రయత్నాలను ప్రశంసించడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ కూడా జరిమానాల చెల్లింపులో పురోగతికి కారణమని పోలీసులు చెబుతున్నారు.

# దస్త్రానికింత..దండుకోవడమే అంతా!

భీమవరం : ఎవరెన్ని చెప్పినా... మారమంతే అన్నట్లుగా తయారైంది జిల్లాలోని కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని సిబ్బంది తీరు. సిబ్బంది కొరత, పర్యవేక్షించే జిల్లా రిజిస్ట్రార్(డీఆర్) లేకపోవడంతో చాలా వరకు ప్రైవేటు వ్యక్తులు, దళారీలే దందా నడిపిస్తున్నారు. వారి ఆదాయం రోజుకి కనీసం రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు ఉంటుందంటే అవినీతి ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.పరోక్షంగా సహకారం జిల్లాలో గతేడాది మే నుంచి ఏలూరు డీఆర్ ఇన్ఛార్జ్ బాధ్యతలు నిర్వహిస్తుండగా తాడేపల్లిగూడెం, ఆచంట, మొగల్తూరు, నరసాపురం, పాలకొల్లు, ఉండి, వీరవాసరం సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు ఇన్ఛార్జుల పాలనలోనే ఉన్నాయి. రిజిస్ట్రేషన్కు స్లాట్ బుక్ చేసుకున్న కక్షిదారులు సబ్ రిజిస్ట్రార్ దగ్గరకు వెళ్తే, వారి ఆస్తుల వివరాలు సరైనవా కాదా నిర్ధారించిన అనంతరం సీనియర్ అసిస్టెంట్ ఆన్లైన్లో వేలిముద్రలు సేకరిస్తారు, లేదంటే ఐరిస్ తీస్తారు. వాటికి జూనియర్ అసిస్టెంట్ దస్తావేజు నంబరు కేటాయించి, దస్త్రాలు స్కాన్చేసిన తర్వాత ఆన్లైన్లో నమోదు చేస్తారు. తగినంత సిబ్బంది లేక కొన్నిచోట్ల ప్రైవేటు వ్యక్తులే నిర్వహిస్తుండటంతో దస్త్రాలన్నీ సక్రమంగా ఉంటే రూ.5వేలు, లేకపోతే రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తున్నారు. పరోక్షంగా కొందరు అధికారులు వారికి సహకరిస్తున్నారు.

# పారిశ్రామిక శోభ



నక్కపల్లి : రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, అమలాపురం, డీఎల్పురం, చందనాడ తదితర గ్రామాల పరిధిలో పరిశ్రమల నిమిత్తం దాదాపు 4300 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. వీటిని ఆర్సెలార్ స్టీల్ప్లాంట్, బల్క్డ్రగ్ పార్కుకు ప్రభుత్వం కేటాయించింది. ఏడాది క్రితం బల్క్డ్రగ్ పార్కుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయగా, అప్పటినుంచి మౌలిక సదుపాయాల కల్పన పనులు మొదలయ్యాయి. ఇక్కడ మూడు దశల్లో పనులు చేయడానికి వీలుగా ఏపీఐఐసీ దాదాపు రూ. 511 కోట్లు కేటాయించింది. తొలిదశలో భారీ రహదారులు, కాలువలు, పరిపాలన భవనాలు, వంతెనలు, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంటు, తాగునీటి పైపుల తదితర పనులు చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులన్నీ చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే రహదారులు, కాలువల నిర్మాణాలు 95 శాతానికి పైగా పూర్తి చేశారు. డీఎల్పురం మొదలుకుని రాజయ్యపేట వరకు చేపట్టిన పనులతో ఈ ప్రాంతం గుర్తుపట్టలేని విధంగా కొత్త శోభను సంతరించుకుంది. సగటున ప్రతి రోడ్డు దాదాపు 100 అడుగుల వెడల్పుతో ఉంది. మూడు అడుగుల వెడల్పున కాలువలు నిర్మించారు. అమలాపురం, మూలపర్ర, డీఎల్పురం ప్రాంతాల్లో ఉప్పుటేరును దాటేందుకు వీలుగా చేపట్టిన నాలుగు వంతెనలు వేగంగా నిర్మిస్తున్నారు. ఒక్కో వంతెన 20 అడుగుల ఎత్తు, 50 అడుగుల వెడల్పు ఉండగా.. 75 మీటర్ల పొడవుతో రెండు, 100 మీటర్లు, 110 మీటర్లు చొప్పున ఒక్కోటి కడుతున్నారు. ఇవి సగానికిపైగా పూర్తి చేశారు. రాజయ్యపేట, బోయపాడు సమీపంలో పరిపాలన భవనాల పనులు చేస్తున్నారు. దీంతో పాటే తాగునీటి ట్యాంకుల నిర్మాణం సాగుతోంది. ఒక్కోటి సుమారు 30 లక్షల లీటర్ల సామర్థ్యంలో డీఎల్పురం, రాజయ్యపేటలో నిర్మిస్తున్నారు. మరోరెండు నిర్మాణాలు మొదలు కావల్సి ఉంది.

**జరుగుతున్న పనులిలా..**

రోడ్ల పొడవు: 16.2 కిలోమీటర్లు
పూర్తి చేసింది: 15.5 కిలోమీటర్లు
కాలువల పొడవు: 32.4 కిలోమీటర్లు
పూర్తి చేసింది: 31 కిలోమీటర్లు
తాగునీటి పైపులైను నిర్మాణం: 32.4 కిలోమీటర్లు
పూర్తి చేసింది: 23.1కిలోమీటర్లు
వాటర్ ట్రీట్మెంట్ ప్లాంటు సామర్థ్యం: 3.1 కోట్ల లీటర్లు
పని జరిగింది: 60 శాతం
వంతెనలు: 4
పని పూర్తి: 50శాతం
తాగునీటి ట్యాంకులు: 4

పనులు జరుగుతున్నవి: 2 మార్చికి తొలిదశ పూర్తి ప్రభుత్వ ఆదేశాలతో మౌలిక సదుపాయాల పనులు యుద్ధప్రాతిపాదికన చేయిస్తున్నాం. గతంలో ఆందోళన కారణంగా కొంత జాప్యం జరిగింది. ప్రస్తుతం చేస్తున్న తొలి దశ పనులు మార్చికి పూర్తి చేసే లక్ష్యంతో సాగుతున్నాం. నరసింహారావు, ఏపీఐఐసీ జెడ్.ఎం.

# తొలి ఉత్సవం.. కొత్త ఉత్సాహం



అనకాపల్లి : జిల్లా ఏర్పడిన తరవాత మొదటిసారిగా జరుగుతున్న అనకాపల్లి ఉత్సవాలకు అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 30, 31 తేదీల్లో జరగనున్న ఉత్సవం ప్రజల గుండెల్లో నిలిచిపోయే విధంగా నిర్వహించేందుకు యంత్రాంగం సంసిద్ధమైంది. వేడుకల ప్రారంభానికి కొండకర్ల ఆవ వేదిక కానుంది. సహజసిద్ధ అందాలతో ఉన్న ఈ ఆవ వద్ద చకచకా పనులు చేపడుతున్నారు. ఆవ వద్ద నీటిపై తేలియాడే రబ్బరు వంతెనను ముస్తాబు చేస్తున్నారు. పువ్వుల ప్రదర్శన, బాణసంచా వెలుగులు, ఫుడ్స్టాల్స్, బోటు షికారు, పిల్లల ఆటప్రాంగణం, ఆవ చరిత్రను వివరించే గైడ్లు, ఫొటో గ్యాలరీలు, ప్రవేశ ద్వారాన్ని నిర్మిస్తున్నారు. వీటితోపాటు కేరళ తరహా బోట్లను రప్పిస్తున్నారు. వీటిని ఆవ మధ్యలో ఉంచి పర్యాటకులకు కొత్త అనుభూతిని కల్పించనున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో సేదతీరడానికి సాయంకాల కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ సముద్రంలో క్రీడలను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన స్పీడ్బోట్లను తీసుకొస్తున్నారు. బీచ్వాలీబాల్, కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు. గృహ, ఆట వస్తువులు, రుచికరమైన ఆహార పదార్థాలను విక్రయించే స్టాల్ను తీరంలో ఏర్పాటు చేయనున్నారు. స్వీయచిత్రాలను తీసుకోవడానికి ప్రత్యేక బూత్లను ఏర్పాటు చేశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా బయో టాయిలెట్లను సిద్ధం చేస్తున్నారు.

అనకాపల్లిలో ఉత్సవాల ముగింపు సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 10 గంటలవరకు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్నివాల్తో పాటు యువతీ, యువకుల ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాన్ని విజయవంతం చేయడానికి ఒక్కో విభాగానికి ఒక్కో అధికారిని పర్యవేక్షకులుగా నియమించారు. పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, తాగునీరు, రవాణా, రోడ్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు బాధ్యతలు అప్పగించి ఎక్కడా ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**జాగ్రత్తలు తప్పనిసరి...**

కొండకర్ల ఆవకు ఒక వాహనం వెళ్తే మరో వాహనం తప్పుకోవడానికి వీలులేకుండా ఆవకు రోడ్డు ఉంది. ఉత్సవాల సందర్భంగా కొంతవరకు రోడ్డు పక్క తుప్పలు తొలగించినా వందల సంఖ్యలో వచ్చే వాహనాలకు సరిపోయే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఉన్న 10 అడుగుల సిమెంటు రోడ్డుకు రెండువైపులా మట్టితో అంచులను తూతూమంత్రంగా పూడ్చించారు. వాహనం రోడ్డు అంచు దిగితే పైకి రావడానికి వీలులేకుండా ఉంది. వాహనాల పార్కింగ్కు సువిశాల స్థలాన్ని గుర్తించాలి. ఆవలో రబ్బరు వంతెనపైకి కేసారి ఎక్కువ మంది చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

# చూపండి స్థలాలు.. మోగేను గుడిగంటలు



నర్సీపట్నం : గ్రామాల్లోని కాలనీల్లో ఆలయాల నిర్మాణానికి రంగం సిద్ధమవుతోంది. గ్రామ గ్రామాన ప్రజల్లో భక్తి భావానికి తోడు శాంతి సామరస్యాలు వృద్ధి చెందేలా తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఈ గుడులకు ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ప్రజా ప్రతినిధులు, దాతలు వీటి కోసం స్థలం కేటాయిస్తే తక్షణం సొమ్ము మంజూరు కానుంది. స్థలం ఎక్కువ ఉంటే రూ. 20 లక్షల వరకు సాయం అందుతుంది. వీటిపై అందిన మార్గదర్శకాలతో ఇప్పటికే దేవాదాయశాఖ అధికారులు ఎమ్మెల్యేల సహకారంతో అనువైన స్థలాల సేకరణకు సన్నాహాలు చేస్తున్నారు.

తితిదే ఆధ్వర్యంలో శ్రీవాణి భజన మండపం పథకం కింద గ్రామానికి ఒకటి చొప్పున ఈ గుడులు నిర్మించనున్నారు. గత నవంబరు నెలలో దీనికి సంబంధించిన ఆదేశాలు అధికారులకు అందాయి. వీటిలో ప్రత్యేక నమూనా పొందుపరిచారు. ఇందులో ఆలయానికి అందజేసే స్థలం, గ్రామం తదితర అన్ని వివరాలు పేర్కొంటూ ప్రతిపాదనలు పంపాల్సిందిగా కోరారు. ఇవి తప్పనిసరిగా ఎమ్మెల్యేల అనుమతితో మాత్రమే మంజూరు కానున్నాయి. దాతలు సైతం ముందుకు వచ్చి స్థలాల ప్లాన్లు, జీపీఎస్ ఫొటోలతో శాసనసభ్యుల లేఖను జత చేసి ఇవి పంపవచ్చు. గ్రామకంతాల్లోని స్థలాలకు ప్రాధాన్యం లభిస్తుంది.గ్రామాల్లోని ఎస్సీ, బీసీ, మత్స్యకార కాలనీల్లో ఇవి నిర్మించాల్సి ఉంది. హిందూ దేవతలైన శ్రీ వేంకటేశ్వరుడు, శ్రీరాముడు, శివుడు, ఇతర గ్రామ దేవతల గుడులను ఈ పథకం కింద నిర్మించుకోవచ్చు. స్థలం అయిదు సెంట్ల వరకు ఉంటే ఆలయం కట్టడానికి రూ. 10 లక్షలు, ఎనిమిది సెంట్ల కంటే ఎక్కువుంటే రూ.15 లక్షలు, పది సెంట్లకు మించి ఉంటే రూ. 20 లక్షల వరకు తితిదే సొమ్ము మంజూరు చేయనుంది. వైకాపా హయాంలో రూ.పది లక్షల రూపాయల చొప్పున మాత్రమే నిధులు అందజేశారు. వీటితో జిల్లాలో చేపట్టిన సుమారు 200 గుడుల పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లాలోని ఎమ్మెల్యే అందరితోనూ వీటి గురించి చర్చించి సహకారం కోరామని జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుధారాణి తెలిపారు. ముందుకు వచ్చే దాతలు తమను సంప్రదించవచ్చని చెప్పారు.

# రూ.300 కోట్లు... రికవరీ చేస్తారా?

ఒంగోలు : గత వైకాపా ప్రభుత్వం... ది ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (పీడీసీసీబీ)ను అక్రమాలకు అడ్డాగా మార్చింది. కొందరు నాయకుల ప్రోద్బలంతో అప్పటి అధికారులు కనీస నిబంధనలు పాటించకుండా రూ.కోట్లలో రుణాలు మంజూరు చేశారు. తిరిగి చెల్లించని రుణ ఖాతాలు వేలల్లో ఉన్నాయంటే వ్యవహారం ఏస్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు. కూటమి సర్కారు వచ్చాక చేపట్టిన విచారణలో ఒక్కో బాగోతమూ వెలుగు చూస్తోంది.

**పట్టణ శాఖల్లోనే అధికం...**

2019-24 మధ్య అప్పటి వైకాపా ప్రభుత్వ హయాంలో పీడీసీసీబీలో భారీ ఎత్తున చోటుచేసుకున్న అక్రమాలపై గత కలెక్టర్కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో జిల్లాస్థాయి అధికారులతో త్రీమెన్ కమిటీ వేసి విచారణ జరిపారు. తీవ్రత ఎక్కువగా ఉండడంతో శాఖాపరంగా సమగ్ర విచారణ అవసరమని రాష్ట్ర సహకార శాఖకు వారు తెలియజేయడంతో... మూడు నెలల క్రితం ఆ శాఖ అడిషనల్ డైరెక్టర్ గౌరీశంకర్ను విచారణాధికారిగా నియమించారు. విచారణలో భాగంగా బ్యాంకులో రుణాలు తీసుకుని దీర్ఘకాలంగా చెల్లించని వారి జాబితాను వెలికితీశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 20 బ్యాంకు శాఖల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ రుణాలు ఇచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించారు. రూ.లక్షల్లో మొత్తం తీసుకుని ఒక్క వాయిదా చెల్లించని ఖాతాలు సైతం వేలల్లో ఉన్నట్లు తేలింది.

**అడ్డగోలుగా మంజూరు...**



సాధారణంగా స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇవ్వాలంటే జిల్లా సహకార అధికారి నుంచి అనుమతి తీసుకోవాలి. అదేమీ లేకుండానే పెద్ద సంఖ్యలో రుణాలిచ్చారు. కస్టమ్ హయరింగ్ సెంటర్లు (వ్యవసాయ పరికరాలు), షిష్ ఆంధ్ర, కర్షక మిత్ర, జగనన్న పాలవెల్లువ, దీవెన, జాయింట్ లయబిలిటీ గ్రూపులు (జేఎల్జీ), ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలు తదితరాలకు కనిష్ఠంగా రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు అందజేశారు. వీటిలో రెండు మూడేళ్లయినా రికవరీ లేని వాటిని గుర్తించారు. మొత్తం 2,211 మందికి నోటీసులు జారీ చేశారు. ఈ రుణాలిచ్చేందుకు సహకరించిన నాటి బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది వివరాలు సైతం సేకరించారు. ప్రస్తుతం రికవరీకి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది.ఒక్క కిస్తీ కూడా చెల్లించని రుణాలు రూ.300 కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం. పట్టణ శాఖల్లోనే బినామీ రుణాలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు... ఒంగోలు టౌన్ శాఖలో అక్రమాలకు పాల్పడిన అధికారిపై చర్యలు లేకపోగా పదోన్నతి కల్పించడం గమనార్హం.

# తమ్మిలేరు.. ఆపేవారు లేరు!

ఏలూరు : ఏలూరుకు సమీపంలో కవ్వగుంట వద్ద చింతలపూడి ప్రధాన రహదారికి సమీపంలో పొక్లెయిన్ల సాయంతో మట్టిని తవ్వేసి ట్రాక్టర్లతో రవాణా సాగించడాన్ని పరిశీలిస్తే ఇది కొన్ని నెలలుగా చేస్తున్నారనేది స్పష్టమౌతోంది.ఏదో కొండగుట్టలు.. మారుమూల ప్రాంతాలు.. జన సంచారం లేని నిర్మానుష్య ప్రదేశాల్లో మట్టి తవ్వకాలు చేస్తుంటే అది యంత్రాంగానికి తెలియకపోవచ్చు అనుకోవచ్చు. కానీ ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు ఆ ప్రధాన రహదారిలో(ఏలూరు-చింతలపూడి) కొన్ని వందల మంది ప్రభుత్వ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తారు. వారే కాదు కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితర ఉన్నతాధికారులు ఏలూరు నుంచి పెదవేగి, లింగపాలెం, చింతలపూడి వంటి ప్రధాన కేంద్రాలకు వెళ్లి వచ్చేందుకు ఇదే మార్గం. కనీసం ఆ ఉన్నతాధికారులకైనా అటుగా ప్రయాణించేటప్పుడు 'తమ్మిలేరు'ను చెరబట్టి యథేచ్ఛగా పొక్లెయిన్ వంటి యంత్రాలతో మట్టిని తీసి లారీలు, ట్రాక్టర్లలో తరలిస్తుంటే కనిపించలేదా? కనిపించినా పట్టించుకోలేదా అనేది ప్రశ్నార్థకమవుతోంది.రేయింబవళ్లు తమ్మిలేరులో తాత్కాలికంగా రహదారి ఏర్పాటు చేసుకుని తవ్వకాలు సాగిస్తున్నారు. ఇక్కడి నుంచి లారీలు దుగ్గిరాల ప్రధాన రహదారిలో కలుస్తాయి. అక్కడి నుంచి శనివారపుపేట మీదుగా ఏలూరు నగరంలోకి ప్రవేశిస్తున్నాయి. ఒక్కో లారీకి రూ.5 వేల నుంచి 6 వేలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే కొన్ని వేల లారీల మట్టిని మాఫియా కొల్లగొట్టేసింది. అక్కడి గోతుల లోతును పరిశీలిస్తే కొన్ని లక్షల క్యూబిక్మీటర్ల మట్టి తరలించి రూ.కోట్లలో సొమ్ము చేసుకుని ఉండొచ్చని సమాచారం. ప్రమాదవశాత్తు వర్షాకాలం నీళ్లు చేరి ఆ గోతుల్లో దిగితే అంతే సంగతులు. ఇంత జరుగుతున్నా ఇటు ఏలూరు, అటు పెదవేగి తహసీల్దార్లు, ఆర్డీవో ఎవరి నుంచీ స్పందన లేదు. కనీసం ఆ ఊళ్లో ఉండే వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులకు ఈ తవ్వకాలు పట్టకపోవటం ఆశ్చర్యమేస్తోంది.అనుమతులు లేవు : ఈ తవ్వకాల గురించి జిల్లా గనులశాఖ అధికారి పాపారావు దృష్టికి తీసుకెళ్లి ఏమైనా అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నిస్తే ..'అది తమ్మిలేరు కదా? దానిలో తవ్వకాలే నిషేధం. అసలు ఎలా అనుమతులిస్తాం. తవ్వకాలే జరపకూడదు. బుధవారం మా శాఖ విజిలెన్స్ అధికారులను పంపి విచారణ చేయిస్తాం' అని వివరించారు.

# శ్రీవారి పుష్కరిణిలో తేలిన చేపలు

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శ్రీవారి పుష్కరిణి(మాధవకుంట)లో చేపలు మృతి చెందాయి. అవి నీటిపై తేలుతూ దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ సిబ్బంది వాటిని తొలగించారు. పంచాయతీ చెరువును దేవస్థానం తీసుకుని పుష్కరిణిగా అభివృద్ధి చేసి అందులో వాటర్ పౌంటేన్ కూడా ఏర్పాటు చేసింది. అయితే ఇటీవల కాలంలో దేవస్థానం అధికారులు దాని నిర్వహణ గాలికొదిలేశారు. గతంలో కొందరు చేప పిల్లలను తీసుకొచ్చి వేశారని, ఈ నేపథ్యంలోనే అందులో చేపలు పెరిగాయని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే మంగళవారం అందులోని చేపలన్నీ మృతి చెందాయి. ఎవరో విషప్రయోగం చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇందులో ఎవరో చేపలు పెంచుతున్నారని, ఎవరైనా విష ప్రయోగం చేసి ఉంటారని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. దేవస్థానం డీఈ సూర్యనారాయణ మాట్లాడుతూ చేపలు వర్షాలకు కొట్టికొచ్చి అందులో పెరిగాయన్నారు. పుష్కరిణి పక్కన పంచాయతీ బోరు వేసినప్పుడు గ్యాస్ వాటర్ అందులోకి వదలడం వల్ల చేపలు చనిపోయాయని తెలిపారు.

# గోదావరిలో తోడేళ్లు..!

రాజమహేంద్రవరం : గోదావరిలో ఇసుక తవ్వకాలు ఆగడం లేదు. నదీ తీరాన్ని ఆనుకొని ఓపెన్ రీచ్లు మినహా మిగిలిన అన్ని ర్యాంపుల్లో ఇదే వ్యవహారం నడుస్తోంది. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇటీవల కలెక్టర్ బదిలీ కావడం..కొత్తగా వచ్చిన కలెక్టర్ శిక్షణ కోసం వెళ్లడంతో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ప్రతి ర్యాంపులో రాత్రీ పగలు తేడా లేకుండా నదిలోని ఇసుకను తోడేస్తున్నారు. గత కలెక్టర్ ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపారు. ఇసుక లారీలను తనిఖీలు చేయించి, కేసులు నమోదు చేయించారు. ఒక సందర్భంలో తెల్లవారు జామున గోదావరి మధ్యలో అనధికారికంగా తవ్వకాలు చేస్తున్న బోట్లను పట్టుకున్న ఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో అనధికారికంగా ఎక్కడ పడితే అక్కడ ఇసుక నిల్వ చేస్తున్నారు.

**ఉపాధికి గండి...'**

జిల్లాలో గోదావరి పరివాహక ప్రాంతాలైన ధవళేశ్వరంలో 8, కోటిలింగాల రేవు 4, కాతేరు 5, కొవ్వూరు 3, పక్కిలంక 2, తాళ్లపూడి 4 చొప్పున ర్యాంపులున్నాయి. ఒక్కొక్క నావపై 10 నుంచి 15 మంది కూలీలు ప్రతీ రోజు పనులు చేస్తారు. గోదావరి తీరాన్ని ఇసుక తవ్వకాలను నమ్ముకొని వెయ్యి కుటుంబాల వరకు జీవనోపాధి పొందుతున్నాయి. అక్రమ తవ్వకాలతో వీరు ఉపాధి కోల్పోతున్నారు.



**బిల్లులు లేకుండానే..**

కనీసం లారీలకు బిల్లులు లేకుండా ఇసుక రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. సీతానగరం, రఘుదేవపురం, వేమగిరి వంటి ఓపెన్ ర్యాంపులతో పాటు మిగిలిన చోట్ల కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రతి బిల్లు నుంచి ప్రభుత్వానికి రూ.350 చెల్లించాలి. ఈ నిధులతో ఆయా పంచాయతీల పరిధిలో మౌలిక వసతుల కల్పించాలి. జిల్లాలో రోజూ రూ.10 లక్షలకు పైగా బిల్లులు స్వాహా అవుతున్నాయి. ర్యాంపుల్లో రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్, పోలీసులు నిరంతర పర్యవేక్షణ ఉండాలి. గతంలో వీఆర్వో, పోలీసులు, సచివాలయం బృందాలుగా ఉండి నిత్యం పర్యవేక్షణ చేసేవారు. సీసీ కెమెరాలు, వే-బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీటన్నింటికి స్వస్తి పలకడంతో యథేచ్ఛగా రవాణా సాగుతోంది.

**నది సమతుల్యతకు దెబ్బ**ఈ బోటు గోదావరి మధ్యలో ఒకే సారి 15 అడుగుల పైగా గొయ్యి పెడుతుంది. దీని వల్ల సుడి గుండాలు ఏర్పడి నదీ సమతుల్యత దెబ్బతింటుంది.

# చీకటి మాటున దందా

మామిడికుదురు : లంక గ్రామాలను ఒకవైపు నదీకోత కబళిస్తుంటే మరోపక్క అక్రమంగా తవ్వి తరలిస్తున్న మట్టితో మరింత ఆందోళన రేగుతోంది. వైనతేయ నదీ తీరాన్ని ఆనుకుని ఉన్న లంకల్లో ఈ దందా గోప్యంగా సాగిపోతోంది. బయటకు పొక్కితే చాలు కొద్ది రోజులు ఆగినట్టే ఆగి తరలింపులకు మళ్లీ సిద్ధమవుతున్నారు. దీనివల్ల లంక భూములకు పెను ప్రమాదం పొంచి ఉందని అక్కడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**గోప్యంగా తరలింపు**

వైనతేయ నదీ తీరంలోని పెదపట్నంలంక శివారులోని భూముల్లో ఇటీవల రాత్రి సమయాల్లో పొక్లెయిన్లతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా నాలుగైదు రోజుల పాటు మట్టిని యథేచ్ఛగా తరలించేశారు. ట్రాక్టర్ మట్టికి రూ.2100 వరకు వసూలు చేసి స్థానికంగా ఉన్న ఇటుక బట్టీలకు సరఫరా చేశారు. స్థానికుల నుంచి అసంతృప్తి వ్యక్తం కావడంతో



తాత్కాలికంగా నిలిపివేశారు. లంక గ్రామాల్లో దాదాపు 40 వరకు బట్టీలున్నాయి. వాటికి మొన్నటివరకు పి.గన్నవరం మండలంలోని లంకగ్రామాల నుంచి మట్టి అక్రమంగా సరఫరా అయ్యేది. రాత్రి సమయాల్లో స్థానికంగా తరలింపులు జరిగేవి. పెదపట్నంలోని మధ్య భూములను ఆనుకుని ఉన్న పి.గన్నవరం మండలం మానేపల్లిలంకకు చెందిన భూముల్లో మట్టిని తవ్వి తరలించడం వల్ల దాని ప్రభావంతో తమ భూములు కోతబారిన పడి నదీగర్భంలో కలిసిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందారు.

**ఇటుకబట్టీల వద్ద గుట్టలుగా..**

లంక గ్రామాల్లో ఉన్న ఇటుక బట్టీల వద్ద ఎప్పటికప్పుడు మట్టిగుట్టలు కనిపిస్తున్నాయి. రాత్రికి రాత్రే మళ్లీ పుట్టుకొస్తున్నాయి. లంక గ్రామాల్లోంచి మట్టిని తీయడం గానీ, బయట నుంచి లోపలికి తీసుకురావడం గానీ చేయకూడదన్న నిబంధనలకు తిలోదకాలు ఇచ్చేశారు. వీటిపై పూర్తిస్థాయి నిఘా పెట్టామని మామిడికుదురు తహసీల్దార్ పి.సునీల్కుమార్ తెలిపారు.

## జంతు కొవ్వు కరిగించి.. క్రూడ్ఆయిల్ మరిగించి

ప్రత్తిపాడు : ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో కల్తీ వంట నూనె తయారీ కేంద్రంపై ప్రత్తిపాడు పోలీసులు దాడి చేసి, కీలక సూత్రధారిని అరెస్టు చేశారు. కేసు వివరాలను పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు వెల్లడించారు. ధర్మవరం హైవే సమీపంలోని ప్రతాప్సింగ్కు చెందిన రేకుల షెడ్డులో పిఠాపురం మండలం ఎఫ్కే పాలేనికి చెందిన బండారు ఫణిప్రసాద్.. మరో 8 మంది సాయంతో గత నాలుగు నెలలుగా జంతు కొవ్వును కరిగించి, క్రూడ్ ఆయిల్తో మరిగించి ఈ నూనె తయారు చేస్తున్నాడు. పిఠాపురం, చెందుర్తికి చెందిన ఏడిద విజయ్కుమార్, ఆరుగుల సురేష్కుమార్ల నుంచి జంతుకొవ్వును, కాకినాడ లైట్ హౌస్ ప్రాంతానికి చెందిన చిట్టిబాబు నుంచి క్రూడ్ఆయిల్ను కొనుగోలు చేస్తున్నాడు.

**ఇక్కడి నుంచి ఇచ్ఛాపురానికి..**కల్తీ వంటనూనెను ఎఫ్కే పాలెంలోనే నిందితుడు తయారు చేసి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం శ్రీవెంకటేశ్వర ట్రేడర్స్ యజమాని సంతోషి శ్రీనివాస్, రాజమహేంద్రవరంలోని ఎండీ ఇర్ఫాన్లతో ఒప్పందం కుదుర్చుకుని సరఫరా చేసేవాడు. ఆ గ్రామంలో పరిస్థితులు సానుకూలంగా లేకపోవడంతో ధర్మవరం వచ్చాడు. తాటిపర్తి గ్రామానికి చెందిన నామా నాగూరు, నామా నానిబాబులను నియమించుకుని కల్తీ నూనె తయారు చేయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం బృందం దాడి చేసి నిందితుడిని అరెస్టు చేశారు. 56 డబ్బాల్లో నిల్వ ఉంచిన 840 కిలోల నూనె, 60 కిలోల క్రూడ్ ఆయిల్, గ్యాస్ సిలిండర్లు, ఇతర తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఫణిప్రసాద్ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని, మిగతా నిందితులను పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

# నిర్లక్ష్యం ఖరీదు.. రూ. 5 కోట్లు!



ధర్మవరం : విద్యుత్తు వృథాను నివారించి వ్యవసాయానికి నాణ్యమైన సరఫరాను అందించాలన్న లక్ష్యంతో 2018లో తెదేపా ప్రభుత్వం.. కేంద్రం సహకారంతో ఈఈఎస్ఎల్ పరిధిలో కొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా అర్హులైన రైతులను గుర్తించి ఉచితంగా విద్యుత్తు మోటర్లు, స్టాటర్ పెట్టెలు, ఇతర సామగ్రి పంపిణీ చేయాలని నిర్ణయించింది. 5 హెచ్పీ సామర్థ్యంతో ప్రముఖ కంపెనీకి చెందిన మోటర్లు, స్టాటర్లను జిల్లాలో ఎంపిక చేసిన మండలాలకు అందజేసింది. ధర్మవరం నియోజకవర్గంలోని తాడిమర్రి మండలానికి 200 పైగానే మోటర్లు సరాఫరా చేసారు. రైతులకు పంపిణీ చేసే సమయంలో ఎన్నికలు రావడంతో కార్యక్రమం వాయిదా పడింది. దీంతో అవి తాడిమర్రి విద్యుత్తు కార్యాలయంలోనే నిరుపయోగంగా మారాయి. ఒక్కో మోటరు, సామగ్రితో కలిసి రూ.25,000 ఉండటంతో వాటి విలువ మొత్తం రూ.5 కోట్లకు పైగానే ఉంటుందని సంబంధిత శాఖాధికారులు అంచనా వేస్తున్నారు.

**పక్కదారి పట్టి..**

కొన్ని మోటార్లు, సామగ్రిని పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇటీవల అధికారులు గుర్తించారు. విద్యుత్తు శాఖలోని సిబ్బందే జిల్లాలోని తమ కార్యాలయాల్లో నీటి వినియోగానికి వాడుకున్నట్లు సమాచారం. ఇక ఏమాత్రం ఆలస్యం చేసినా ఉన్నవి సైతం దక్కే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వాటిని పంపిణీ చేయించాలని అన్నదాతలు కోరుతున్నారు.

**పట్టించుకోని వైకాపా ప్రభుత్వం**

గత ఐదేళ్ల వైకాపా పాలనలో పలుమార్లు రైతులు ఉచిత మోటర్లను పంపిణీ చేయాలంటూ ప్రజాప్రతినిధులు, అధికారులను విన్నవించుకున్నారు. ఏమాత్రం స్పందన లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశ చెందారు. మోటర్లను పంపిణీ చేసే పనులను దక్కించుకున్న గుత్తేదారులను అధికారులు సంప్రదించకపోవడంతో కార్యాలయంలోనే మూలుగుతున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

శివరాం, డీఈ విద్యుత్తు శాఖ

మోటార్ల పంపిణీ విషయంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. వచ్చిన తరువాత ప్రణాళిక మేరకు తగిన చర్యలు తీసుకుంటాం.

# చదువుకున్నోళ్లే చిక్కుతున్నారు



చిత్తూరు : చిత్తూరు నగరానికి చెందిన ఓ వైద్యుడికి టెలికాం సంస్థ నుంచి మాట్లాడుతున్నామని ఫోన్ చేశారు. మీ ఆధార్కార్డుతో లెక్కలేనన్ని ఫోన్నంబర్లు యాక్టివ్లో ఉన్నాయని, వాటిని తొలగించడానికి వివరాలు కావాలనడంతో పూర్తి వివరాలను ఇచ్చేశారు. వాటి ఆధారంగా సైబర్ నేరగాళ్లు నకిలీ వారెంట్లు సృష్టించి.. అదే వైద్యునికి వీడియో కాల్ చేసి చూపించారు. తాము ఈడీ, సీబీఐ నుంచి మాట్లాడుతున్నామని, మాదకద్రవ్యాల కేసులో ఉన్నారని బెదిరించారు. వాటి నుంచి ఎలాంటి సమస్య లేకుండా బయటపడాలంటే కొంత నగదు చెల్లించాలని నమ్మించారు. ఇలా సుమారు రూ.90 లక్షలు చెల్లించారు. ఆఖరకు మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. పూతలపట్టు మండలానికి చెందిన ఓ యువతి ఎంబీఏ చదివి.. ఆరు నెలలు స్టాక్మార్కెట్ కోర్సు చేశారు. ఇటీవల ఓ ప్రైవేటు బ్యాంకు ప్రచారంలో స్టాక్స్ కొనుగోలు చేసి లాభాలు పొందొచ్చని వచ్చింది. వాటికి ఆకర్షితురాలైన యువతి మొదట్లో రూ.2 వేలు పెట్టుబడి పెట్టగా.. రెట్టింపు ఆదాయం వచ్చినట్లు సదరు సైట్లో కనిపించింది. విడతల వారీగా రూ.32 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. చివరకు లాభాలు విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా.. కుదరకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.

ఇలా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుతున్న వారిలో 90 శాతం విద్యావంతులు, ఉద్యోగస్తులే ఉంటున్నారు. డబ్బులు ఊరికే రావని తెలిసినా.. అత్యాశకు పోయి మోసపోతున్నారు. షేర్ మార్కెట్లలో పెట్టుబడులంటూ.. డిజిటల్ అరెస్టులని.. నకిలీ లింకులు పంపించి సైబర్ నేరస్థులు అడ్డంగా దోచుకుంటున్నారు. అలా రాబట్టిన సొమ్మును ఆన్లైన్ గేమింగ్ ఖాతాలకు వెంటనే బదిలీ చేస్తున్నారు.

**వారిపైనే దృష్టి** బ్యాంకు ఖాతాల్లో డబ్బులు.. ఫిక్సిడ్ డిపాజిట్లు ఉన్న వారిపైనే సైబర్ నేరగాళ్లు దృష్టిసారిస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులను డిజిటల్ అరెస్టుల పేరుతో భయపెట్టి బ్యాంకులో ఉన్న నగదు కాజేస్తున్నారు. పిల్లలు విదేశాల్లో ఉంటే ఒంటరిగా ఉన్న వృద్ధుల బ్యాంకు ఖాతాలపై నిఘా పెడుతున్నారు. షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని బుట్టలో వేసుకుంటున్నారు.

**వెంటనే అప్రమత్తమైతే..**

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులను లేదా 1903 నంబరు ఆశ్రయించాలి. రెండు గంటలోపు పోలీసులను సంప్రదిస్తే కాజేసిన మొత్తాన్ని తిరిగి పొందవచ్చు. కనీసం 24 గంటల్లో స్పందించినా ప్రయత్నించవచ్చు. వారు మీ ఖాతా నుంచి ఏ ఖాతాకు డబ్బు జమైందో గుర్తించి.. అందులోని నగదును ఫ్రీజ్ చేస్తారు. ఆలస్యం చేస్తే.. బదిలీ చేయించుకున్న మొత్తాన్ని ఇతరుల ఖాతాలకు మళ్లించే అవకాశం ఉంటుంది.

ఈ నంబర్లకు ఫిర్యాదు చేయండి

టోల్ ఫ్రీ: 1930

అత్యవసర: 112

వాట్సప్: 80999 99977

పాటించాల్సిన జాగ్రత్తలు


టెక్నాలజీని వినియోగించే వారు జాగ్రత్తలు పాటించాలి

రిజిస్టర్ కాని సంస్థలో పెట్టుబడులు పెట్టకూడదు.

డిజిటల్ అరెస్టులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండవు

చరవాణులు, టెలిగ్రామ్లో వచ్చే లింకులు, ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయవద్దు.

# భూగర్భజలం.. పుష్కలం!



పరిగి : భూగర్భ జలాల అతర్గత ప్రవాహాలు ఎవరికీ అంతుబట్టవు. ఒక్కోచోట 1000 అడుగులు వేసినా నీటి చుక్క పడదు. మరోచోట అరడుగులలో 30 బోర్లు వేసినా నీరు తరగవు. నీటి లభ్యత ఉంటే రైతులు ఆనందానికి అవధి ఉండదు. కలసి వచ్చిన అదృష్టాన్ని ఐక్యంగా నిలిచి తరాల నుంచి ఫలాలను పొందుతున్నారు పరిగి మండలం లోని పెన్నా పరీవాహక ప్రాంతాల రైతులు.

లభ్యత ఇలా: పైడేటి గ్రామ సమీపాన పెన్నానదిలో 6 అడుగుల వ్యవధిలో ఒక చోట పది, మరోచోట 30 దాకా ఫిల్టర్ బోర్లకు అందించేంతగా నీటి లభ్యత ఉంది.

ఏఏ గ్రామాల రైతులు వినియోగం: పైడేటి, తిరుమల దేవరపల్లి, గణపతిపల్లి, రొద్దం మండలం మరవపల్లి, కలిపి, పెద్దమంతూరు.

సాగు చేసే పంటలు : వరి, మల్బరీ, మొక్కజొన్న, జొన్న, రాగి, పూల తోటలు, నేపియర్ గడ్డి

**80 నుంచి 90 అడుగుల్లో..**

ఒక కిలో మీటరు నుంచి రెండు కిలోమీటర్ల మేర పీవీసీ పైపులు ఏర్పాటు చేసుకుని పంట పొలాలకు సాగు నీటిని తరలిస్తున్నారు. 2022.24 సంవత్సరాల్లో పెన్నా, జయమంగళి నదులు వరద నీరు ప్రవహించడంతో ఆయా నదుల్లో భూగర్భజలాలు అభివృద్ధి చెందాయి. 80 నుంచి 90 అడుగుల్లోనే పుష్కలంగా నీరు లభ్యమవుతోంది. గ్రామాల్లోని రైతులు ఎవరూ పట్టింపులకు పోకుండా నదిలో ఫిల్టర్ బోర్లను ఏర్పాటు చేసుకుని ఎవరికి వారు వివిధ రకాల పంటలను సాగు చేసుకుంటున్నారు.

# పాఠం చెబుతారు.. పని నేర్పిస్తారు..!

పిఠాపురం : చదువుతోపాటు వృత్తి విద్యా కోర్సుల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సామాజిక, ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా వృత్తి విద్యాకోర్సులను జిల్లాలోని 34 పీఎంశ్రీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న అంశాల్లో తర్ఫీదు అందిస్తుండడంతో చక్కగా నేర్చుకుంటున్నారు. జిల్లాలో మూడు విడతలుగా ఎంపిక చేసిన 29 ఉన్నత, అయిదు రెసిడెన్షియల్ పాఠశాలల్లో వృత్తి విద్య నేర్పేందుకు అవసరమైన ఉపకరణాలతో ప్రత్యేక ల్యాబ్లు నెలకొల్పారు. ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమొబైల్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కంప్యూటర్, బ్యూటీ అండ్ వెల్నెస్, సైన్స్ ల్యాబ్లు అందుబాటులో ఉంచారు. గణితం, జీవశాస్త్రం, భౌతికశాస్త్రాలకు సంబంధించి స్టెమ్ ల్యాబ్ను ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతోంది. ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్, రూ.2.24 లక్షలతో 427 ఉపకరణాలు, క్రీములతో బ్యూటీ అండ్ వెల్నెస్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. మరోపక్క పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లు కుట్టు, చిత్రలేఖనం నేర్పుతున్నారు.

**పాఠశాలలకు నిధుల వెల్లువ**

పీఎంశ్రీ పాఠశాలలుగా ఎంపికైన ఉన్నత పాఠశాలలు, రెసిడెన్షియల్



స్కూళ్లలో వృత్తివిద్యా కోర్సులు నిర్వహించేందుకు ల్యాబ్ల ఏర్పాటుతోపాటు అవసరమైన ఇతర వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు ఆట స్థలాల అభివృద్ధికి రూ.5 లక్షల చొప్పున నిధులు కేటాయించగా, లాంగ్జంప్, వాలీబాల్, 200 మీటర్ల పరుగుకు ట్రాక్ను ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో 8 శాతం మంది విజ్ఞాన, విహారయాత్రలకు వెళ్లేందుకు నిధులు సమకూర్చారు. పాఠశాల వార్షికోత్సవాలు నిర్వహించేందుకు ఒక్కో పాఠశాలకు రూ.50 వేల చొప్పున నిధులు మంజూరయ్యాయి.

ఉత్సాహంగా పాల్గొంటున్నారు..

పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల్లో కంప్యూటర్, బ్యూటీ అండ్ వెల్నెస్, సైన్స్, ఇతర ల్యాబ్లు ఏర్పాటయ్యాయి. విద్యార్థులుఉత్సాహంగా నేర్చుకుంటున్నారు.

సూర్యప్రకాశరెడ్డి, హెచ్ఎం, జడ్పీ బాలికోన్నత పాఠశాల, గొల్లప్రోలు

## 'హలో లోకేశ్' పేరిట ముఖాముఖి

కాకినాడ : కాకినాడ జేఎన్టీయూలో ఈ నెల 30న విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రూసా నిధులతో నిర్మించిన పీజీ విద్యార్థుల వసతి గృహాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించి వారితో ఆలోచనలు పంచుకోనున్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 'హలో లోకేశ్' పేరిట విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. వీసీ ఛాంబర్ ఎదురుగా ఖాళీ స్థలంలో జర్మన్ హంగర్ టెంట్లో భారీ వేదికను సిద్ధం చేస్తున్నారు. క్యాంపస్ ఆవరణలో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. అసంపూర్తిగా నిలిచిన కల్వర్టు, కాలువల పనులు పట్టాలెక్కిస్తున్నారు.

**తీరనున్న వసతి సమస్య..**

కాకినాడ జేఎన్టీయూలో ఏటా వేల మంది విద్యార్థులు బీటెక్, ఎంటెక్లోని వివిధ కోర్సుల్లో చేరుతున్నారు. వీరికి సరిపడా వసతి సౌకర్యం లేక బయటే గదులు అద్దెకు తీసుకుని రాకపోకలు సాగిస్తూ అవస్థలు పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం రూసా పథకంలో సుమారు రూ.10 కోట్లతో పీజీ విద్యార్థులకు వసతిగృహం మంజూరు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో సమకూర్చాలి. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం సొమ్ము ఇవ్వకనిర్మాణంలో జాప్యం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వసతిగృహాన్ని పూర్తిచేశారు.

**కోరమాండల్ ఆసుపత్రికి..**

కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ తమ ట్రస్ట్ ద్వారా చాలాకాలంగా ఆసుపత్రి నిర్వహిస్తోంది. పేదలకు నామమాత్రపు రుసుముతో వైద్యసేవలు అందిస్తోంది. ఈ ఆసుపత్రిని ఆధునికీకరించి మరిన్ని వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ నూతన భవనాన్ని మంత్రి లోకేశ్ ప్రారంభించనున్నారు.

**కార్యకర్తలతో సమావేశమై..**

కాకినాడ గ్రామీణ నియోజకవర్గ తెదేపా కార్యకర్తలతో లోకేశ్ సమావేశం కానున్నారు. పార్టీ బలోపేతం, కూటమిలో సమర్థంగా పనిచేయడంపై దిశానిర్దేశం చేస్తారు. ఉత్తమ కార్యకర్తలను సత్కరిస్తారు. ఎంపీ సానా సతీష్బాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఏర్పాట్లు పరిశీలించారు.

## ఆలయాల భూములు.. ఆన్లైన్లో మాయం

కాకినాడ: దేవుని భూములంటే అందరికీ అలుసే. కబ్జాలు చేయడం, రికార్డులు తారుమారు చేయడం.. దస్త్రాలు మార్చుకోవడం ఆక్రమణదారులకు సాధారణమైంది. జిల్లాలో ఏకంగా 744 ఎకరాలకు పైగా ఆలయాల భూములు ఆన్లైన్లో కనిపించడంలేదు. వెబ్ల్యాండ్లోనూ యాజమాన్య హక్కులు మార్చేసుకున్నారు. రీసర్వేలోనూ తక్కువగానే చూపిస్తున్నారు. భూములు ఎక్కడున్నాయో గుర్తించి వెబ్ల్యాండ్లో నమోదు చేయాలని దేవాదాయశాఖ అధికారులు రెవెన్యూ ఉన్నతాధికారులను కోరుతున్నారు..జిల్లాలో చిన్న, పెద్ద దేవాలయాలకు దాతలు ఇచ్చిన భూములు 9,694 ఎకరాలున్నాయి. పూర్వపు రెవెన్యూ దస్త్రాలు ఐఎఫ్ఆర్ (ఇనాం ఫెయిర్ రికార్డు), ఇనాం-బి రిజిస్టర్లలో ఇవన్నీ నమోదై ఉన్నాయి. వెబ్ల్యాండ్లో 8,950 ఎకరాలే ఆన్లైన్లో కనిపిస్తున్నాయి. 744 ఎకరాలకు పైగా నమోదు కాలేదు. మరో 260 ఎకరాలు పరాధీనమే. ఎవరి కబ్జాలో ఉన్నాయో సమాచారం లేదు. రీసర్వేలో విస్తీర్ణం తగ్గించి చూపారని, సవరించి వెబ్ల్యాండ్లో నమోదు చేయాలని ఇటీవల రెవెన్యూ క్లినిక్లో ఫిర్యాదు చేశారు.

ఎవరి ఆక్రమణలో ఉన్నట్లు..

కాకినాడ పట్టణంలో దేవాదాయ భూములు 28.33 ఎకరాలుంటే 11.93 ఎకరాలే వన్బీ వెబ్ల్యాండ్లో కనిపిస్తున్నాయి. మిగతా 16.40 ఎకరాలు అన్యాక్రాంతమే.

రౌతులపూడి మండలంలో 265.43 ఎకరాలకు 241.51 ఎకరాలు నమోదు చేశారు. ఇంకా 8.34 ఎకరాలు చేయాల్సి ఉంది. మొత్తం ఆన్లైన్ చేసినా ఇంకా 15 ఎకరాలు గల్లంతైనట్లే.

కాకినాడ గ్రామీణంలో దేవాలయాలకు 375.70 ఎకరాలున్నాయి. వాటిలో 270.68 ఎకరాలు వన్బీలో కనిపిస్తున్నాయి. మరో 25.63 ఎకరాలు నమోదు చేయాల్సి ఉంది. అలా కలిపినా 295 ఎకరాలే అవుతాయి. మిగతా 80 ఎకరాల మాటేమిటి?

పెదపూడి, ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల్లో రికార్డుల్లో ఉన్న భూములకు ఆన్లైన్లో నమోదు చేసినవాటికి 20 నుంచి 40 ఎకరాల వ్యత్యాసం కనిపిస్తోంది.

## అక్కడ అందరూ.. 'తాపీ'గుంటారు..!

పుత్తూరు :అద్భుతమైన ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టాలంటే నేటి కాలంలో అందరూ ఇంజినీర్లను సంప్రదించి నిర్మాణాలు చేస్తున్నారు. కానీ పుత్తూరు, పలమనేరుకు చెందిన తాపీమేస్త్రీలు ఇంజినీర్లకు తీసిపోని విధంగా నిర్మాణాలు చేపడుతూ ఔరా అనిపిస్తున్నారు.

**గోవిందపాళెం మేస్త్రీలకు డిమాండు ఎక్కువే..**

పుత్తూరు మున్సిపాలిటీలోని గోవిందపాళెంలోని తాపీమేస్త్రీలకు భలే డిమాండ్. ఎన్నో ఏళ్లుగా ఇదే వృత్తిని ఎంచుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో సుమారు వంద కుటుంబాలు ఉన్నాయి. అందరూ తాపీమేస్త్రీలే. పుత్తూరులో వందల భవనాలు వీరి చేతుల మీదుగా నిర్మించినవే. నగరిలో ఎన్ఎంసీ థియేటర్, తిరుపతి సంధ్య థియేటర్, కేఎస్ఆర్ కల్యాణ మండపం ఇలా చెప్పుకొంటూ పోతే పెద్ద జాబితాయే



ఉంది. వంశపారంపర్యంగా ఇదే వృత్తిలో కొనసాగుతుండటంతో అందులోని మెలకువలు నేర్చుకుని ఆ రంగంలో రాణిస్తుండటం విశేషం.

**ఇంటికొకరు..**సాధారణంగా గ్రామాల్లో అందరూ ఒకే మాటకు కట్టుబడి ఉండటం చూశాం. కానీ ఆ గ్రామంలో మాత్రం అందరూ ఒకే పనిని ఎంచుకోవడం విశేషం. పలమనేరు మండలంలోని గొబ్బిళ్లకోటూరులో సుమారు 500 గృహాలు ఉన్నాయి. ఇక్కడ ఇంటికొకరు తాపీ పనివారు ఉంటారు. అయితే ఎందుకు అందరూ ఒకే రకం పని నేర్చుకున్నారంటే వారి దగ్గర సమాధానం లేదు. సమీప బెంగళూరులో నిర్మాణ పనుల కూలీలకు డిమాండు ఉండటంతో ఉపాధి నిమిత్తం వీరంతా ఎక్కువగా అక్కడికే వెళ్తుంటారు. గంగవరం మండలం బండమీదజరావారిపల్లెలో కూడా 90 శాతం మంది ఈ పని చేస్తున్నారు. పలమనేరు

## కట్టాలంటే కాసులమోత.. వికటిస్తే కూల్చివేత

తిరుపతి : తిరుపతిలోని తిరుమల బైపాస్ సమీపంలో ఓ భారీ బహుళ అంతస్తుల భవన నిర్మాణం గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. అప్పట్లో అధికార పార్టీ నాయకుల అండదండలతో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు రూ.5 లక్షల లంచం తీసుకొని నిర్మాణానికి అనుమతించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోసారి అధికారులు వాలిపోయారు. మరో రూ.4 లక్షలు తీసుకొని పనుల కొనసాగింపునకు ఆమోదించారు. రెండోసారి లంచం తీసుకున్న అధికారి బదిలీ కావడం.. అతని స్థానంలో వచ్చిన మరో అధికారి రూ.4 లక్షలు తీసుకొని పనులను చూసీచూడనట్లు వదిలేశారు. సుమారు రూ.13 లక్షల లంచం ఇచ్చుకున్నా.. ఆ భవన నిర్మాణంపై తీవ్ర విమర్శలు రావడంతో నగరపాలక కమిషనర్ కూల్చివేతకు ఆదేశించారు. మామూళ్లు తీసుకున్న అధికారులే దగ్గరుండి ఆపని చేపట్టడం గమనార్హం.

తిరుపతిలో ఎవరైనా భవన నిర్మాణం చేపట్టారంటే కొంతమంది అధికారులు కాకుల్లా వాలిపోతున్నారు. ఏవేవో నిబంధనలు చెప్పి బెదిరిస్తారు. అడిగినంత ఇచ్చుకుంటే అటువైపు కన్నెత్తి చూడరు. బయటి వ్యక్తులు నిర్మాణంపై ఫిర్యాదు చేస్తే.. భవనం కూల్చినట్లు ఉన్నతాధికారులను ఫొటోలతో ఏమార్చుతారు. తప్పనిసరిగా కూల్చాల్సి వస్తే.. లంచం ఇచ్చిన వ్యక్తికి మొండిచేయి చూపించి కూలగొడతారు. ఈ తతంగం తిరుపతి నగరంలో సాధారణమై పోయింది.

**కక్కలేక.. మింగలేక..**

తిరుపతి నగరంలో అక్రమ భవనాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొంతమంది అధికారులు దొడ్డిదారిన అనుమతులిస్తూ అడ్డగోలుగా జేబులు నింపుకొంటున్నారు. ఇన్నాళ్లు దర్జాగా సాగిన వీరి అవినీతి దందాకు ప్రభుత్వం కళ్లెం వేసింది. కూటమి ప్రభుత్వం అక్రమ, అనధికారక భవనాలు, అంతస్తులను కూల్చివేయాలని ఆదేశించడంతో.. కొందరి పరిస్థితి కక్కలేక.. మింగలేక అన్నట్లుగా మారింది. దీంతో కొత్త నాటకాలు ప్రారంభించారు. ఇన్నాళ్లు అక్రమ నిర్మాణాలను



ప్రోత్సహించిన అధికారులే కూల్చివేతలకు ఎగబడుతుండటంతో అక్రమ భవన నిర్మాణదారుల్లో ఆందోళన మొదలైంది. అప్పుడే అన్ని అనుమతులు తీసుకొని.. ప్రభుత్వానికి రుసుములు చెల్లించినా సరిపోయేదని ఇప్పుడు మదనపడుతున్నారు.

**అనుమతులు సాధ్యం కాదని..**

తిరుపతిలో నిషేధిత జాబితా భూములు, తితిదే భూములు, కాలువ పోరంబోకు స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం వీటిల్లో నిర్మాణాలకు అనుమతులు పొందడం సాధ్యం కాదు. ఇదే ఆ విభాగం అధికారులకు కలిసిస్తోంది. ఎల్ఆర్ఎస్, బీపీఎస్ సౌకర్యాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలోనూ విఫలమవుతున్నారు.

**అవగాహన లేకే..**

రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భవన నిర్మాణాలు, లేఅవుట్ల ఏర్పాటు కోసం సింగిల్ విండో విధానాన్ని తీసుకువచ్చింది. అనుమతులు సులభతరం చేసింది. ఆన్‌లైన్ విధానంలో పలు రకాల మినహాయింపులతో గంటల వ్యవధిలోనే అనుమతులు పొందే ఏర్పాట్లు చేసింది. ఐదు అంతస్తుల భవనాలకు ప్రభుత్వ గుర్తింపు కలిగిన లైసెన్సుడ్ ఇంజినీర్ల ద్వారా దరఖాస్తు చేసి రుసుములు చెల్లిస్తే అనుమతులు సులువుగా వచ్చేస్తాయి. వీటిపై చాలామందికి అవగాహన లేకపోవడంతో అధికారులతో లాలూచీ పడుతున్నారు.

## శునకాలకు ప్రత్యేక ఆహార జోన్లు..!



పలాస : వీధుల్లో తిరిగే శునకాల కోసం ప్రత్యేక ఆహార జోన్లు ఏర్పాటు చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ జారీ చేసిన ఉత్తర్వులతో అధికారులు కుస్తీ పడుతున్నారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో శునకాలకు ఆహారం ఇవ్వడాన్ని నిషేధించాలని స్పష్టం చేయడంతో స్థలాల ఎంపికపై దృష్టి సారించారు. ప్రధాన కూడళ్లల్లో హెల్ప్‌లైన్ నంబరుతో కూడిన బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. త్వరలోనే నిబంధనల ప్రకారం నూతన విధానం అమలయ్యేలా పర్యవేక్షస్తామని స్పష్టం చేశారు. పలాస–కాశీబుగ్గ, ఆమదాలవలస పురపాలక సంఘాలు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో పరిస్థితిపై కథనం.

**జంట పట్టణాల్లో అన్వేషణ**

కాశీబుగ్గ సంత మైదానం సమీపంలో, రైల్వే గేటు, పలాస పాత కోర్టు సమీపంలో శునకాల కోసం ప్రత్యేక ఆహార జోన్లు ఏర్పాటు చేయడానికి స్థలాలు అన్వేషిస్తున్నారు. ఆహారం వేయడానికి నిధులు కేటాయించకపోవడంతో ప్రజలకు అవగాహన కల్పించడానికి సమాయత్తమవుతున్నారు. శునకాలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించారు.

**వార్డుకు ఒకటి**శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో వార్డుకు ఒకటి చొప్పున 48 ప్రాంతాల్లో శునకాలకు ఆహారం పెట్టేలా కేంద్రాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. వాటి సమాచారం తెలియజేయడానికి నగరపాలక సంస్థ తరఫున హెల్ప్‌లైన్ నంబరుతో ప్రధాన కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. అనుమతి తీసుకుని పెంపుడు కుక్కల్ని పెంచాలని కోరుతున్నారు.

**ఆమదాలవలసలో అగమ్యగోచరం**ఆమదాలవలస పురపాలక సంఘంలో ఫీడింగ్ కేంద్రం ఊసే లేదు. 436 శునకాలకు సంతాన నియంత్రణ శస్త్రచికిత్స చేసినా వాటికి ఆహారం అందించేలా ఏర్పాట్లు చేయలేదు. ఎక్కడెక్కడ నెలకొల్పాలనే విషయంపై స్పష్టత లేకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

## నానో మాకొద్దు..!




: రబీలో వ్యవసాయానికి అవసరమైన మేర ఎరువులు దొరక్క రైతులు ఒత్తిడికి గురవుతుండగా..కొందరు డీలర్లు నానో ఎరువులు అంటగట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. యూరియా, డీఏపీ బస్తా కావాలంటే కచ్చితంగా తీసుళ్లాల్సిందేనని అంటగడుతున్నారు. వాటి వినియోగంపై అవగాహన లేకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి జిల్లాలో ఎరువుల సరఫరాకు సంబంధించి ఐదుగురు గుత్త వ్యాపారులు, 300 మందికి పైగా వ్యాపారులు, 181 మంది డీలర్లు ఉన్నారు. ప్రతి ఎరువుల బస్తాకు 1:2 నిష్పత్తిలో నానో ఎరువులు తీసుళ్లాల్సి వస్తోందని డీలర్లు వాపోతున్నారు.

గుత్త వ్యాపారుల అజమాయిషీతో డీలర్లు, వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు. యూరియా, డీఏపీ కావాలంటే తప్పనిసరిగా తాము చెప్పినట్లు సరకు తీసుళ్లాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు.

వ్యవసాయాధికారులు సైతం పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో అన్నదాతల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది.

ఒకవైపు ఎరువుల కొరత, మరోవైపు నానో ఎరువులను అంటగట్టడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వీటి పిచికారీపై అవగాహన, సాంకేతికత అందుబాటులో లేకపోవడంతో విముఖత చూపుతున్నారు.

**అవగాహన అవసరం ..**– త్రినాథస్వామి, జేడీ, వ్యవసాయ శాఖ, శ్రీకాకుళం నానో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన అవసరం. ఈ విషయమై వచ్చే వారంలో సదస్సులు నిర్వహిస్తాం.

## తాత్కాలిక శౌచాలయాలకు రూ.87లక్షలా?



పుట్టపర్తి: సత్యసాయి శతజయంతి వేడుకల సందర్భంగా చేసిన ఏర్పాట్లు, అభివృద్ధి పనులకు.. గుత్తేదార్లు పెట్టిన బిల్లులకు పొంతనే ఉండటం లేదు. ఇష్టారాజ్యంగా బిల్లులు తయారు చేసి.. నిధులు నొక్కేసేందుకు యత్నాలు మొదలెట్టారు. ఇందుకు ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఓ అధికారిని గుత్తేదారులు ప్రసన్నం చేసుకుని ముందస్తుగా ముడుపులు అందించినట్లు సమాచారం. గతేడాది నవంబరు 18 నుంచి 23 వరకు సత్యసాయి శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఇందుకుగాను ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో జిల్లా కేంద్రం పుట్టపర్తిలో వీధిదీపాలు ఏర్పాటు, రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కల తొలగింపు, తాత్కాలిక శౌచాలయాల ఏర్పాటు, రహదారుల నిర్మాణం.. తదితర పనులు చేపట్టారు. ఆయా పనులకు రూ.కోట్లలో ఖర్చయిందని, నిధులు విడుదల చేయాలని గుత్తేదారులు బిల్లులు సమర్పించారు.

**ఏవి.. ఎక్కడున్నాయో..**

పారిశుద్ధ్యం మెరుగుకు పరికరాలు, బ్లీచింగ్, ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. ఎన్ని పరికరాలు కొనుగోలు చేశారో.. అవి ఎక్కడున్నాయో తెలియదు. నేటికీ కార్మికులు పరికరాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు చేసిన పరికరాలకు రూ.39 లక్షలు వెచ్చించినట్లు బిల్లు పెట్టారు. రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగింపు, యంత్రాలతో పార్కింగ్ ప్రాంతాల్లో శుభ్రం చేయించడం, తాగునీరు ఏర్పాటు, అదనంగా పారిశుద్ధ్య కార్మికుల నియమానికి రూ.30 లక్షలు ఖర్చు చేసినట్లు బిల్లులు రూపొందించారు. వీధిదీపాల ఏర్పాటుకు రూ.46 లక్షలు ఖర్చు చేసినట్లు నమోదు చేశారు. ప్రధాన రహదారులు తప్ప మున్సిపాలిటీ పరిధిలోని 10 నుంచి 20వ వార్డు వరకు చాలాచోట్ల వీధిదీపాలు ఏర్పాటు చేయలేదు. కొనుగోలు చేసి ఎక్కడ ఏర్పాటు చేశారో తెలియని పరిస్థితి.

**కొత్తవి నిర్మించినా.. అంత ఖర్చు కాదు**

భక్తుల సౌకర్యార్థం కర్ణాటకనాగేపల్లి, కమ్మవారిపల్లి రహదారి, తహసీల్దార్ కార్యాలయం, అమూల్య లేఅవుట్, ఆనంద్ విల్లాస్, శిల్పారామం తదితర ప్రాంతాల్లో తాత్కాలిక శౌచాలయాలు ఏర్పాటు చేశారు. వీటి కోసం రూ.87 లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపుతున్నారు. కొత్తవి నిర్మించినా.. అంత డబ్బు ఖర్చు కాదని స్థానికులు చెబుతున్నారు.

**నిబంధనల మేరకే చెల్లిస్తాం**

క్రాంతికుమార్, మున్సిపల్ కమిషనర్

శత జయంతి వేడుకల ఏర్పాట్లు, అభివృద్ధి పనులకు అనుగుణంగా బిల్లులు మంజూరు చేస్తాం. ఎక్కడా అవినీతికి తావులేకుండా పరిశీలన చేసి.. నిబంధనలకు మేరకే గుత్తేదారులకు బిల్లుల చెల్లింపు చేస్తాం.

## అనంత యార్డులో సమస్యలెన్నో..



అనంతపురం : ఉమ్మడి జిల్లాలో అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు పెద్దది. వేలాదిగా రైతులు, వ్యాపారులు క్రయవిక్రయాలు సాగిస్తుంటారు. ఏడాదికి రుసుం వసూళ్లు రూ.5.10కోట్ల పైమాటే. అయితే సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పునర్విభజనతో అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధి వరకు ఉంది. రాప్తాడు, శింగనమల నియోజకవర్గాల్లో వేర్వేరుగా యార్డులు ఏర్పాటయ్యాయి. దీంతో ఉద్యోగులను విభజించి ఆయా యార్డులకు సర్దుబాటు చేశారు. సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. ఈనెల 8న అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ అధ్యక్షతన కొత్త పాలకవర్గం కొలువుదీరనుంది. యార్డు అభివృద్ధితోపాటు రైతులు, వ్యాపారులకు వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.**అభివృద్ధి అస్తవ్యస్తం**గత వైకాపా ప్రభుత్వం 2020లో ఎనిమిది అభివృద్ధి పనులకు రూ.12.10 కోట్లు మంజూరు చేసింది. ఆ పనులన్నీ అసంపూర్తిగా ఉన్నాయి.యార్డులో పండ్ల వ్యాపార సముదాయ దుకాణాలు 39, చీనీ వ్యాపార దుకాణాలు 27 ఉన్నాయి. అన్నింటిని అద్దెకిచ్చారు. గత పాలకవర్గం సభ్యులు ఒకే సామాజిక వర్గానికి చెందిన దుకాణాదారులతో అద్దెలు వసూలు చేయకుండా వత్తాసు పలికారు. దీంతో నాలుగేళ్లుగా అద్దెలు మొండి బకాయిలుగా మిగిలిపోయాయి.

కేంద్ర ప్రభుత్వం రూ.40 లక్షలతో గ్రేడింగ్ యంత్రం అందించింది. ఒక్క రోజు కూడా పనిచేసిందేలేదు. తడి, పొడి చెత్తను ఎరువుగా మార్చేందుకు స్వచ్ఛభారత్ కింద కేంద్ర ప్రభుత్వం 2019లో రూ.5లక్షలతో విలువైన యంత్రం పంపింది. అది మూలనపడింది. రైతుల ఆకలి తీర్చేందుకు రాయితీ భోజనం అందించాల్సి ఉన్నా.. అమలు కావడం లేదు.అన్నదాతలు విశ్రాంతి తీసుకునేందుకు నిర్మించిన భవనం ఇప్పటికీ తెరుచుకోలేదు. యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు నాలుగు నెలల కిందట ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇక్కడ మార్కెటింగ్‌శాఖ ఏడీ రాఘవేంద్రరావుకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

చీనీ సంతలో కొన్నేళ్ల నుంచి మురుగు సమస్య వేధిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. ధరలు ప్రదర్శించే బోర్డు పాడైపోయి ఏడాదవుతున్నా కొత్తది ఏర్పాటు చేయలేదు. ఈ సమస్యలను కొత్త పాలకవర్గం పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## మంత్రి ఆదేశించినా..! ఆక్రమణలు మామూలే

రాజమహేంద్రవరం : పుష్కరాలకు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని రహదారులు, కాలువలను విస్తరించాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆక్రమణలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. రోడ్లు విస్తరించాలంటే ముందుగా ఆక్రమణలు తొలగించాలి. ఇందుకుగాను నగరంలో రద్దీగా ఉన్న రహదారులు, వాటి పరిధిలోని ఆక్రమణలు గుర్తించారు. తొలుత మూలగొయ్యి, జాంపేట, ఆజాద్ చౌక్, కంబాలచెరువు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగింపు ప్రారంభించారు. ఈ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో తొలగించిన చోట మళ్లీ ఆక్రమణలు వెలిశాయి. ఏకంగా నడకదారుల పై దుకాణాలు, రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ



40 నుంచి 60 అడుగుల రోడ్డు ఉన్నప్పటికీ కనీసం వెళ్లేందుకు 20 అడుగుల కూడా కనిపించకపోవడం గమనార్హం. దుకాణాలు రోడ్డుపైకి వస్తే, కొనుగోళ్ల కోసం వచ్చిన వాహనదారుల వాహనాలు రోడ్డు సగం ఆక్రమించేస్తున్నాయి. దీంతో ఉన్న సగం రోడ్డులోనే వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. నగరంలో ప్రధాన ప్రాంతాల్లో ఇదే దుస్థితి నెలకొంది. దేవీచౌక్, మెయిన్ రోడ్డు, జాంపేట, గోరక్షణపేట, కోరుకొండ రోడ్డు, కోటిపల్లి బస్టాండ్ రోడ్డు, అప్సరా థియేటర్ రోడ్డు, కోటగుమ్మం, డీలక్స్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. జాంపేట వద్ద బిర్యానీ సెంటర్లు, చికెన్ దుకాణాలను నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన యంత్రాంగం చూసిచూడనట్లు వదిలేసినట్లు సమాచారం. ముఖ్యంగా పెద్ద దుకాణాల విషయంలో భారీగానే మామూళ్లు పిండేస్తున్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తు కార్యాచరణ దిశగా అడుగు వేస్తుంటే ఆదిలోనే హంస పాదు అన్నట్లు పరిస్థితి మారిపోయింది.

## ఉపాధి పని దినాల పెంపు

రావులపాలెం : ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకంలో పనిదినాలు 100 రోజులు ఉండేవి. వీటిని 125 రోజులకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఈ పథకాన్ని అనుసంధానం చేయడంతో రైతులు, వేతనదారులకు మేలు చేకూరనుంది.

**3.36 లక్షల మందికి ప్రయోజనం**

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల్లో 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జాబ్ కార్డులు 2.2 లక్షలు ఉండగా ఉపాధి శ్రామికులు 3.36 లక్షల మంది ఉన్నారు. జిల్లాలో జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పాడి పశువులకు గోకులం షెడ్లు, మ్యాజిక్



డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, ఉద్యాన పంటల సాగు, ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్నారు. రోజుకు శ్రామికులు గరిష్ట వేతనం రూ.307 పొందుతున్నారు.

**త్వరలోనే అమలు**

వంద రోజుల నుంచి 125 రోజులకు పనిదినాలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే అమలు చేస్తాం. పనిదినాలు పెరగడం వల్ల వేతనదారులకు గరిష్ఠ ఆదాయం వస్తుంది. మధుసూదన్, డ్వామా పీడీ

## 'సూర్య'డర్

నంద్యాల : దేశవ్యాప్తంగా కోటి సౌర విద్యుత్తు ఫలకాలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పీఎం 'సూర్యఘర్ యోజన'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉమ్మడి జిల్లాలో వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు విస్తృత ప్రచారం చేశారు. పథకం వినియోగించుకునేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నా బ్యాంకర్ల నుంచి సహకారం అంతంతమాత్రంగానే ఉంది. వివిధ కొర్రీలు పెట్టి పథకానికి తూట్లు పొడుస్తున్నారు.

**సదుద్దేశంతో శ్రీకారం చుట్టినా..**

కర్నూలు జిల్లాలో 6,46,025, నంద్యాల జిల్లాలో 5,21,518 మంది గృహ విద్యుత్తు వినియోగదారులు ఉన్నారు. లోఓల్టేజీ సమస్యలు, విద్యుత్తు సరఫరాలో అవాంతరాలను అధిగమించడం.. రూ.వేల విద్యుత్తు బిల్లుల నుంచి ఉపశమనం పొందేందుకు కేంద్రం ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు పరిశీలిస్తే నంద్యాల జిల్లాలో 2,200, కర్నూలు జిల్లాలో 1,581 యూనిట్లు మాత్రమే ఏర్పాటయ్యాయి. బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు ఇస్తున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలవడం లేదు. వ్యాపారులు, ఉద్యోగులకు మాత్రమే బ్యాంకర్లు మంజూరు చేస్తున్నారు.

**అడ్డంకులెన్నో..**

ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున రైతులున్నారు. వీరు సోలార్ యూనిట్ల కోసం బ్యాంకర్లను సంప్రదిస్తే సిబిల్ స్కోర్, లావాదేవీలు, గతంలో తీసుకున్న రుణాలపై ఆరా తీస్తున్నారు. వ్యక్తిగత వివరాలు అడుగుతుండటంతో వీరు పథకానికి దూరమవుతున్నారు.

ఇంటి యజమాని అంగీకరించకపోవడంతో అద్దె ఇంట్లో ఉన్నవారు పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

60 ఏళ్లు దాటినవారికి రుణం ఇవ్వడం లేదు.

కర్నూలు నగరంతోపాటు నంద్యాల, ఆదోని తదితర పట్టణాల్లో వేలాది బహుళ అంతస్తు భవనాలున్నాయి. ఇక్కడ ఎవరైనా యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని భావిస్తే అపార్టుమెంటులో నివసిస్తున్న 10 కుటుంబాల వారు సంతకాలు చేయాల్సి రావడం అడ్డంకిగా మారింది. ఇలా.. సూర్యఘర్‌కు వివిధ వర్గాలవారు దూరమయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 11,67,543 మంది విద్యుత్తు వినియోగదారులు ఉండగా.. వారిలో కనీసం 0.5 శాతం మందికి కూడా 'సూర్యఘర్' అందని పరిస్థితి నెలకొంది.

**రూ.కోటి అవకాశం కోల్పోయినట్లే..**

గ్రామంలో వంద శాతం ఇళ్లకు సౌర ఫలకాలు ఏర్పాటుచేస్తే.. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహంగా రూ.కోటి వరకు నిధులు విడుదల చేస్తుంది. కర్నూలు జిల్లాలో 484, నంద్యాల జిల్లాలో 489 గ్రామాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏ ప్రాంతంలోనూ ఈ అవకాశాన్ని వినియోగించుకోలేదు. గ్రామాలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని బ్యాంకులు రుణాలు ఇవ్వాల్సి ఉంది.

# కంకర మింగుతున్న కింకరులు

నంద్యాల : ఖనిజ అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా సీనరేజ్ వసూలు చేసే బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ప్రభుత్వం ఓ రకంగా ఆలోచిస్తే.. అక్రమార్కులు మరోలా పావులు కదుపుతున్నారు. అందొచ్చిన అవకాశంతో అక్రమ మైనింగ్‌ను మరింత పెంచారు. ప్రైవేటు సంస్థతో కొందరు ఒప్పందాలు చేసుకుని అనుమతుల్లేకుండానే తవ్వేస్తున్నారు. కంకర, రోడ్డు మెటల్‌కు సంబంధించిన అనుమతులు వేళ్లమీద లెక్కపెట్టే స్థాయిలో ఉండగా.. పదుల సంఖ్యలో అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి.

**నిబంధనలకు చెల్లు**

నంద్యాల జిల్లాలో రోడ్డు మెటల్ క్వారీ లీజులు ఎనిమిది మాత్రమే ఉన్నాయి. బనగానపల్లి కార్యాలయ పరిధిలో మూడు, నంద్యాల పరిధిలో ఐదింటికి మాత్రమే లీజులున్నాయి. కానీ పదుల సంఖ్యలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గడ్డెలకొండలో రెండు లీజులు మాత్రమే అధికారికంగా ఉన్నాయి. మరికొన్ని రెన్యువల్ దశలో ఉన్నాయి. ఇక్కడ ఏకంగా 35 ప్రాంతాల్లో తవ్వకాలు జరుగుతుండటం గమనార్హం. ఆరు క్రషర్ యంత్రాల ద్వారా అక్రమ మైనింగ్ జరుగుతోంది. ఈ ప్రాంతమంతా కాలుష్య కోరల్లో చిక్కుకుపోయింది. క్వారీ నిర్వాహకులు నిబంధనలు తుంగలో



తొక్కి తవ్వకాలు చేస్తున్నారు. ఇక్కడ ఏమేరకు మైనింగ్ జరుగుతుందన్న వివరాలు.. అటు రెవెన్యూ, ఇటు గనుల శాఖల వద్ద లేవు. బనగానపల్లిలో రెండింటికి మాత్రమే అధికారిక అనుమతులుండగా మరో మూడింటిలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి.

**బండరాళ్లను వదలరు..**

కర్నూలు జిల్లాలో ఏడు కంకర లీజులున్నాయి. పత్తికొండ నియోజకవర్గ పరిధి.. కృష్ణగిరి మండలం కంబాలపాడు సమీపంలోని హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ నిర్మాణంలో భాగంగా బయట పడిన రాళ్లను పగులగొట్టి కంకరగా మారుస్తున్నారు. దీనిని డోన్ సమీపంలోని కంకర క్వారీలకు తరలిస్తున్నారు. మరికొంత రోడ్డు నిర్మాణాలకు వాడుతున్నారు. కల్లూరు మండలం.. ఉలిందకొండ సమీపంలో నాలుగు కంకర క్వారీలకు అనుమతులుండగా మరో క్వారీలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఓర్వకల్లు మండలంలో పూడిచెర్ల సమీపంలో ఒకచోట అనధికార క్వారీ నడుస్తోంది.

**కానరాని తనిఖీలు**అనుమతులున్న లీజుల నుంచి వసూలు చేసిన సీనరేజ్‌ను మాత్రమే సదరు సంస్థ ప్రభుత్వానికి చెల్లిస్తోంది. అనధికారికంగా.. అక్రమంగా తవ్వకాలు చేస్తున్న కంకర, రోడ్డు మెటల్ క్వారీల నుంచి తరలే 'సరకు' నుంచి వసూలవుతున్న మొత్తాన్ని స్వాహా చేస్తోంది. సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ప్రైవేటు పరం చేసిన నాటి నుంచి గనుల శాఖ అధికారులు దాదాపు తనిఖీలు ఆపేశారు. ఇదే సమయంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని క్వారీలపై సదరు ప్రైవేటు సంస్థ గురి పెట్టింది. అనుమతి ఉన్న క్వారీల్లో ఎలాగైతే సీనరేజ్ వసూలు చేస్తుందో.. అనధికార క్వారీల్లోనూ అలానే వసూళ్లకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతోంది.

# పోగు.. ఉపాధి పేగు

కర్నూలు : గద్వాల పట్టుచీరకు ఎమ్మిగనూరు పుట్టినిల్లు.. ఇక్కడ చేనేత ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతుంటాయి.. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుతో మరింత వన్నెరాబోతోంది. ఇక్కడి కార్మికులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో బనవాసిఫారం వద్ద యుద్ధప్రాతిపదికన టెక్స్‌టైల్ పార్కును నిర్మిస్తున్నారు. 77.37 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో 249 ప్లాట్లు అందుబాటులోకి తేనున్నారు. తొలిదశలో 24.38 ఎకరాల్లో లేఅవుట్‌ను అభివృద్ధి చేసి 107 ప్లాట్లు అందుబాటులోకి తెచ్చారు. తమిళనాడులోని ఈరోడ్, సేలం ప్రాంతాల టెక్స్‌టైల్ పార్కుల మాదిరిగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే రహదారుల నిర్మాణం పూర్తయ్యింది. మిగిలిన పనులు రెండు నెలల్లో పూర్తి చేసి ప్లాట్లను కార్మికులకు అప్పగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే కొందరు వ్యాపారులు ముందుకొచ్చారు. సమగ్రమైన



నివేదికతో రావాలని ఏపీఐఐసీ అధికారులు సూచించారు.

**విదేశాలకు ఎగుమతి చేసేలా**టెక్స్‌టైల్ పార్క్ నుంచే ఆన్‌లైన్‌లో ఉత్పత్తులు విక్రయించుకొనే సౌకర్యం కల్పించనున్నారు. ప్రస్తుతం సింగపూర్, అమెరికా వంటి దేశాలకు చీరలు ఎగుమతి అవుతున్నాయి. ప్రభుత్వ పరంగా వేగంగా సాయం అందేలా 'ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్'ను ఏర్పాటు చేయనున్నారు.

**కార్మికులకు 22 ఎకరాలు**

టెక్స్‌టైల్ పార్కులో చేనేతల కోసం ప్రత్యేకంగా 22 ఎకరాలు కేటాయించనున్నారు. చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా రూ.50 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. 1,500 వరకు అధునాతన ఎలక్ట్రానిక్ జాకార్డ్ మగ్గాలు అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ఇందుకు వర్క్‌షెడ్లు నిర్మించనున్నారు. వాటిని వీవర్లకు కేటాయిస్తారు. దీంతో అధునాతన విధానాల్లో పలు రకాల వస్త్రాలు ఉత్పత్తి చేయడానికి వీలుంటుంది. అదేవిధంగా ప్రత్యేక శిక్షణ కేంద్రం, డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం, డయ్యింగ్ సౌకర్యాలు, గోదాముల సదుపాయం, బ్రాండింగ్, ప్యాకేజింగ్‌లకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు.

# రాజకీయ అండ.. మాయమవుతున్న కొండ



ఏలేశ్వరం : అక్రమార్కుల కన్ను పెడితే.. కొండలు, గుట్టలు మాయం. ఏవిధమైన అనుమతులు లేకుండానే మట్టి, గ్రావెల్, ఇసుక ఇలా కంటికి కనిపించే ప్రకృతి సంపదను కొల్లగొట్టేస్తున్నారు. అనుమతి లేకుండా తవ్వకాలు జరుగుతున్నా ... అధికారులకు పట్టడంలేదు. తమ శాఖ పరిధిలోని ప్రభుత్వ వనరులు మాయమైపోతున్నా చోద్యం చూస్తూ ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏలేశ్వరం మండలం రమణయ్యపేట నుంచి జె.అన్నవరం వెళ్లే ప్రధాన ర.భ.శాఖ రహదారిని ఆనుకునే నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న తవ్వకాలతో కొండ కరిగిపోతోంది. కళ్లెదురుగా కనిపిస్తున్న అవినీతి తంతును అడ్డుకోవడంలేదు. రోడ్డుని ఆనుకుని ఉన్న అల్లి కొండను రాజకీయ అండతో కొందరు గుల్ల చేస్తున్నారు.

**పర్యావరణానికి హాని**

జె.అన్నవరం శివారున ఉన్న అల్లి కొండపై నల్లరాయి తరలింపునకు ప్రైవేట్ వ్యక్తులకు గనుల శాఖ లీజు ఇచ్చింది. కొంత భాగాన్ని లీజుకు తీసుకోవడం, గుట్టుచప్పుడు కాకుండా పెద్ద మొత్తంలో బ్లాక్ మెటల్‌ను తవ్వేయడం యజమానులకు అలవాటుగా మారింది. ఇది చాలదన్నట్టు కొండ దిగువనే ఉన్న గ్రావెల్ తరలింపును మొదలెట్టారు. రాత్రి వేళ యంత్రాలతో తవ్వేస్తూ గ్రావెల్‌ను వాహనాల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొండ, పరిసరాల్లో ఉన్న మొక్కలను తొలగిస్తూ పర్యావరణ అనుమతులను కాలరాస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే కాకినాడ– పోలవరం జిల్లాల అనుసంధాన ర.భ.శాఖ రహదారి సమీపానే యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలను చేసుకుంటూ పోతున్నారు. రవాణాకు రహదారిని నిర్మించుకున్నారు.

**అడ్డగోలు తవ్వకాలు**గ్రావెల్ తవ్వకాలు, తరలింపులో నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. సరాసరి రహదారికి సమీపానే యంత్రాలతో పెద్ద పెద్ద గోతులు తీసి గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఐదు నుంచి పది అడుగుల లోతుకు వెళ్లి తవ్వకాలు చేయడంతో మేతకు వచ్చే పశువులు మృత్యువాత పడే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. మనుషుల ప్రాణాలకూ ప్రమాదమే. ట్రాక్టర్ గ్రావెల్‌ను ఎదుటివారి అవసరాన్ని బట్టి రూ.1000 నుంచి రూ. 1500 వరకు అమ్మి అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వ ఖజానాకు నయా పైసా ఆదాయం రాకపోగా, అనుమతి లేని తవ్వకాలు సాగిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. ఇప్పటికే కొండ దిగువ అధిక భాగం.. రహదారికి సమానంగా మారింది. మరికొంత ప్రాంతం గుంతలతో ప్రమాదకరంగా కనిపిస్తోంది. రోజూ రాత్రి వేళ పలు ట్రాక్టర్లతో గ్రావెల్‌ను వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నా ... వివిధ శాఖల అధికారులు తమకు సంబంధం లేని వ్యవహారంగానే వదిలేస్తున్నారు. అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

# పల్లెల్లోనూ ఆకలి తీరుస్తారు!



కాకినాడ : పట్టణ ప్రాంతాల్లో రూ.5కే ఆకలిని తీర్చుతున్న అన్న క్యాంటీన్లు త్వరలో పల్లెల్లోనూ సేవలు అందించబోతున్నాయి. ప్రతి నియోజకవర్గంలోనూ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. రెండో విడతగా కాకినాడ జిల్లాలో జగ్గంపేట, తిమ్మాపురం, యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ వద్ద నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. మండల కేంద్రాలు, జనసమ్మర్థం ఎక్కువగా ఉన్నచోట నిర్మిస్తే అవసరార్థుల ఆకలి తీర్చడానికి అవకాశం ఉంటుందని ఎంపిక చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

**చక్కటి ఆదరణతో..**

ప్రస్తుతం జిల్లాలో 11 చోట్ల అన్న క్యాంటీన్ల ద్వారా ఆకలి తీర్చుతున్నారు. రూ.5కే నాణ్యమైన ఆహారం, అల్పాహారం లభించడంతో ఆదరణ పెరిగింది. దూరాభారం నుంచి పనుల కోసం కాకినాడ వచ్చినవారు సమీప క్యాంటీన్లకు వెళ్తున్నారు. పూటకు రూ.70–100 వరకు ఆదా అవుతుందని, రుచికరమైన భోజనం పెడుతున్నారని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వీటిని నెలకొల్పినప్పటి నుంచి ఇప్పటివరకు 10 లక్షల మందికిపైగా ఆరగించారు. కాకినాడ నగరంలో అయిదు చోట్ల, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, ఏలేశ్వరం, గొల్లప్రోలులో ఒక్కో చోట అన్న క్యాంటీన్లు ఉన్నాయి.

**జోరుగా నిర్మాణాలు..**

జగ్గంపేటలో అన్నక్యాంటీన్ పనులు దాదాపు పూర్తయ్యాయి. అల్యూమినియం గ్లాస్ కిటికీలు, గ్రానైట్ టేబుళ్లు నిర్మించాల్సి ఉంది. ఈనెలలోనే వినియోగంలోకి తెస్తారు.

కాకినాడ గ్రామీణ మండలం అచ్చంపేట కూడలి సమీపంలో నిర్మిస్తున్న క్యాంటీన్ 90 శాతం పూర్తయింది. సంక్రాంతికి ప్రారంభించే అవకాశం ఉంది. ఉప్పాడ కొత్తపల్లిలో ప్రహరీ, గ్రిల్స్, సంప్, పెయింటింగ్ మినహా 80 శాతం పనులు జరిగాయి.

# వారసత్వ రిజిస్ట్రేషన్లపై కొర్రీలు



ముమ్మిడివరం: వారసత్వ భూములను హక్కుదారులకు నామమాత్రపు రుసుంతో రిజిస్ట్రేషన్ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆస్తి విలువ రూ.10లక్షల లోపు ఉంటే రూ.100, అంతకు మించితే రూ.1000 రిజిస్ట్రేషన్ ఫీజుతో రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించారు. పలు కారణాలతో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. నెల రోజులు గడుస్తున్నా.. ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. కొన్ని సబ్ రిజిస్టార్ కార్యాలయాల్లో ఒక్క రిజిస్ట్రేషనూ జరగలేదు. తన తండ్రి ద్వారా సంక్రమించిన వారసత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని ఓ వ్యక్తి ముమ్మిడివరం సబ్ రిజిస్టార్ కార్యాలయానికి వెళ్లగా.. ఆ కుటుంబ యజమాని పేరిట ఉన్న భూమి వెబ్ ల్యాండ్‌లో నమోదు కాకపోవడంతో సమస్య ఎదురైంది.

**వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాకపోతే..**

భూములకు సంబంధించి ఏళ్ల తరబడి సమస్యలు ఉన్నాయి. ప్రధానంగా వెబ్‌ల్యాండ్‌లో సంబంధిత ఆస్తి యజమాని పేరు నమోదు కాకపోవడం. సర్వే నంబర్లలో పొరపాట్లు వంటివి ప్రధాన సమస్యగా ఉంది. గతంలో వీటిని అధికారులు ఇష్టానుసారం నమోదు చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. సంబంధిత యజమానులు తమ పేరు మార్పు కోసం నానాతంటాలు పడుతున్నారు. 'వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ విషయంలో ప్రభుత్వం నామమాత్రపు రుసుంతో వారసులకు భాగాలుగా రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం కల్పించింది.' అని జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావు అన్నారు.

**25 మాత్రమే..**

జిల్లాలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిత్యం ఒక్కోచోట 30 నుంచి 40 వరకు రిజిస్టేషన్లు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా 350–400 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. వారసత్వానికి సంబంధించి ఇప్పటి వరకు జిల్లాలో కేవలం 25 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరగడం గమనార్హం. చాలాచోట్ల ఒక్కటీ కాలేదు.

**ప్రధాన సమస్యలు..**

ఎప్పటి నుంచో ఉన్న రెవెన్యూ సంబంధిత సమస్యలు.

వెబ్‌ల్యాండ్‌లో సదరు సర్వే నంబర్లు ఆన్‌లైన్ చేయకపోవడం.

1బీ అడంగల్‌లో నమోదు కాకపోవడం.

వారసులు కార్యాలయాలకు వెళ్తే రకరకాల ధ్రువీకరణ పత్రాలు అడగడం

నిబంధనల పేరుతో పలుసార్లు కార్యాలయాలకు తిప్పించడం.

# ఇఫ్కో.. ప్రగతికి మార్గమిదిగో!

నెల్లూరు: జిల్లా పారిశ్రామిక రంగంలో మరో మేలి అడుగు పడింది. దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించింది. రాచర్లపాడు సమీపంలో ఏర్పాటు చేసిన ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రత్యేక ఆర్థిక మండలికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. భూములిచ్చిన వారికి పరిహారం చెల్లింపు అంశాలు కోర్టులో ఉన్నా.. ఆ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో గతంలో ఎరువుల పరిశ్రమ కోసం తీసుకోగా.. ప్రస్తుతం పారిశ్రామిక పార్కుగా మార్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆ మేరకు పరిశ్రమల ఏర్పాటుకు ఇటీవల విశాఖలో జరిగిన పారిశ్రామిక సదస్సులో ఎంవోయూ కుదుర్చుకోవడం గమనార్హం.




**పరిశ్రమలను ఆకర్షించేలా..**

ఇఫ్కో సెజ్ జాతీయ రహదారికి ఆనుకుని ఉండటం.. రైలు, రోడ్డు, వాయు, జల మార్గాల ద్వారా రవాణా అవకాశాలు పుష్కలంగా ఉండటంతో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతారని అధికారులు భావిస్తున్నారు. మొత్తం రూ. 870 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు సిద్ధమవుతున్నారు. అందుకు సంబంధించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు నోటీసును కూడా జారీ చేశారు. ఇప్పటికే మూడు ప్రధాన సంస్థలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రాగా.. రూ. 356 కోట్లతో రామ్కీ బయో ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు డిసెంబరు 30న పర్యావరణ అభిప్రాయ సేకరణ జరగనుంది.

దీనిపై కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ.. 'ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు ప్రోత్సాహకాలను అందించనుంది. ఈ సెజ్‌తో ఎంఎస్ఎంఈ/ఎస్ఎంఈలకు, స్థానికులకు ఉపాధి, వ్యాపార అవకాశాలు లభిస్తాయి. పార్కు పూర్తిగా అభివృద్ధి చెందితే కావలి–నెల్లూరు మధ్య కీలక ఆర్థిక కారిడార్‌గా మారుతుంది' అని అన్నారు.

# సకాలంలో చికిత్సే కీలకం..

విశాఖపట్నం: ఉత్తరాంధ్రలో 'స్క్రబ్ టైఫస్' కేసులు పెరుగుతుండటంతో ప్రజలు భయపడుతున్నారు. తాజాగా వ్యాధి లక్షణాలతో దేవరాపల్లికి చెందిన 50 ఏళ్ల వ్యక్తి మరణించడంతో ఆందోళన చెందుతున్నారు. అయితే 'స్క్రబ్ టైఫస్'పై ఆందోళన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇది కొత్తగా వచ్చిన వ్యాధి కాదని, సకాలంలో చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.

కలెక్టర్ సూచనల మేరకు వైద్యులు, సిబ్బందితో కూడిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీం (ఆర్ఆర్‌టీ)లు ఏర్పాటు చేశారు. ఒకే ప్రాంతంలో ఐదు కంటే ఎక్కువ కేసులుంటే ఆ బృందం వెళ్లి పరీక్షిస్తుంది.

ఇక్కడే ఎందుకంటే.. ఈ ఏడాది ఇప్పటివరకు ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో 200కు పైగా కేసులు బయటపడ్డాయి. అందులో ఎక్కువ శాతం విశాఖలోవే.

జిల్లాలో ఆసుపత్రులు, ప్రయోగశాలలు ఎక్కువగా ఉన్నాయి. మెరుగైన వైద్య సదుపాయాలుండటంతో అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి అనుమానిత లక్షణాలున్న బాధితులు ఎక్కువగా ఇక్కడికి వస్తున్నారు. దీంతో ఇక్కడే కేసులు ఎక్కువగా బయట పడుతున్నాయి. అందులో అధిక భాగం కేజీహెచ్‌లో నిర్ధారణ అవుతున్నాయి.

మరోవైపు రాష్ట్రంలోనే ఎక్కువ కేసులు నమోదైన జాబితాలో విశాఖ ఉండటంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు.

ఎవరికైనా వ్యాధి లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రం వైద్యులను సంప్రదించాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు సూచించారు.

లక్షణాలు.. అకస్మాత్తుగా 99 డిగ్రీలకు పైగా జ్వరం, అలసట, తలనొప్పి, వాంతులు, దద్దుర్లు, శరీరంపై నల్లటి మచ్చలు.

అలా.. గుర్తించారుఆంధ్ర వైద్య కళాశాలకు చెందిన మైక్రోబయాలజీ విభాగ వైద్యులు గతేడాది దీనిపై పరిశోధన చేశారు. 2023 ఫిబ్రవరి నుంచి 2024 ఫిబ్రవరి వరకు కేజీహెచ్‌లో ఇన్‌పేషెంట్లుగా చేరిన మొత్తం 507 మంది అనుమానితుల నమూనాలు పరీక్షించారు. అందులో 49 మందికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా గుర్తించారు. బాధితుల్లో మహిళల (30.6 శాతం) కంటే పురుషులే (69.4 శాతం) ఎక్కువగా ఉన్నారు. వారిలో ఆరుగురు జ్వరం రావడానికి ముందు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లినట్లు గుర్తించారు. వారిలోనూ యువత ఎక్కువగా ఉండటం గమనార్హం.

నిర్లక్ష్యం చేస్తేనే సమస్య..

'స్క్రబ్ టైఫస్'పై భయపడాల్సిన అవసరం లేదు. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదు. జ్వరం వచ్చిన 3 నుంచి 5 రోజుల్లో పరీక్షలు చేయించుకోవాలి. త్వరగా గుర్తించకపోవడం వల్ల సమస్య తీవ్రమవుతుంది' అని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పేర్కొన్నారు.

# నిబంధనలకు నీళ్లు.. నచ్చినట్టు వసూళ్లు!

అనకాపల్లి : జిల్లాలోని వందల సంఖ్యలో క్వారీలు ఉన్నా.. గతంలో ప్రభుత్వానికి సీనరేజ్ రూపంలో ఒక్క రూపాయి కూడా ఆదాయం వచ్చేది కాదు. దీంతోపాటు అధికారిక క్వారీల్లో పరిమితికి మించి తవ్వేసేవారు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం.. అక్రమ మైనింగ్, రవాణాను అడ్డుకట్ట వేసేందుకు సీనరేజ్ వసూళ్లను ప్రైవేటు సంస్థకు అప్పగించేసింది. దీంతో ఆ సంస్థ జిల్లాలో పలుచోట్ల అక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఈ చెక్‌పోస్టుల్లో ఎక్కడా నిబంధనలు అమలు కావడం లేదు.

అంచనా ప్రకారం లెక్కేసి.. నిబంధనల ప్రకారం క్వారీలున్న ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించాలి. గ్రానైట్, గ్రావెల్, క్రషర్, నల్లరాయి, మెటల్ రవాణా వాహనాలకు వే బిల్లు లేకపోతే.. వాటి నుంచి సీనరేజ్ వసూలు చేయాలి. కానీ.. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు వద్ద ఎక్కడా వే బ్రిడ్జిలు లేవు. వాహనంలో ఎంత పరిమాణంలో సరకు వెళ్తోందో కూడా చూడటంలేదు. అంచనా ప్రకారం లెక్కలేసి.. డబ్బులు ఇవ్వాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఇవ్వమంటే.. వాహనాన్ని కదలనీయడం లేదు. కొన్నిచోట్ల వాహనాల వెంట ద్విచక్రవాహనాలపై వెంబడించి మరీ నిలుపుదల చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.

ఇటీవల పాయకరావుపేట మండలంలోని సత్యవరానికి చెందిన పడాల కృష్ణ సమీపంలోని క్వారీ బూడిదను పశువుల పాకను ఎత్తుచేసేందుకు ట్రాక్టర్‌తో తీసుకెళ్తుండగా.. ఇద్దరు బైక్‌పై వచ్చి ఆపారు. ట్రాక్టర్ బూడిదకు రూ. 800 ఇవ్వాలని ముక్కుపిండి వసూలు చేశారు.

రసీదులు ఇవకుండానే..కాంట్రాక్టు పొందిన సంస్థ ముద్రించిన బిల్లులు కూడా ఇవ్వడంలేదు. కొన్నిచోట్ల చేతి రాతతో.. వాహనం నంబర్, సమయం, తేదీ, చెక్‌పాయింట్ పేరు రాసి అదే రసీదంటూ డ్రైవర్ చేతిలో పెట్టేస్తున్నారు.




# అందాల ఆండ్రియా తగ్గట్లేదుగా..!

తెలుగు ప్రేక్షకులకు తడాఖా సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ ఆండ్రియా. కేవలం నటిగా మాత్రమే కాకుండా ఈమె సింగర్‌గా ఇంకా పలు రకాల ట్యాలెంట్స్‌తో మల్టీ ట్యాలెంటెడ్ అనిపించుకుంది. పలు అవార్డ్‌లను రివార్డ్‌లను సొంతం చేసుకున్న ఆండ్రియా నటిగా ఇప్పటికీ బిజీగా ఉంది. ఈ ఏడాది ఈమె నటించిన మూడు నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. గత ఏడాదిలో ఈమె ఎక్కువగా కనిపించకున్నా ఈ ఏడాదిలో ఎక్కువగా కనిపించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. మరో వైపు ఇటీవలే నాలుగు పదుల వయసులో పడ్డ ఆండ్రియా సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలను వరుసగా షేర్ చేయడం మనం చూస్తూనే ఉన్నాం. ఆమె ఫోటోలు ఎప్పటికప్పుడు వైరల్ కావడం తెలిసిందే. తాజాగా మరోసారి ఆండ్రియా అందాల ఆరబోత ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

**అందాల ఆరబోత ఫోటోలతో...** ఆండ్రియా తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఈ ఫోటోలు ఆమె అభిమానులకు కన్నుల విందు చేస్తున్నాయి. బీచ్ లో సేద తీరుతు ఆండ్రియా ఫోటోలకు ఫోజ్‌లు ఇచ్చింది. సాధారణంగానే ముద్దుగుమ్మల ఫోటోలకు మంచి రీచ్ ఉంటుంది. ఇక బీచ్ ఫోటోలు అంటే ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సోషల్ మీడియాలో ఆయా ఫోటోలు తెగ వైరల్ కావడం జరుగుతుంది. ఆండ్రియా బీచ్ ఫోటోలు సైతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఆండ్రియా సొంతం



అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ విషయం నిజం అన్నట్లుగా ఆండ్రియా అందాల ఆరబోత ఫోటోలు సోషల్ మీడియాలో మరోసారి వైరల్ అవుతున్నాయి. ఆండ్రియా అందానికి ఫిదా అవుతున్న వారు చాలా మంది సోషల్ మీడియా ద్వారా కామెంట్ చేస్తూ ఫోటోలను తెగ షేర్ చేస్తు ఉన్నారు.

**ఇన్‌స్టాగ్రామ్‌లో ఆండ్రియా...** ఆండ్రియా నాలుగు పదుల వయసులోనూ ఇంత అందంగా ఉంది అంటూ ఫాలోవర్స్ మాట్లాడుకుంటున్నారు. సహజంగా అయితే వయసు పెరిగినా కొద్దీ అందం తగ్గుతూ ఉంటుంది. కానీ ఆండ్రియా అందం ఈ విషయంలో రివర్స్ లో పెరుగుతూ వస్తోందని అంటున్నారు. కెరీర్ ఆరంభంతో పోల్చితే ఆండ్రియా అందం ఇప్పుడు మరింత ఎక్కువ అయిందని నెటిజన్స్ అంటున్నారు. గతంతో పోల్చితే ఆండ్రియా ఇప్పుడు మరింత సన్నగా నాజూకుగా మారింది. అంతే కాకుండా స్టైలిష్ గా కూడా మారింది అంటూ నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. ఆకట్టుకునే అందంతో పాటు, నటిగానూ మంచి బిజీగా ఉన్న ఆండ్రియా మరో పదేళ్ల పాటు ఇదే జోష్ తో ఉంటుంది అంటూ ఆమె ఫ్యాన్స్ అంటున్నారు. ఆండ్రియా ఈ మధ్య కాలంలో పాడటంను పక్కన పెట్టిందని, మళ్లీ పాడటం మొదలు పెట్టాలి అంటూ ఆమె అభిమానులు కోరుకుంటున్నారు.

# స్టార్ సింగర్ రిటైర్మెంట్ వెనక రీజన్ ఏంటి..?

సినిమాను ముందు ప్రేక్షకులకు చేరవేసేది సంగీతమే. అందులోనూ ఫలానా సినిమాలో పాటలు బాగుంటాయ్ అంటే చాలు అదో రకమైన పాజిటివిటీ వచ్చేస్తుంది. సినిమాల్లో ప్లే బ్యాక్ సింగర్స్ కి సెపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంటుంది. జస్ట్ సాంగ్ ఇలా వినేస్తే చాలు అలా ఎవరు పాడారో ఇట్టే కనిపెట్టేస్తారు. అలా తమ గాత్రంతో ఎంతోమంది సంగీత ప్రియులను అలరించిన సింగర్స్ ఉన్నారు. ఐతే సింగర్ గా ఒక టైం లైట్ వచ్చాక కెరీర్ పీక్స్ లో ఉంటుంది. కావాలని ఎవరు దాని నుంచి తప్పుకోవాలని అనుకోరు. కానీ పాపులర్ సింగర్ అర్జిత్ సింగ్ మాత్రం సింగర్ గా రిటైర్మెంట్ ప్రకటించి అందరికీ షాక్ ఇచ్చాడు.

**అర్జిత్ సింగ్ స్టార్ సింగర్ గా క్రేజ్..** బాలీవుడ్ లో ఎన్నో సూపర్ హిట్ సాంగ్స్ పాడిన అర్జిత్ సింగ్ పాట పాడితే దానికి ఎంతో క్రేజ్ తెచ్చేవారు. ప్లే బ్యాక్ సింగర్ గా స్టార్ సింగర్ గా క్రేజ్ తెచ్చుకున్న అర్జిత్ సింగ్ 38 ఏళ్లకే రిటైర్మెంట్ ప్రకటించి షాక్ ఇచ్చాడు. సింగర్



గా ఫుల్ డిమాండ్ ఇంకా క్రేజ్ ఉన్న ఈ టైం లో అర్జిత్ సింగ్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సంగీత ప్రియులను షాక్ అయ్యేలా చేస్తుంది. ప్లే బ్యాక్ సింగర్ గా భాషతో సంబంధం లేకుండా అభిమానులను ఏర్పరచుకున్నాడు అర్జిత్ సింగ్. ఐతే అతని రిటైర్మెంట్ వెనక రీజన్స్ ఏంటి ఎందుకు ఆయన ఇలాంటి షాకింగ్ డెసిషన్ తీసుకున్నారు అన్నది తెలియాల్సి ఉంది. తన రిటైర్మెంట్ ప్రకటనలో కూడా సింగర్ గా తన ప్రయాణం ఆపేస్తున్నా అంటూ.. దేవుడు నా పట్ల దయతో ఉన్నాడని.. ఫ్యూచర్ లో మరింత నేర్చుకుంటానని అన్నాడు. ఐతే అతని అనౌన్స్ మెంట్ లో ట్విస్ట్ ఏంటంటే సంగీతం చేయడం మాత్రం ఆపను అంటూ కాస్త ఊరట కలిగించాడు అర్జిత్ సింగ్.

**సౌత్ భాషల్లో అర్జిత్ సింగ్ పాటలు..** బాలీవుడ్ లోనే కాదు సౌత్ అన్ని భాషల్లో పాటలు పాడాడు అర్జిత్ సింగ్. తెలుగులో అయితే స్వామిరారా, ఉయ్యాల జంపాల, నువ్వే నా బంగారం, హుషారు రెండేళ్ల క్రితం వచ్చిన ఓం భీం బుష్ సినిమాలో సాంగ్ పాడారు అర్జిత్ సింగ్. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ సినిమా బాటిల్ ఆఫ్ గల్వాన్ సినిమాలో కూడా మాతృభూమి సాంగ్ పాడి శ్రోతలను అలరించారు అర్జిత్ సింగ్. ఐతే ఆయన సింగర్ గా బ్రేక్ తీసుకుంటున్నా సంగీతానికి దూరంగా ఉండను అన్న మాట మాత్రం ఆయన ఫ్యాన్స్ కి కాస్త సంతోషాన్ని అందిస్తుంది. మరి అర్జిత్ సింగ్ నెక్స్ట్ స్టెప్ ఏంటన్నది తెలుసుకోవాలని ఫ్యాన్స్ ఉత్సాహంగా ఉన్నారు. అర్జిత్ సింగ్ ఏ కారణం చేత పాటలను పాడటం ఆపేస్తున్నాడో తెలియని ఫ్యాన్స్ మాత్రం అతని పాటలను ఇంకా చాలా వినాలని ఆయన తీసుకున్న ఈ నిర్ణయాన్ని సరిచేసుకోవాలని అంటున్నారు.


# యష్ తగ్గేదేలే.. ఆ విషయంలో నో ఛేంజ్!



ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ప్రస్తుతం విడుదల తేదీలపై ఫుల్ డిస్కషన్ నడుస్తోంది. పెద్ద సినిమాలన్నీ తమ షెడ్యూల్ లను మారుస్తూ, క్లాష్ తప్పించుకునే ప్రయత్నంలో ఉన్నాయి. కానీ ఆ ట్రెండ్ కు భిన్నంగా స్టార్ హీరో యష్ నటిస్తున్న భారీ చిత్రం టాక్సిక్ మేకర్స్ మాత్రం తమ నిర్ణయంపై గట్టిగా నిలబడ్డారు. తమ మూవీ రిలీజ్ డేట్ మార్చి 19 అని చెబుతూనే ఉన్నారు. కేజీఎఫ్ సిరీస్ తో పాన్ ఇండియా స్టార్ గా ఎదిగిన యష్, మరోసారి బాక్సాఫీస్ పై కన్నేశారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇతర హీరోలు, నిర్మాతలు పోటీ భయంతో విడుదల తేదీలు మార్చుకుంటున్నా, యష్ మాత్రం ఎలాంటి వెనకడుగు వేయడం లేదని అభిమానులు సంబరపడుతున్నారు. కేజీఎఫ్ తర్వాత యష్ ఎవరినీ భయపడరంటూ సోషల్ మీడియాలో ఫ్యాన్స్ కామెంట్లు చేస్తున్నారు. అయితే యష్ మార్చి నెలను ఎంచుకోవడం వెనుక స్ట్రాంగ్ లాజిక్ ఉందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మార్చి అంటే సమ్మర్ సీజన్ కు ఆరంభం అన్న విషయం తెలిసిందే. అది స్కూల్, కాలేజ్ హాలిడేలు మొదలయ్యే సమయం కూడా.. కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు వచ్చే టైమ్ అది.. అదే సమయంలో పాన్ ఇండియా సినిమాలకు అనుకూలమైన మార్కెట్ మార్చి అనే చెప్పాలి. అందుకే ఆ డేట్ ను వదులుకోకుండా మేకర్స్ ముందుకెళ్తున్నారని సమాచారం. ముఖ్యంగా నార్త్ టు సౌత్.. యష్ కు ప్రస్తుతం ఉన్న క్రేజ్ ను దృష్టిలో పెట్టుకుని, సినిమా భారీ ఓపెనింగ్స్ సాధిస్తుందనే నమ్మకంతోనే నిర్ణయం తీసుకున్నారట. అయితే ఇదంతా ఒక వైపు అయితే, మరోవైపు క్లాష్ భయం కూడా లేకపోలేదు. అదే సమయంలో ఇతర భారీ సినిమాలు విడుదలవుతున్నాయి. ముఖ్యంగా మార్చి 19వ తేదీన ధురంధర్ సీక్వెల్ ప్రేక్షకుల ముందుకు రానుంది. బ్లాక్ బస్టర్ హిట్ గా ఫస్ట్ పార్ట్ నిలవగా.. ఇప్పుడు సీక్వెల్ పై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఆ తర్వాత వీక్ లో పెద్ది, ప్యారడైజ్ లేదా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా రానుంది. దీంతో కలెక్షన్లు డివైడ్ అయ్యే అవకాశం ఉంది. కానీ కంటెంట్ పై నమ్మకంతో టాక్సిక్ మేకర్స్ ఉన్నారట. అందుకే డేట్ మార్చడం లేదని తెలుస్తోంది.

ఇక టాక్సిక్ విషయానికొస్తే.. యష్ కెరీర్ లో చాలా కీలకమైన సినిమా. కేజీఎఫ్ ఇమేజ్ ను మించి, కొత్త తరహా కథ, కొత్త స్టైల్ లో ఆయన కనిపించబోతున్నారని తెలుస్తోంది. ఇప్పటికే సినిమా నుంచి రిలీజ్ అయిన టీజర్, లుక్ పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మూవీ సూపర్ హిట్ అవుతుందని అంచనాలు ఉన్నాయి. అదే జరిగితే.. యష్ మార్కెట్ మరింత పెరగడం ఖాయం. మరి చూడాలి సినిమా ఎలాంటి హిట్ అవుతుందో..

# నిఖిల్ 'స్వయంభు' బ్లాస్టింగ్ కి రెడీ..!




కార్తికేయ 2 తో పాన్ ఇండియా హిట్ అందుకున్న నిఖిల్ సిద్ధార్థ్ ఆ సినిమా తర్వాత తను చేస్తున్న రెండు భారీ సినిమాల అనౌన్స్ మెంట్ తో హైప్ తెప్పించాడు. అందులో ఒకటి చరణ్ నిర్మాణంలో ది ఇండియా హౌజ్ కాగా మరోటి స్వయంభు. పిరియాడికల్ బ్యాక్ డ్రాప్ తో తెరకెక్కుతున్న ఫిక్షనల్ స్టోరీ స్వయంభు. ఈ సినిమాను భరత్ కృష్ణమాచార్య డైరెక్ట్ చేస్తున్నారు. సినిమా అనౌన్స్ చేసి చాలా రోజులు అవుతున్నా ఇప్పటివరకు ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. ఐతే రీసెంట్ గా నిఖిల్ అండ్ టీం సినిమా మేకింగ్ వీడియోతో సర్ ప్రైజ్ చేశారు.

**ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ కి షిఫ్ట్..** ఆ వీడియో తర్వాత స్వయంభు సినిమాపై ఇంకాస్త ఇంట్రెస్ట్ పెరిగింది.

స్వయంభు సినిమాలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటిస్తుంది. నభా నటేష్ కూడా మరో హీరోయిన్ గా చేస్తుంది. నిఖిల్ స్వయంభు సినిమా రిలీజ్ విషయంలో కాస్త కన్ ఫ్యూజన్ ఏర్పడింది. ముందు ఈ సినిమాను ఫిబ్రవరి 13న రిలీజ్ ఫిక్స్ చేశారు. ఐతే ఇప్పుడు ఆ డేట్ ని మార్చినట్టు తెలుస్తుంది. స్వయంభు సినిమా ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ కి షిఫ్ట్ అయినట్టు తెలుస్తుంది. ఫిబ్రవరి 13న పోటీలో చాలా సినిమాలు ఉండటం వల్ల సినిమాకు సోలో రిలీజ్ ఉంటే బాగుంటుంది అనే ఉద్దేశ్యంతో ఫిబ్రవరి 13న రావాల్సిన స్వయంభు సినిమాను ఏప్రిల్ 10కి వాయిదా వేశారు. సమ్మర్ లో స్టార్ సినిమాల మధ్య నిఖిల్ స్వయంభు సందడి చేయబోతుంది.

**నిఖిల్ లుక్స్ స్టోరీ, స్క్రీన్ ప్లే కూడా..** ఆల్రెడీ మార్చి మంత్ మిడిల్ నుంచి సినిమాల హంగామా ఉండబోతుంది ఏప్రిల్ 10న నిఖిల్ స్వయంభుతో దాన్ని మరింత కొనసాగించాలని ఫిక్స్ అయ్యారు. నిఖిల్ స్వయంభు సినిమాలో నిఖిల్ లుక్స్ ఇంకా స్టోరీ, స్క్రీన్ ప్లే అన్నీ కూడా ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేసేలా ఉన్నాయి. నిఖిల్ స్వయంభు సినిమాను అతని కెరీర్ లోనే భారీ బడ్జెట్ తో వస్తుంది.

ఈ సినిమాతో పాటు ది ఇండియా హౌస్ సినిమా కూడా సంథింగ్ స్పెషల్ గా రాబోతుంది. ఏప్రిల్ 10న నిఖిల్ స్వయంభు బ్లాస్టింగ్ సౌండ్ ఎలా ఉంటుందో చూడాలంటే ఆ డేట్ దాకా వెయిట్ చేయాల్సిందే. స్వయంభు సినిమా వీడియో చూస్తే ఈసారి నిఖిల్ మరింత పకడ్బందీ ప్లానింగ్ తో అదిరిపోయే కథతో వస్తున్నాడని అనిపిస్తుంది.

సినిమా నుంచి ప్రమోషనల్ కంటెంట్ రిలీజ్ ప్లానింగ్ ఇంకా నేషనల్ లెవెల్ లో సినిమా ప్రమోషన్స్ ని కూడా వెరైటీగా ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. కార్తికేయ 2 తర్వాత నిఖిల్ నుంచి వస్తున్న భారీ సినిమా అవ్వడంతో స్వయంభు మీద బీ టౌన్ ఆడియన్స్ కూడా మంచి అంచనాలతో ఉన్నారు.

# ఇంకా ఎంత టైం కావాలి విశ్వంభరా?

'భోళా శంకర్' డిజాస్టర్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి మొదలుపెట్టిన సినిమా 'విశ్వంభర'నే. 2025 సంక్రాంతి టార్గెట్‌గా ఈ సినిమాను మొదలుపెట్టారు. చకచకా షూటింగ్ కూడా పూర్తి చేశారు. మేకింగ్ దశలో ఈ సినిమాకు మంచి హైప్ వచ్చింది కూడా. కానీ టీజర్ రిలీజ్ చేశాక అంతా మారిపోయింది. సబ్‌స్టాండర్డ్ విజువల్స్, ఎఫెక్ట్స్ కారణంగా సోషల్ మీడియాలో బాగా ట్రోలింగ్ జరిగింది. టీం ఆత్మరక్షణలో పడిపోయింది. దీంతో రిలీజ్ వాయిదా వేసి.. విజువల్ ఎఫెక్ట్స్ మీద మళ్లీ పని చేయడం మొదలు పెట్టింది టీం. ఇలా వీఎఫెక్స్ మీద రీవర్క్ చేయడం మొదలుపెట్టి ఏడాది దాటిపోయింది. చాలా నెలల పాటు అసలు టీం నుంచి ఏ అప్‌డేట్ కూడా లేదు. ఐతే గత ఏడాది అందరిలోనూ అయోమయం నెలకొన్న సమయంలో టీం ఒక స్పష్టతనిచ్చింది. చిరు తర్వాత మొదలుపెట్టిన 'మన శంకర వరప్రసాద్' చిత్రానికి సైడ్ ఇస్తూ.. తమ సినిమాను



2026 వేసవికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఇక అప్పట్నుంచి మెగా ఫ్యాన్స్ ఈ సినిమాను పక్కన పెట్టి 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం మీద ఫోకస్ చేశారు. ఈ సినిమాకు మంచి హైప్ వచ్చింది. సంక్రాంతికి రిలీజైన ఈ చిత్రం భారీ విజయాన్నీ అందుకుంది. ఆ తర్వాత 'విశ్వంభర' అప్‌డేట్ కోసం ఎదురు చూస్తున్నారు ఫ్యాన్స్. చెప్పిన ప్రకారమే వేసవిలో సినిమా రిలీజవుతుందని ఆశిస్తుంటే.. ఇప్పుడు మళ్లీ జులై 10 అంటూ కొత్త డేట్ తెరపైకి వచ్చింది. దీంతో మళ్లీ మాట తప్పడం ఏంటి.. వేసవి లాంటి క్రేజీ సీజన్‌ను ఎందుకు వదిలేస్తున్నారు.. ఇలా మళ్లీ మళ్లీ వాయిదా వేస్తే సినిమాకు హైప్ మరింత తగ్గిపోదా.. ఇప్పటికీ సినిమా మీద టీంకు గురి కుదరలేదా.. వీఎఫెక్స్ మీద మళ్లీ పని చేసినా ఔట్ పుట్ మెరుగుపడలేదా.. అని రకరకాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు అభిమానులు. ఈసారి మళ్లీ వాయిదా వేయడానికి కారణమేంటో చెప్పడమో.. లేదంటే కొత్త రిలీజ్ డేట్ ప్రకటిస్తూ ఒక మంచి గ్లింప్స్ రిలీజ్ చేసి మళ్లీ కాన్ఫిడెన్స్ నింపడమో చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# యాదృచ్ఛికం... కేథరిన్ ఉంటే మెగా హిట్!!

మెగాస్టార్ చిరంజీవి 'మన శంకరవర ప్రసాద్' సినిమాతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా మొన్న సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి వారం రోజుల్లోనే అన్ని ఏరియాల్లోనూ బ్రేక్? ఈవెన్? ను నమోదు చేసింది. రెండో వారం పూర్తి అయ్యేప్పటికి సాలిడ్? నెంబర్స్‌ను సొంతం చేసుకుంది. ఈమధ్య కాలంలో ఇలాంటి నెంబర్స్ చూడలేదు అంటూ అభిమానులు, సినీ విశ్లేషకులు మాట్లాడుతున్నారు. చాలా మంది సినిమాలో ఉన్న కామెడీ గురించి, కొందరు వెంకటేష్ పోషించిన పాత్ర గురించి మరి కొందరు అనిల్ రావిపూడి యొక్క సంక్రాంతి సెంటిమెంట్ గురించి మాట్లాడుతున్నారు. కొందరు మాత్రం కేథరిన్ థెర్సా ఉంటే మెగా హిట్ ఖాయం అన్నట్లుగా మాట్లాడుతున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో కొందరు ఈ విషయాన్ని ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. కేథరిన్? థెర్సా 'మన శంకరవర ప్రసాద్ గారు' సినిమాలో హీరోయిన్ కాదు, కానీ సినిమాలో మొదటి నుంచి చివరి వరకు ఆమె పాత్ర ఉంది. ముఖ్యంగా చివర్లో కేథరిన్ పాత్ర ట్విస్ట్అదిరి పోయింది. ఆమె లుక్ తో పాటు, ఆమె పాటల్లో కనిపించిన తీరుకు అంతా కూడా ఫిదా అయ్యారు. అందుకే కేథరిన్ గురించి ఈ సినిమా చూసిన తర్వాత ప్రముఖంగా మాట్లాడుకున్న వారు చాలా మంది ఉన్నారు. ఇంత అందంగా ఉంది, ఇంత బాగా యాక్టింగ్ చేస్తుంది ఎందుకు ఆమెకు సోలో




హీరోయిన్ అవకాశాలు రావడం లేదు పాపం అని వ్యాఖ్యలు చేసిన వారు ఉన్నారు. కానీ కేథరిన్ కి ఎక్కువగా సెకండ్ లీడ్ రోల్స్ లేదా క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలు మాత్రమే వస్తున్నాయి. ఇలాగే ఇంతకు ముందు చిరంజీవితో వాల్తేరు వీరయ్య సినిమాలో ముఖ్య పాత్రలో ఈమె నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమా కూడా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య, మన శంకరవరప్రసాద్? గారు సినిమాల్లో కేథరిన్ థెర్సా హీరోయిన్ కానప్పటికీ ముఖ్య పాత్రలో కనిపించినప్పటికీ సినిమాకు ఆమె చాలా ప్లస్ అయింది, అంతే కాకుండా ఆమెకి సినిమాలు చాలా ప్లస్ అయ్యాయి. ఈ రెండు సినిమాలు మాత్రమే కాకుండా ఈమెను మెగాస్టార్? చిరంజీవి రీ ఎంట్రీ మూవీ ఖైదీ నెం.150లో సైతం ఎంపిక చేయడం జరిగింది. చిరంజీవికి జతగా కేథరిన్ ఖైదీ నెం.150 లో ఐటెం సాంగ్ చేయాల్సి ఉంది. ఆమెను ఎంపిక చేసి, అడ్వాన్స్ సైతం ఇచ్చిన తర్వాత కొన్ని ఈక్వేషన్స్ కారణంగా ఆమెను తప్పించి మరో హీరోయిన్‌తో ఆ ఐటెం సాంగ్ ను చేయించాల్సి వచ్చిందని మేకర్స్ చెబుతూ ఉంటారు. ఆ కారణాలు ఏంటి అనేది తెలియదు, కానీ ఆ సినిమా కోసం కేథరిన్ ను ఎంపిక చేశారు అనేది వాస్తవం.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536